గురువారం 5-1-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 285



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 5-1-2023

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సరిహద్దు రక్షణ స్థానం సియాచిన్‌లో మొట్టమొదటిసారిగా ఒక మహిళా ఆఫీసర్ దళాధిపతిగా నియమితురాలయ్యింది. 15 వేల అడుగున ఎత్తున దేశ రక్షణకు నిలిచిన **కెప్టెన్ శివ చౌహాన్** ఈ పోస్ట్ పొందడానికి ఎంతో కష్టతరమైన ట్రయినింగ్‌ను పూర్తి చేశారు. శివ చౌహాన్ వివరాలు.

సియాచిన్ పై వీర వనిత



గతంలో సియాచిన్‌కు విధి నిర్వహణకు పంపే సైనికులతో అధికారులు 'మీరు ముగ్గురు వెళితే ఇద్దరే తిరిగి వస్తారు' అని హెచ్చరించి పంపేవారు. 'ఇద్దరే తిరిగి వచ్చినా దేశం కోసం పోరాడతాం' అని సైనికులు సమరోత్సాహంతో వెళ్లేవారు. అయితే వారి ప్రథమ శత్రువు పాకిస్తాన్ కాదు. ప్రతికూలమైన ప్రకృతే. మైనస్ 55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, తీవ్రమైన చలి గాలులు, హిమపాతం, కాలు జారితే ఆచూకీ తెలియని మంచులోయలు... సియాచిన్‌లో 35 అడుగుల ఎత్తు మేరకు కూడా మంచు పడుతుందంటే ఊహించండి. ప్రపంచంలోనే ఎత్తయిన యుద్ధస్థావరమైన సియాచిన్ అటు పాకిస్తాన్ నుంచి ఇటు చైనా నుంచి రక్షణ పొందడానికి ఉపయోగపడే కీలకప్రాంతం. అక్కడ ఇన్నాళ్లు మగవారే విధులు నిర్వహించారు. మొదటిసారి ఒక మహిళా ఆఫీసర్ అడుగు పెట్టింది ఆమె పేరే శివ చౌహాన్.



1984 నుంచి

దేశ విభజన సమయంలో వాస్తవాధీన రేఖకు అంచున మానవ మనుగడకు ఏమాత్రం వీలు లేని సియాచిన్ ప్రాంతాన్ని అటు పాకిస్తాన్ కాని ఇటు ఇండియాగాని పట్టించుకోలేదు. కాని 1984లో దాని మీద ఆధిపత్యం కోసం పాకిస్తాన్ ప్రయత్నిస్తున్నదని తెలుసుకున్న భారత్ సియాచిన్ అధీనం కోసం హుటాహుటిన రంగంలో దిగి 'ఆపరేషన్ మేఘదూత్' పేరుతో విజయవంతమైన సైనిక చర్య చేయగలిగింది. ఆ తర్వాత 1999 వరకూ ఇరు పక్షాల మధ్య చర్యలు, ప్రతిచర్యలు సాగాయి. 'వాస్తవ మైదాన స్థానరేఖ'ను ఇరుపక్షాలు అంగీకరించి అక్కడ సైనిక స్థావరాలు నిర్మించుకున్నా మంచు ఖండం వంటి సియాచిన్ మీద భారత్ గాని, పాకిస్తాన్‌గాని తన స్థావరాలను తీసేయలేదు. ఇప్పటివరకూ ఇరువైపులా అక్కడ 2000 మంది సైనికులు మరణించారని అంచనా. వారిలో ఎక్కువ మంది కేవలం ప్రతికూల వాతావరణానికే మరణించారు. సైనిక కాల్పుల్లో కాదు.

అడుగు పెట్టిన ఆఫీసర్

సంప్రదాయిక విధానాలతోనే నడిచే ఇండియన్ ఆర్మీ మహిళల ప్రవేశాన్ని అన్నిచోట్ల అంగీకరించదు. ఇంతవరకూ 9000 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ బేస్ క్యాంప్ వరకే మహిళా ఆఫీసర్లను అనుమతించింది ఆర్మీ. కాని 15000 అడుగుల నుంచి 20 వేల అడుగుల (బాణాసింగ్ బంకర్) ఎత్తు వరకూ సియాచిన్‌లో వివిధ స్థానాలలో ఉండే స్థావరాలకు మహిళా ఆఫీసర్లను పంపలేదు. మొదటిసారిగా శివ చౌహాన్‌కు ఆర్మీ సియాచిన్ హెడ్‌క్వార్టర్స్‌లో పోస్టింగ్ ఇచ్చింది.

కఠిన శిక్షణ

సియాచిన్‌లో ఏ స్థావరంలో విధులు నిర్వహించాలన్నా సియాచిన్ హెడ్‌క్వార్టర్స్‌లోని బేటిల్ స్కూల్‌లో మూడు నెలల శిక్షణ పూర్తి చేయాలి. మిగిలిన మగ ఆఫీసర్లతో పాటు శివ ఈ శిక్షణను పూర్తి చేసింది. ఇందులో కఠినమైన మంచు గోడలను అధిరోహించడం, మంచు లోయల్లో పడినవారిని రక్షించడం, శారీరక ఆరోగ్యం కోసం డ్రిల్ పూర్తి చేయగలగడం వంటి అనేక ట్రయినింగ్‌లు ఉంటాయి. 'ఆమె శిక్షణను విజయవంతంగా పూర్తి చేసింది. మూసను బద్దలు కొట్టింది' అని ఆర్మీ అధికారులు అన్నారు.

రాజస్థాన్ సాహసి

శివ చౌహాన్‌ది రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్. 11వ ఏట తండ్రి మరణిస్తే గృహిణి అయిన తల్లి శివ చౌహాన్‌ను పెంచింది. 'మా అమ్మే నాకు చిన్నప్పటి నుంచి ఆర్మీ మీద ఆసక్తి కలిగించింది' అంటుంది శివ. ఉదయ్‌పూర్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన శివ 2020 సర్వీస్ సెలక్షన్ బోర్డ్ పరీక్షలు రాసి ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. చెన్నైలో ట్రైనింగ్ అయ్యాక 2021లో లెఫ్టినెంట్‌గా ఇంజనీర్ రెజిమెంట్‌లో బాధ్యత తీసుకుంది. ఆ వెంటనే కెప్టెన్ హోదా పొందింది. 2022 కార్గిల్ దివస్ సందర్భంగా సియాచిన్ వార్ మెమోరియల్ నుంచి కార్గిల్ వార్ మెమోరియల్ వరకు 508 కిలోమీటర్ల సైకిల్ యాత్రను శివ చౌహాన్ తన నాయకత్వంలో పూర్తి చేయడంతో ఆమె అధికారుల దృష్టిలో పడింది. దాంతో ఆమెను సియాచిన్‌లో టీమ్ లీడర్‌గా పోస్ట్ వరించింది.

త్రివిధ దళాలలో చరిత్ర సృష్టిస్తున్న స్త్రీల సరసన ఇప్పుడు శివ చౌహాన్ నిలిచింది.

ముగ్గు - ముచ్చట





డి. సుగుణ
సోమాజిగూడ, హైదరాబాద్

21 చుక్కలు, 7 వరుసలు
7 వచ్చేవరకు,
చుక్క వదిలి చుక్క





కోమట్ల ప్రభావతి
ఏబీఎం కాంపౌండ్,
బాపట్ల

25 చుక్కలు,
8 వచ్చే వరకు,
మధ్య చుక్క

ముగ్గులకు ఆహ్వానం

చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్:muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)

విజయపథం

ఏమీ తెలియని రంగంలోకి ప్రవేశించి, ఉన్నత శిఖరాలకు చేరడానికి అద్భుత దీపాలతో పనిలేదు. ఆసక్తి ఉంటే, అనుభవ పాఠాలు తోడుంటే చాలు! అంతంతమాత్రం అవగాహనతో అడ్వర్‌టైజింగ్ రంగంలోకి అడుగు పెట్టిన కైనజ్ కర్మాకర్ ఆ రంగంలో ఉన్నతస్థాయికి చేరుకుంది. ఆదర్శ ఉద్యోగిగా నిలిచింది.

● స్ఫూర్తిని ఇచ్చే సృజన


● కైనజ్ కర్మాకర్

క్రియేటివ్ క్వీన్

సైకాలజీలో పట్టా పుచ్చుకున్న కైనజ్ కర్మాకర్ (ముంబై) అడ్వర్‌టైజింగ్ రంగంలోకి అడుగు పెట్టే నాటికి ఆ రంగం గురించి పెద్దగా తెలియదు. విదేశాలలో ఉన్నత చదువులు చదవాలనే కోరిక సాకారం కాకపోవడంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టింది కైనజ్. అడ్వర్‌టైజింగ్ రంగంలో కనిపిస్తున్న ఆర్ట్ డైరెక్షన్, కాపీ రైటింగ్ అనే రెండు దారుల్లో రెండో దారిని ఎంచుకుంది. దీనికి కారణం తనకు రచనలు చేయడం అంటే ఇష్టం. అయితే అడ్వర్‌టైజింగ్ కాపీ రైటింగ్ గురించి మాత్రం ఏమీ తెలియదు.

ముంబైలోని ఒక యాడ్ ఏజెన్సీలో చేరినప్పుడు, ఉద్యోగంలో చేరినట్లు కాకుండా మొదటిసారిగా బడికి వచ్చిన విద్యార్థిలా అనిపించింది.

'అదృష్టాన్ని నమ్ముకున్నవారు దాని కోసమే నిరీక్షిస్తూ తమకు తెలియకుండానే దురదృష్టంలోకి జారుకుంటారు' అనే మాట ఉంది.అయితే కైనజ్ అదృష్టం కంటే కష్టాన్నే నమ్ముకుంది. 2000 సంవత్సరంలో 'లియో బర్నెట్ ఇండియా'లో చేరినప్పుడు అక్కడ అగ్నెలో డయాస్ పరిచయం అయ్యాడు. తాను ఒక గురువై అడ్వర్‌టైజింగ్‌కు సంబంధించిన సూక్ష్మనైపుణ్యాలను బోధించాడు. విలువైన పాఠాలు అవి.

'ఒగిల్వీ ఇండియా' కంపెనీలో అడుగు పెట్టడానికి ముందు రకరకాల కామెంట్స్ వినిపించాయి...

'కొత్తవాళ్లు అక్కడ పనిచేయడం కష్టం'

'అక్కడ ఎప్పటికప్పుడు నిలదొక్కుకోవడం తప్ప ఉన్నత స్థాయికి చేరడం అనేది కలలో మాట'

అయితే ఇలాంటి కామెంట్స్‌ను పట్టించుకోకుండా తన పనిపైనే పూర్తిగా దృష్టి పెట్టింది కైనజ్.

కంపెనీ నేర్పిన పాఠాలు, కాలం నేర్పిన పాఠాలతో తనలోని సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకుంది.

'ఒగిల్వీ ఇండియా' చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగింది.

'చెప్పే విధానం ఎంత ఆకర్షణీయంగా ఉంటే, మార్పు అనేది అంత త్వరగా మొదలవుతుంది' అంటున్న 46 ఏళ్ల కైనజ్ తన సృజనాత్మక కృషికి దేశ, విదేశాల్లో 40కి పైగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లు అందుకుంది.

'క్లయింట్ సమస్యను తన వ్యక్తిగత సమస్యగా భావించి వెంటనే రంగంలోకి దిగుతుంది. అది పరిష్కారం అయ్యే వరకు కష్టపడుతుంది. తన పనేదో తాను నిశ్శబ్దంగా చేసుకుంటూ పోతుంది తప్ప హడావిడి, ఆర్భాటం కనిపించవు. కైనజ్ ప్రాధాన్యతలలో పని మొదటిస్థానంలో ఉంటుంది. ఔత్సాహికులకు స్ఫూర్తిని ఇచ్చే వ్యక్తి' అంటున్నాడు కైనజ్‌తో ఎన్నో సంవత్సరాలు కలిసి పనిచేసిన హర్షద్ రాజాధ్యక్ష.

'ఒగిల్వీలో ఎందరో దిగ్గజాల దగ్గర ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాను. అడ్వర్‌టైజింగ్‌కు సంబంధించి నా ఆలోచనలు మార్చుకోవడానికి, కొత్తగా ఆలోచించడానికి అవి ఉపకరించాయి' అంటున్న కైనజ్ ఐటీసీ, బ్రూక్ బాండ్, ఫియట్, బజాజ్... మొదలైన ప్రసిద్ధ బ్రాండ్‌లకు పనిచేసింది.

కెరీర్ కొత్తలో చేదు అనుభవాలు ఎదురైనా, వాటిని ఎప్పటికప్పుడూ డిలీట్ చేస్తూ వస్తోంది కైనజ్.

'చేదు జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకోవడం కంటే కొత్త ఐడియాల గురించి ఆలోచించడానికి ఇష్టపడతాను. కొత్తగా ఆలోచించడం అనేది నా వృత్తిలో భాగం. నేను ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలనే ఆలోచన తప్ప వేరే రంగాన్ని ఎంచుకొని ఉంటే బాగుండేది అని ఎప్పుడూ ఆలోచించలేదు. వృత్తిజీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోగలిగే రంగమే నా దృష్టిలో గొప్ప రంగం' అంటుంది కైనజ్ కర్మాకర్.

జర్నీ

ఓ బాటసారీ... మోగించు విజయభేరీ!



ఫాస్టెస్ట్ ఫిమేల్ సోలో సైకిలిస్ట్‌గా గత సంవత్సరం నవంబర్ నెలలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించింది పుణెకు చెందిన ప్రీతి మస్కే. 13 రోజుల 18 గంటల 38 నిమిషాలలో గుజరాత్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ సైకిల్ యాత్రను పూర్తి చేసింది. గుజరాత్‌లోని కోటేశ్వర్ నుంచి మొదలైన ఈ సైకిల్ యాత్ర ఏడు రాష్ట్రాల గుండా సాగి అరుణాచల్‌ప్రదేశ్‌లోని కిబితులో ముగిసింది.

'ప్రతి ఒక్కరూ అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లను చూడాలనుకుంటారు. అయితే సైకిల్‌పై యాత్ర అనేసరికి వెనక్కి తగ్గుతారు. దీనికి కారణం అంతదూరం సైకిల్‌యాత్ర అంత సులువైన విషయం కాదు. ఈ యాత్ర చేయగలనా? అని మొదట్లో నేను కూడా సందేహించాను. కొద్ది సమయంలోనే ఆ సందేహం నుంచి బయటపడి సాహసయాత్రకు పూనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది ప్రీతి.

'యాత్ర కోసం యాత్ర' అని కాకుండా తన యాత్రకు సామాజిక సందేశాన్ని కూడా జోడించింది. దారి పొడుగునా అవయవదానం ప్రాముఖ్యత గురించి ప్రచారం చేస్తూ వెళ్లింది.

చిన్నప్పుడు ప్రీతికి ఆటలు అంటే ఇష్టం. హాకీ, బాస్కెట్‌బాల్ బాగా ఆడేది. అయితే స్కూలు చదువుల తరువాత తనకు ఆటలు దూరమయ్యాయి. 2017లో సరదాగా చేసిన సైకిలింగ్ తన జీవితాన్నే మార్చేసింది. ఎంతో సానుకూల శక్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తోంది.

'ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తరువాత, నలభై ఏళ్ల వయసులో పిల్లలు, కుటుంబం తప్ప వేరే ప్రపంచం ఏదీ తెలియని ప్రపంచంలోకి వెళ్లిపోతాం. సైకిలింగ్ నా కోసం ఎన్నో కొత్త ద్వారాలు తెరిచింది. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. సాధించాల్సింది ఎంతో ఉంది అని చెప్పింది' అంటుంది ప్రీతి.

2019లో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సోలోగా సైకిల్‌యాత్ర చేపట్టినప్పుడు చాలామంది భయపెట్టేలా మాట్లాడారు. అయితే ఆ భయంగొల్పే మాటలు ప్రీతిని వెనక్కి తీసుకువెళ్లకపోగా మరింత ధైర్యాన్ని ఇచ్చాయి. పట్టుదలను పెంచాయి. అసాధ్యం అనుకున్న సైకిల్ యాత్ర విజయవంతం అయ్యేలా చేశాయి. ఇక అప్పటి నుంచి ఆమె వెనక్కి చూడలేదు.

సుదీర్ఘ సైకిల్‌యాత్రలు లేని సమయంలో ఆసక్తి ఉన్నవారికి సైకిలింగ్‌లో శిక్షణ ఇస్తోంది. స్విమ్ చేస్తోంది. శరీరం ఫిట్‌గా ఉండేలా రకరకాల ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. వారాంతాలలో 100 నుంచి 300 కి.మీ వరకు సైకిలింగ్ చేస్తోంది.

ఎన్నో సుదూర సైకిల్ యాత్రలు పూర్తి చేసిన ప్రీతి 'ప్రతి రికార్డ్ ఒక సవాలే. దేనికదే ప్రత్యేకమైనది' అంటోంది.

ఒక మంచిపని, స్ఫూర్తిని ఇచ్చే పని చేస్తే, సాహసాన్ని తట్టిలేపే పనిచేస్తే సమాజం తనకు తానుగా ముందుకు వచ్చి భుజం తట్టి ముందుకు నడిపిస్తుంది.

సైకిల్ యాత్రలో ఎన్నో రాష్ట్రాలలో, ఎన్నోచోట్ల అపరిచితురాలైన తనను ఆప్యాయంగా పలకరించారు ప్రజలు. ఆతిథ్యం ఇచ్చారు. సైకిల్‌కు రిపేర్లు వస్తే బాగు చేయించారు. హైవే హోటళ్ల వాళ్లు కూడా మర్యాదగా పలకరించి తనకు ఆతిథ్యం ఇచ్చారు.

సాధించిన దానితో సంతృప్తి చెంది అదే విజయం అనుకోవడం లేదు ప్రీతి. తాజాగా ఇండియా నుంచి సింగపూర్ సైకిల్ యాత్రకు సన్నద్ధం అవుతోంది.

'సాధ్యం అవుతుంది' అనడం తేలిక.

'అసాధ్యం' అనుకోవడం అంతకంటే తేలిక.

అయితే అసాధ్యాలను, సుసాధ్యం చేయడం కొందరికే సాధ్యం. ఆ కొందరిలో ప్రీతీ మస్కే ఒకరు.

అన్యోన్య సేవ

**వివేకానందుడు యువతకు స్ఫూర్తిప్రదాత.
ఆ స్ఫూర్తితో నడిచిన యువకుడు రామకృష్ణారెడ్డి.
అతడి బాటలోనే అడుగులేసిన భార్య రామ తులసి.
వీరి అవిశ్రాంత సేవాపరిశ్రమకు ఓ గుర్తింపు.
ఆ గుర్తింపునకు చిహ్నంగా ఓ పురస్కారం.
ఆ యువజంట పెద్ద మనసుకు ఇది పరిచయవాక్యం.**


● రామకృష్ణా రెడ్డి, రామ తులసి

వివేకవంతమైన స్ఫూర్తి

పాపజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులు వైఎస్ఆర్ కడప జిల్లా, కాశినాయన మండలం, ఓబుళాపురంలో సగిలేరు ఒడ్డున వివేకానంద సేవాశ్రమాన్ని ప్రారంభించి వృద్ధుల సేవ చేస్తున్నారు. వారి నిస్వార్థ సేవకు గత నెల 24వ తేదీన కేంద్రమంత్రి మురళీధర్ చేతుల మీదుగా 'జనమంచి గౌరీశంకర్ యువ పురస్కారం' అందుకున్నాడు రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా ఈ దంపతులు సాక్షితో పంచుకున్న సేవాప్రస్థాన వివరాలివి.

''అది 2014. మా అమ్మానాన్న నాకు పెళ్లి సంబంధం తెచ్చారు. అబ్బాయి రైల్వే ఉద్యోగి. జీవితం హాయిగా ఉంటుందని, వాళ్లు సంతోషంగా ఉన్నారు. పెళ్లి చూపుల్లో ఆయన నాతో మాట్లాడినప్పుడు చెప్పిన ఒకే ఒక మాట నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు పెళ్లి చేసుకునే ఆలోచనే లేదని, వివేకానందుని స్ఫూర్తితో సమాజ సేవకు అంకితం కావాలనుకున్నానని, వాళ్ల అమ్మానాన్న పట్టుబట్టి పెళ్లి చూపులకు తీసుకువచ్చారని... చెప్పారు. తన నెల జీతంలో సగం సమాజ సేవకు ఖర్చు చేయాలని తీర్మానించుకున్నట్లు కూడా చెప్పారు. నేను డిగ్రీ చదివాననే కానీ నాకప్పటికి సోషల్ సర్వీస్ అంటే ఏం చేస్తారనే అవగాహన కూడా లేదు. ఇతరులకు మంచి చేయాలనుకుంటున్నాడంటే మంచివాడేలాగుందని పెళ్లికి ఒప్పుకున్నాను. పెళ్లయిన తర్వాత ఆయనతో కలిసి హాస్పిటల్, స్కూళ్లకు వెళ్లాను. మా వారు ఏమిటనేది అర్థం కాసాగింది. కానీ ఒక ఏడాది పాటు ఆందోళనగానే గడిచింది.

ఫోన్ రావడం... వెళ్లిపోవడం

హాస్పిటళ్లు, స్కూళ్లకు ఎప్పుడు వెళ్లేది ముందుగానే తెలుస్తుంది. ఆరోగ్యం బాగాలేని వాళ్లను ఇంటికి తీసుకువచ్చి రెండు-మూడు రోజులు ఉంచుకుని వైద్యం చేయించి పంపించేవారు. వాళ్లకు అవసరమైనవి చూసుకోవడం కూడా నాకు ఇబ్బంది కలగలేదు. కానీ ఎమర్జెన్సీ సర్వీస్‌లు నన్ను భయపెట్టేవి. ఆశ్రమం నిర్మాణానికి ముందు మేము ప్రొద్దుటూరులో ఉండేవాళ్లం. ఆయన ఉద్యోగానికి వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత ఏ అర్ధరాత్రో బ్లడ్ కావాలని, ఎవరో మరణించారు అంత్యక్రియలు చేయాలని ఫోన్ వచ్చేది. ఫోన్ కాల్ మాట్లాడుతూనే నాకు బయలుదేరుతున్నానని చెప్పి వెళ్లిపోయేవారు. నేను ఏడవ నెల గర్భంతో ఉన్నప్పుడు వచ్చిన అంత్యక్రియల ఫోన్ కాల్ ఎంతగా భయపెట్టిందో ఇప్పటికీ మర్చిపోలేను. నాకు మరణించిన వారిని చూడాలంటేనే భయం, వారం- పది రోజుల పాటు రాత్రి కలలు వచ్చేవి. అందుకే పెళ్లికి ముందు నన్ను బంధువుల మరణాలకు కూడా తీసుకువెళ్లేవారు కాదు. అలాంటిది ఈ సేవలో ఏ క్షణాన మరణం గురించి వినాల్సి వస్తుందోనని భయమేసేది. అలాంటి నేను ఇప్పుడు ఆయన డ్యూటీలో ఉన్నప్పుడు మా సేవాశ్రమంలో ఎవరైనా తుదిశ్వాస వదిలితే స్వయంగా అన్ని కార్యక్రమాలనూ పూర్తి చేస్తున్నాను. కరోనా సమయంలో ఓ వ్యక్తి మరణిస్తే భార్య, పిల్లలు కూడా ముందుకురాలేదు, అప్పుడు ఆ పార్థివదేహాన్ని మోసి అంత్యక్రియలు చేశాను.

రక్తదానం ప్రాణదానమే అని తెలిసింది

రక్తం కోసం ఫోన్ వచ్చిన వెంటనే మా వారు ఎందుకు అంతగా పరుగులు తీసేవారో నా డెలివరీలో తెలిసి వచ్చింది. రక్తం ఎక్కువగా పోవడంతో నాకు రక్తం ఎక్కించాల్సి వచ్చింది. ఆలస్యమైతే తల్లీబిడ్డల్లో ఒకరే దక్కుతారని చెప్పారు. మా వారు బ్లడ్ డొనేషన్ వాట్సాప్ గ్రూప్‌లో పెట్టగానే ఓ అన్న గంటలోపే వచ్చి రక్తం ఇచ్చి నన్ను రక్షించారు. ఆ తర్వాత నుంచి నేను కూడా బ్లడ్ డొనేట్ చేస్తున్నాను.


● ఆశ్రమవాసులకు భోజనం వడ్డిస్తున్న రామ తులసి

ఆశ్రమంలోనే నివాసం

ఏ దిక్కూ లేని వాళ్ల కోసం ఒక స్థిర నివాసం ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చిన తర్వాత స్థలం కోసం చాలా ప్రయత్నాలు చేశాం. మా సంకల్పానికి ఆ భగవంతుడే దారి చూపించినట్లు మాజీ ఆర్మీ ఉద్యోగి విద్యార్థన రెడ్డిగారు ఎకరా స్థలం ఇచ్చారు. అందులో నిర్మాణం ఎలాగన్నది ఆ తర్వాత మా ముందున్న ప్రశ్న. 2018లో భూమి పూజ చేసి పనులు మొదలుపెట్టాం. కానీ ముందుకు సాగలేదు. నా పెళ్లికి మా పుట్టింటి వాళ్లు పెట్టిన బంగారం ఇచ్చాను. బ్యాంకులో తాకట్టు పెడితే రెండు లక్షలు వచ్చాయి. మా వారి ఫేస్‌బుక్ ఫ్రెండ్ రాజోలు శ్రీధర్‌రెడ్డిగారు తాడిపత్రిలో వ్యాపారి. ఆయన లక్ష రూపాయలతో బోరు వేయించారు. నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు ఊరి వాళ్లు ఐదు వందల నుంచి ఎంత ఇవ్వగలిగితే అంత మొత్తం ఇచ్చారు. ఈ భవన నిర్మాణంలో వందలాది మంది భాగస్వామ్యం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఉండే రామకృష్ణారెడ్డి అనే దాత ఆ సమయంలో ఇక్కడికి రావడం కూడా దేవుడు పంపినట్లే జరిగింది. ఆయన ఆరు లక్షల రూపాయల వరకు సహాయం చేశారు. మా సేవాశ్రమం 2021 జనవరి 12న వివేకానంద జయంతి రోజే ప్రారంభమైంది. రెండు రోజులకు ముగ్గురు వచ్చారు, ఇప్పుడు పన్నెండు మంది ఉన్నారు. మా నివాసం కూడా ఆశ్రమంలో వారితోనే.

వైద్యసహాయం


ఆశ్రమవాసులకు ఆహారం అందివ్వగలుగుతున్నాం. కానీ వైద్యఖర్చులు మా శక్తికి మించి ఉండడంతో పోరుమామిళ్లలోని బ్లెస్డ్ బ్రయాన్ హాస్పిటల్ డాక్టర్‌లు ఉచితంగా వైద్యం చేస్తున్నారు. ఆశ్రమ నిర్వహణ, బ్యాంకు ఈఎమ్‌ఐలకు డబ్బు తగ్గినప్పుడు మా తమ్ముడు, ఆయన తమ్ముడు కూడా సహాయం చేస్తున్నారు. ముఖ్యమైన కార్యక్రమాల సమయంలో మాత్రం ఈ ఫౌండేషన్ ఏర్పాటు ఆలోచన నుంచి ఆయనకు తోడుగా ఉన్న స్నేహితులు ఆదుకుంటున్నారు. స్టూడెంట్స్‌గా ఉన్నప్పుడు మొదలైన వారి ఆలోచనకు ప్రతిరూపమే ఈ ఆశ్రమం. ఇప్పుడు వాళ్లలో ఒకరు పోలీస్, ఒకరు ఆర్మీ జవాన్, మా వారు రైల్వే గేట్ మేన్. ఒకరు ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. చేతినిండా డబ్బు ఉండి మొదలు పెట్టిన సేవ కాదిది. సేవ అవసరమైన చోట డబ్బు లేకపోయినా సరే వెనుకాడకుండా వేసిన ముందడుగు''.

– ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : **పాలకొలను వెంకటరామిరెడ్డి**, సాక్షి, బద్వేల్, కడప జిల్లా

పురస్కారం అందరిదీ!

మాది కడప జిల్లా, కలసపాడు మండలం, తెల్లపాడు గ్రామం. రెండెకరాల భూమి. వర్షమే ఆధారం. మా అమ్మానాన్నలు కష్టపడి చదివించారు. నేను ఇంటర్‌లో కాలేజ్ టాపర్, జిల్లాలో సెకండ్ ప్లేస్. నా పరిస్థితి చూసి ఓ పెద్దాయన ఉద్యోగం వచ్చే వరకు సహాయం చేస్తానని నాకు బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయించి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున ఉద్యోగం వచ్చే వరకు సహాయం చేశారు. ఇతర ఖర్చులకు ట్యూషన్‌లు చెప్పేవాడిని. దసరా, వేసవి సెలవుల్లో బేల్దారి పనులు, భవనాలకు రంగులు వేయడం వంటి పనులు చేశాను. అలా రూపాయి రూపాయి జమ చేసుకుంటున్న రోజుల్లో కూడా రోడ్డు మీద అన్నం లేని వాళ్లకు అన్నం పెట్టడం వంటివి చేసేవాడిని. దీనంతటికీ కారణం వివేకానందుని స్ఫూర్తి. స్వామి వివేకానందుని గురించి ఇంటర్‌లో ఉండగా తెలిసింది. అప్పటి నుంచి ఏడాదిపాటు వివేకానందను విపరీతంగా చదివాను. ఆ ప్రభావమే నన్ను సేవామార్గం వైపు మళ్లించింది. ఈ పురస్కారం నా జీవితంలో ఓ మైలురాయి. నా పనిని మరొకరు గుర్తించారు అనే సంతోషం. పురస్కారం అందుకున్న చేతులు నావే. కానీ పురస్కారానికి నాకు అర్హతను చేకూర్చిన చేతులు ఎన్నో చెప్పలేను. ఈ గౌరవం నా స్నేహితులు, నా భార్య, తమ్ముడు, బావమరిది, ఇతర దాతలందరిదీ.

– పాపిజెన్ని రామకృష్ణారెడ్డి,
ఫౌండర్, వివేకానంద సేవాశ్రమం



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 285


గురువారం 5-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




సిరీస్ లక్ష్యంగా..

పుణేలో నేడు శ్రీలంకతో రెండో టీ20 మ్యాచ్ ఆడనున్న భారత్ - 12లో



కొత్త ఏడాదిలో తొలి నష్టం

సెన్సెక్స్ 637 పాయింట్ల పతనం.. 18,150 దిగువకు నిఫ్టీ - 13లో



బిల్కిస్ పిటిషన్‌పై విచారణ

బిల్కిస్ అత్యాచార దోషుల ముందస్తు విడుదలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది.

వివరాలు 6లో ▸



ఢీకొట్టి.. 3 కిలోమీటర్లు లాక్కెళ్లి..

యూపీలోని మావై బుజుర్గ్ గ్రామంలో స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళా లెక్చరర్‌ను ఓ భారీ ట్రక్కు ఢీకొట్టి 3 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లింది.

వివరాలు 6లో ▸



గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు నిధులు

దేశంలో కర్బన ఉద్గారాలను తగ్గించే గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు కేంద్రం ఈ ఏడాది రూ.19,744 కోట్లను కేటాయించింది.

వివరాలు 6లో ▸



అమెరికా రాయబారిగా ఎరిక్

భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్‌ను, కీలక పదవుల్లో పలువురు ఇండియన్ అమెరికన్లను అధ్యక్షుడు బైడెన్ పునర్నియమించారు.

వివరాలు 6లో ▸

బాబు మరో షో!

పబ్లిసిటీ కోసం మరోసారి ప్రతిపక్ష నేత చీప్ ట్రిక్స్

- కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యం..
- సభలు, రోడ్ షోలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్న ప్రభుత్వం
- రచ్చ చేయాలనే పక్కా ప్రణాళికతో స్పందించని చంద్రబాబు
- కుప్పంలో అనుమతి లేకుండా రోడ్‌షో నిర్వహణకు విఫలయత్నం
- స్థానికుల నుంచి స్పందన కరువు.. ఇతర ప్రాంతాల నుంచి జనం తరలింపు
- రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు.. పోలీసులతో వాగ్వాదం, తోపులాట
- అరెస్ట్ చేస్తే ఎల్లో మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం పొందేలా వ్యూహం
- ప్రభుత్వంపై ఇష్టానుసారంగా నోరు పారేసుకున్న చంద్రబాబు
- పోలీసుల సంయమనంతో ఫలించని 'పచ్చ' వ్యూహం

3 లో



121 పెద్దూరు వద్ద పోలీస్ అధికారిని తీవ్ర స్వరంతో దూషిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

రోడ్లపై సభలు వద్దంటే రభసా?

- వీటితో కందుకూరు ఘటనలు మళ్లీ మళ్లీ జరిగే అవకాశం
- అందుకే రోడ్లపై సభలు, సమావేశాలకు అనుమతి లేదంటూ జీవో నంబర్–1 విడుదల
- ప్రత్యామ్నాయంగా మైదానాలు, ఖాళీ స్థలాల్లో సభలు పెట్టుకోవచ్చు.. మిగతా కార్యక్రమాలకు పోలీసుల ముందస్తు అనుమతి తీసుకుంటే చాలు
- ఈ ఉత్తర్వులకు కూడా చంద్రబాబు వక్రభాష్యం

3 లో



GOVERNMENT OF ANDHRA PRADESH ABSTRACT

ప్రభుత్వం జారీ చేసిన జీవో

మళ్లీ ఉద్యోగాల జోష్

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ఆదేశం

సచివాలయాల పనితీరుపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష

- త్వరితగతిన అర్జీల పరిష్కారానికి మరిన్ని చర్యలు
- ఒకే అర్జీ మళ్లీ వస్తే పైస్థాయి పరిశీలనకు పంపించాలి
- సిబ్బందిపై శాఖల వారీగా మండల స్థాయిలో పర్యవేక్షణ
- తద్వారా ఉద్యోగుల హాజరు పెరిగి సమస్యలు పరిష్కారం
- ఏ ఉద్యోగి ఏం చేయాలన్న దానిపై పూర్తి స్పష్టత
- నెలాఖరుకు రాష్ట్ర సచివాలయం మొదలు గ్రామ సచివాలయం వరకు ఫేషియల్ హాజరు
- సుస్థిర ప్రగతి లక్ష్యాలపై సిబ్బందికి అవగాహన ఉండాలి
- అన్ని సచివాలయాలు వైర్డు ఇంటర్‌నెట్‌తో అనుసంధానం
- సచివాలయాల పర్యవేక్షణలోకే అంగన్‌వాడీలు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దేశ చరిత్రలో రికార్డు స్థాయిలో ఒకేసారి దాదాపు 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కొత్తగా మంజూరు చేయడంతో పాటు, కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే వాటిని భర్తీ చేయడం తెలిసిందే. తొలి విడతలో భర్తీ కాని పోస్టులకు వరుసగా రెండో ఏడాది నియామక ప్రక్రియ చేపట్టడమూ విదితమే. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలకు సంబంధించి బుధవారం సీఎం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమయంలో సచివాలయాల్లో ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయండి. గత నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టారని

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రాజకీయాలకు ఎస్ఎం కృష్ణ గుడ్‌బై



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత ఎస్ఎం కృష్ణ క్రియాశీల రాజకీయాలకు 'గుడ్‌బై' చెప్పారు. వయసు రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అందుకే ప్రజల్లోకి రావడం లేదని చెప్పారు.

వివరాలు 14 ▸

రాజవొమ్మంగి పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం



అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి పీహెచ్‌సీని జాతీయ ఆరోగ్య భద్రత ప్రమాణాల పరిశీలన బృందం తనిఖీ చేసింది. అన్నీ సక్రమంగా ఉంటే ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్, ఏడాదికి రూ.లక్ష చొప్పున మూడేళ్ల పాటు మంజూరవుతాయి.

వివరాలు 14 ▸

విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు కన్నుమూత



విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు (84) బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు గురువారం అనకాపల్లి జిల్లా యలమంచిలిలో జరుగుతాయి.

వివరాలు 2 ▸

రేపటి నుంచి విశాఖలో హెల్త్‌కేర్ సమ్మిట్



విశాఖపట్నంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు గ్లోబల్ హెల్త్‌కేర్ సమ్మిట్ జరగనుంది. ఈ సదస్సులో దేశవిదేశాలకు చెందిన దాదాపు 450 మంది వైద్యులు పాల్గొని.. మానసిక వైద్యం, నెఫ్రాలజీ, చిన్నారుల ఆరోగ్యం, హృద్రోగ సమస్యలపై చర్చిస్తారు.

వివరాలు 14 ▸

బడి బయటి పిల్లలంతా బడుల్లోకి

డ్రాపవుట్లు లేకుండా పాఠశాల విద్యాశాఖ చర్యలు

- స్కూళ్లకు రాని పిల్లల విషయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అప్రమత్తం
- ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన
- క్షేత్రస్థాయి పకడ్బందీ చర్యలతో సత్ఫలితాలు
- 1.73 లక్షల మంది పిల్లలను గుర్తించగా 80 శాతానికి పైగా చేరికలు
- తల్లిదండ్రులతో ఇతర ప్రాంతాలకు వెళ్లినవారికి అక్కడి బడుల్లో ప్రవేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బడి ఈడు పిల్లలందరికీ చదువు చెప్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. బడి బయట ఒక్క విద్యార్థి కూడా లేకుండా గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులతో సమన్వయం చేసుకుని పాఠశాల విద్యా శాఖ చర్యలు చేపడుతోంది. బడికి వెళ్లని బడి ఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా పిల్లలంతా పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపడుతున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా రాష్ట్రంలో మొత్తం 1,73,291 మంది పిల్లలను గుర్తించగా ఇందులో ఇప్పటికే 80 శాతానికి పైగా పిల్లలను బడుల్లో చేర్పించారు. కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులతో పాటు వారు పనులు చేస్తున్న వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఆ పిల్లలు చదువులు కొనసాగించేలా కూడా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఫలితంగా బడుల్లో చేరికలు గతంలో కన్నా

మిగతా 14వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఆయనే మనకు శిక్షణా తరగతులు నిర్వహించేది!

అనాథీనం, ఖాళీ కాలమ్ భూముల సమస్యకు

పరిష్కారం

- చుక్కల భూముల చట్టం పరిధిలోకి ఈ రెండు రకాల భూములు
- 2017 చుక్కల భూముల చట్టానికి సవరణ
- ఆర్డినెన్స్ జారీ చేసిన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు.. ప్రైవేటు భూములుగా నిర్ధారించి, రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- 50 వేల ఎకరాలు.. దాదాపు 40 వేల మంది రైతులకు లబ్ధి

10 లో

ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్

రిజిస్ట్రేషన్లు ప్రారంభం

జీఐఎస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రులు

14 లో

అస్థిర చార్జీలా..

అవేంటి?

- విద్యుత్ రంగ పరిభాషలో అటువంటివేమీ లేవు.. హిందుజాతో ఒప్పందాన్ని గత ప్రభుత్వం రద్దు చేసింది
- ఈ రద్దు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్ తప్పుపట్టాయి
- కొనుగోలు ఒప్పందాలకు ఏపీఈఆర్సీ గత ఆగస్టులోనే అనుమతులిచ్చింది
- స్థిర చార్జీల కోసం హిందుజా విజ్ఞప్తిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- రూ.2,300 కోట్ల కోసం హిందుజా ఒత్తిడి చేస్తోందనడం అవాస్తవం.. సుప్రీం, ఏపీఈఆర్సీ ఆదేశాల మేరకే సర్కార్ చర్యలు
- పచ్చ పత్రిక తప్పుడు రాతలను ఖండించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధన శాఖ

14 లో




కాకినాడ జిల్లా తేటగుంటలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా


తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత


శ్రీకాకుళం జిల్లా పెద్దపాడులో వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


తిరుపతి ఆసుపత్రిలో అన్నమయ్య జిల్లా కోన గ్రామానికి చెందిన మల్‌రెడ్డికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మీకాంత్


విజయవాడ పున్నమి తోటలోని అడుసుమిల్లివారి వీధికి చెందిన ఆంథోనీకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ భువన్ ప్రకాష్‌రెడ్డి


శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో పార్వ తీపురం జిల్లా సింగన్న వలసకి చెందిన వెంకటరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అరుణ్‌కుమార్



పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జిగా లేళ్ళ అప్పిరెడ్డి

- పార్టీ సోషల్ మీడియా, మీడియా కోఆర్డినేటర్‌గా సజ్జల భార్గవ రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని నియమించారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా, పార్టీ మీడియా కోఆర్డినేటర్‌గా సజ్జల భార్గవ రెడ్డిని నియమించారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

హత్య కేసును సీబీఐకి అప్పగించేందుకు హైకోర్టు నిరాకరణ



సాక్షి, అమరావతి: తమ కుమారుడు సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేశారని, ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ మృతుని తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దర్యాప్తులో భాగంగా సేకరించిన సీసీ ఫుటేజీకి సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికను 15 రోజుల్లో తెప్పించుకోవాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా సీసీ ఫుటేజీలోని వ్యక్తులను గుర్తించి సుబ్రహ్మణ్యం హత్య విషయంలో వారి పాత్రను నిర్ధారించుకోవాలని స్పష్టం చేసింది. వారి పాత్ర నిర్ధారణ అయితే అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించింది. దర్యాప్తును వేగవంతంగా పూర్తిచేసి సంబంధిత కోర్టులో మూడు నెలల్లో తుది చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు బుధవారం తీర్పు వెలువరించారు.

సమష్టిగా నడుద్దాం.. క్లీన్ స్వీప్ చేద్దాం

- విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- వచ్చే ఎన్నికలను సీరియస్‌గా తీసుకుందాం
- మన లక్ష్యం 152 కాదు.. 175 స్థానాలు
- ఈ ఎన్నికల్లో గెలిస్తే వచ్చే 30 ఏళ్లూ అధికారం మనదే
- అభిప్రాయ భేదాలుంటే పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేయండి
- విజయవాడ తూర్పు నుంచి దేవినేని అవినాష్‌ను గెలిపించండి


సమావేశానికి హాజరైన విజయవాడ వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంతా సమష్టిగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో అన్ని శాసనసభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని విజయవాడ తూర్పు నియోజకవర్గ కార్యకర్తలకు ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల ద్వారా బటన్ నొక్కి డీబీటీ(ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో 88 శాతం కుటుంబాలకు మంచి చేశామని.. విద్య, వ్యవసాయ, వైద్య రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని.. వికేంద్రీకరణ ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని వివరించారు. దాంతో ప్రజల్లో మార్పు ప్రస్ఫుటంగా కన్పిస్తోందన్నారు. గడప గడపకూ వెళ్లి.. ప్రజలతో మమేకమై.. చేస్తున్న మంచిని చెప్పి.. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరాలని ఉద్బోధించారు. వచ్చే ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకురావాలని మార్గనిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ విజయవాడ తూర్పు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రతి కార్యకర్తతో విడివిడిగా మాట్లాడి.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం ఏమన్నారంటే..

ప్రజలతో మమేకమవ్వండి

- నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తుండటానికి ప్రధాన కారణం.. ఒకటి కార్యకర్తలను కలుసుకోవడం, రెండు మరో 14–15 నెలల్లో జరగనున్న ఎన్నికలకు సమాయత్తం చేయడం. సచివాలయాల వారీగా కన్వీనర్లు, అలాగే ప్రతి 50 – 70 ఇళ్లకు గృహసారథులను పార్టీ నుంచి నియమిస్తున్నాం. పార్టీ కార్యక్రమాల్లో వారిని భాగస్వామ్యులను చేసుకుంటూ ముందుకు వెళ్దాం. గృహ సారథుల్లో ఒకరు కచ్చితంగా మహిళ అయి ఉండాలి.


సీఎం వైఎస్ జగన్‌తో దేవినేని అవినాష్

- గడపగడపకూ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమవ్వండి. మూడున్నరేళ్లుగా చేస్తున్న మంచిని అక్కాచెల్లెమ్మలకు వివరించండి. వారి ఆశీర్వాదం తీసుకోండి. ఏ ఒక్కరికైనా ఏ చిన్న సమస్య ఉన్నా, అర్హత ఉండి మిస్ అయిపోతే దాన్ని పరిష్కరించి మంచి చేయాలి. అర్హులెవ్వరూ మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ఇంత ధ్యాస పెడుతున్నాం. గతంలో ఎవ్వరూ, ఎప్పుడూ ఇంత ధ్యాస పెట్టలేదు. ఏడాదిలో రెండుసార్లు అలాంటి వారికి అన్నీ మంజూరు చేస్తున్నాం.

ప్రస్ఫుటంగా రాజకీయ మార్పు

- రాష్ట్రంలో 88% ఇళ్లకు మంచి చేశాం. ప్రతి అక్క, చెల్లెమ్మ పేర్లతో సహా చేసిన మంచిని పారదర్శకంగా చెప్పగలం. అందుకనే రాష్ట్రంలో ఎప్పుడూ జరగని రాజకీయ మార్పు జరుగుతోంది. కుప్పంలాంటి చోట్ల మున్సిపాల్టీ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు ఇలా అన్ని ఎన్నికల్లో 80%కి పైగా క్లీన్ స్వీప్ చేయగలిగాం. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కూడా 21 డివిజన్లలో 14 చోట్ల గెలిచాం. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్నచోట కూడా మనం అధికంగా వార్డులు గెలవగలిగాం. మార్పు అనేది కనిపిస్తోంది. దీనికి నిదర్శనమే కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.

టార్గెట్ 152 కాదు.. 175

- వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా 175 కు 175 సీట్లు మనం గెలవాలి. అలాంటి పరిస్థితి ఇవాళ రాష్ట్రంలో ఉంది. ఏ వార్డులోకి వెళ్లినా, గ్రామంలోకి వెళ్లినా.. ప్రతి ఇంట్లో కూడా సంతోషం కనిపిస్తోంది.
- మన ప్రాంతంలో స్కూళ్లు మారుతున్నాయి.. చదువులు మారుతున్నాయి.. ఆస్పత్రులు మారుతున్నాయి. ఆర్బీకేల ద్వారా వ్యవసాయం మారుతోంది. ఇంత మార్పు అన్నది ఎప్పుడూ జరగలేదు. వచ్చే ఉగాది నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పూర్తి స్థాయిలో వస్తుంది. విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో మనం తీసుకొచ్చిన మార్పులన్నీ పూర్తి స్థాయిలో ఫలితాలు ఇస్తాయి. కాబట్టి ఈ ఎన్నికలకు మనం అంతా కలిసికట్టుగా పని చేయాలి. ఎలాంటి విభేదాలున్నా పక్కన పెట్టాలి.
- వచ్చే ఎన్నికలను సీరియస్‌గా తీసుకుందాం. గత ఎన్నికల్లో 151 స్థానాల్లో విజయం సాధించాం. వచ్చే ఎన్నికల్లో మన టార్గెట్ 152 కాదు.. 175 స్థానాల్లో గెలవడమే మన టార్గెట్. ఈసారి గెలిస్తే.. మరో 30 ఏళ్లు మనమే అధికారంలో ఉంటాం. 30 ఏళ్లపాటు మంచి పరిపాలన ప్రజలకు అందిస్తాం.
- నాకు ఎన్ని కష్టాలు ఉన్నాసరే.. బటన్ నొక్కే కార్యక్రమాన్ని చేస్తున్నాను. మీరు చేయాల్సిన పనులు మీరు చేయాలి. ఒకరికొకరు కలిసి ఈ ఎన్నికల్లో గట్టిగా పనిచేయాలి. ప్రతి ఇంటికీ వెళ్లి.. వారి ఆశీర్వాదాలు తీసుకోవాలి. మనకు ఓటు వేయని వారి ఇళ్లకు కూడా మనం వెళ్లాలి. చేసిన మంచిని వారికి వివరిస్తే.. కచ్చితంగా వారిలో కూడా మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. మనం వెళ్లకపోతే తప్పు చేసినట్టు అవుతుంది. అందుకనే ప్రతి ఇంటికీ వెళ్లాలి. అందరి ఆశీర్వాదాలు కోరాలి. మంచితనంతో మన ప్రయత్నం మనం చేయాలి.
- విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల
అధ్యక్షుల నియామకం

- బీసీ సెల్ అధ్యక్షుడిగా జంగా కృష్ణమూర్తి
- యువజన విభాగం అధ్యక్షుడిగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- మహిళా విభాగం అధ్యక్షురాలిగా పోతుల సునీత

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీకి చెందిన 22 అనుబంధ విభాగాలకు రాష్ట్ర అధ్యక్షులను నియమించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిపినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

విభాగం	అధ్యక్షుడు
యువజన విభాగం	బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
బీసీ సెల్	ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి
మహిళా విభాగం	ఎమ్మెల్సీ పోతుల సునీత
ఎస్టీ సెల్	మత్స్యరాస వెంకటలక్ష్మి(కొండ ప్రాంతం), మేరాజోత్ హనుమంత్ నాయక్(మైదాన ప్రాంతం)
రైతు విభాగం	ఎంవీఎస్ నాగిరెడ్డి
విద్యార్థి విభాగం	పానుగంటి చైతన్య
చేనేత	గంజి చిరంజీవి
వైఎస్సార్‌టీయూసీ	డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి
వికలాంగుల విభాగం	బందెల కిరణ్‌రాజు
సాంస్కృతిక విభాగం	వంగపండు ఉష
ప్రచార విభాగం	ఆర్.ధనుంజయరెడ్డి, పుత్తా ప్రతాప్‌రెడ్డి
గ్రీవెన్స్ సెల్	అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి
న్యాయ విభాగం	ఎం.మనోహరరెడ్డి
ఐటీ విభాగం	సునీల్ పోసింరెడ్డి
ఎన్ఆర్ఐ విభాగం	మేడపాటి వెంకట్
వైఎస్సార్‌టీఎఫ్	ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి
ఎస్సీ సెల్	ఎమ్మెల్యే కైలే అనిల్, జూపూడి ప్రభాకర్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్
మైనార్టీ సెల్	షేక్ వి.ఖాదర్ బాష
వైఎస్సార్ సేవాదళ్	కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి
డాక్టర్ల విభాగం	డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి
క్రిస్టియన్ మైనార్టీ సెల్	జాన్సన్ మేడిది
వాణిజ్య విభాగం	పల్లపోతు మురళీకృష్ణ, కుప్పం ప్రసాద్

కనికరించిన పింఛన్!

పెరవలి: ఆమె పేరు దోనెల కృష్ణవేణి. స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలోని ఖండవల్లి. 35 ఏళ్ల వయసున్న ఆమె పుట్టుకతో దివ్యాంగురాలు(మూగ,చెవుడు). అవివాహితురాలైన ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. పేద కుటుంబం. తండ్రి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కృష్ణవేణికి వికలాంగ పింఛన్ కోసం ఏళ్ల తరబడి తల్లిదండ్రులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. చంద్రబాబు హయాంలో వైకల్యం 30 శాతమేనంటూ తిరస్కరించారు. జన్మభూమి కమిటీలు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు ఇక ప్రయత్నాలు మానుకున్నారు. అయితే వీరి విషయం తెలుసుకున్న పెరవలి ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్ చొరవ తీసుకుని ఎంపీడీవో రమేష్‌కు చెప్పి కృష్ణవేణి వికలాంగ పింఛన్ దరఖాస్తును ఆన్‌లైన్ చేయించారు. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి దృష్టికి కూడా ఈ విషయాన్ని ఎంపీపీ తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఈ దరఖాస్తును తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత దృష్టికి తీసుకెళ్లి పింఛన్ మంజూరు చేయించారు. బుధవారం ఖండవల్లిలో నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తల్లి లక్ష్మీపార్వతితో కలసి కృష్ణవేణి పింఛన్ అందుకుంది. ఆ సమయంలో తల్లీ కూతుళ్ల ముఖాల్లో చెప్పలేని ఆనందం తొణికిసలాడింది. సభలో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ 'ఈ రాష్ట్రానికి జగనే సీఎంగా ఉండాలి.. అప్పుడే మాలాంటోళ్లకి మేలు జరుగుతుంది' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు.


తల్లి లక్ష్మీపార్వతితో పింఛన్ పొందిన కృష్ణవేణి

సీఎం జగన్ వల్లే మాకు మేలు

- తీవ్ర భావోద్వేగానికి లోనైన టీడీపీ నేత, జన్మభూమి కమిటీ సభ్యుడు

పిఠాపురం: కాకినాడ జిల్లా తాటిపర్తికి చెందిన టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యుడు నున్న సత్యనారాయణకు చేనేత పింఛన్, ఆయన మనవరాలికి దివ్యాంగ పింఛన్ వచ్చింది. ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం పింఛన్‌లు అందించారు. తొలిసారి పింఛన్ అందుకున్న సత్యనారాయణ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సీఎం వైఎస్ జగన్ దయ వల్లే తనకు పింఛన్ రావడంతో పాటు తన మనవరాలు వైకల్యాన్ని జయించిందన్నారు. 'నా మనవరాలు లిఖితశ్రీ పుట్టుక నుంచే దివ్యాంగురాలు(మూగ, చెవుడు). మాది నిరుపేద కుటుంబం. ఆపరేషన్ చేయించాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చవుతుందని చెప్పారు. పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్లు చేయించి ఆదుకుంటోందని తెలిసి.. అధికారులను కలిశాను. వారు ఒక చెవికి ఆపరేషన్ మాత్రమే చేస్తామని, సీఎం జగన్‌ను కలుసుకుంటే పూర్తిగా ఆపరేషన్ చేసే అవకాశం ఉందన్నారు. తాను టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యుడిని అయినందున తనకు సాయం చేస్తారో లేదోనని భయపడ్డాను. కానీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు చొరవతో సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కష్టాలు చెప్పుకొన్నాం. విపక్ష పార్టీ వాడినని చూడకుండా ఆయన వెంటనే ఎంత ఖర్చయినా పాపకు వినికిడి, మాట వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మా మనవరాలికి చెవులకు ప్రభుత్వమే రూ.14 లక్షలు ఖర్చుపెట్టి ఆపరేషన్ చేయించడమే గాక, ఏడాదిన్నర పాటు ఉచితంగా మందులు కూడా ఇచ్చింది. ఇప్పుడు నా మనవరాలు కోలుకుంది. దానికి సీఎం వైఎస్ జగనే కారణం' అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యాడు.


టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యుడి మనవరాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

విశాఖ డెయిరీ చైర్మన్
తులసీరావు కన్నుమూత

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి
- స్వగ్రామం యలమంచిలిలో నేడు అంత్యక్రియలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం
- నేడు యలమంచిలికి సీఎం జగన్ రాక

సాక్షి, అనకాపల్లి/అమరావతి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు (84) బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన అనకాపల్లి జిల్లా యలమంచిలికి తీసుకువస్తున్నారు. తులసీరావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్ వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా.. కుమార్తె రమాకుమారి యలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. తులసీరావు అంత్యక్రియలు గురువారం యలమంచిలిలో జరుగుతాయి. దీనికి సీఎం వైఎస్ జగన్ హాజరుకానున్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

విశాఖ డెయిరీని 1973లో స్థాపించగా.. తులసీరావు 1986 ఆగస్టు 29న డెయిరీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నాటినుంచి నేటి వరకు ఆయనే చైర్మన్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. దేశ డెయిరీ రంగంలో 37 ఏళ్లపాటు డెయిరీ చైర్మన్‌గా వ్యవహరించిన ఏకైక వ్యక్తిగా రికార్డు సృష్టించారు. కేవలం రూ.11 కోట్ల టర్నోవర్ ఉన్న డెయిరీని అంచలంచెలుగా అభివృద్ధి చేసి ప్రస్తుతం రూ.2 వేల కోట్ల టర్నోవర్ కంపెనీగా అభివృద్ధి చేశారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో లక్షలాది రైతుల సంక్షేమానికి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. మిల్క్ ప్రొడ్యూసర్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్, హెల్త్-మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలందించారు. పాఠశాల నుంచి జూనియర్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలను నెలకొల్పి ఉచితంగా విద్యనందించారు. 1,700 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించారు. 1500కు పైగా గ్రామాల్లో వ్యవసాయ బోర్‌వెల్స్ ఉచితంగా ఏర్పాటు చేశారు.

రాజకీయాల్లోనూ రాణించారు

యలమంచిలిలో రైతు కుటుంబంలో 1939 ఫిబ్రవరి 1న తులసీరావు జన్మించారు. 24 ఏళ్ల వయసులో యలమంచిలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా కొంత కాలం వ్యవహరించారు. తర్వాత 1968, 1981 ఎన్నికల్లోనూ యలమంచిలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నియోజకవర్గ రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగారు. అహ్మదాబాద్‌లో జరిగిన భారత పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ 37వ జాతీయ సమావేశంలో తులసీరావు ముఖచిత్రంతో ఆయన సేవలకు గుర్తింపుగా పోస్టల్ స్టాంపును కూడా విడుదల చేశారు.

సీఎం జగన్ సంతాపం

తులసీరావు మరణం పట్ల సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డెయిరీ రంగంలో తులసీరావు అత్యుత్తమ సేవలందించి తనదైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. తులసీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. కాగా, తులసీరావు మృతితో ఉత్తరాంధ్ర ఓ ముఖ్య నాయకుడిని కోల్పోయిందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఆంధ్ర కురియన్‌గా పేరుగాంచిన తులసీరావు మృతి తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. తులసీరావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు.

మళ్లీ ఉద్యోగాల జోష్

> పరిపాలనలో విప్లవాత్మక మార్పుగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశాం. చివరి స్థాయి వరకు సమర్థవంతమైన డెలివరీ మెకానిజమే లక్ష్యంగా ప్రజలకు సేవలు అందిస్తున్నాం. ఈ వ్యవస్థలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించడం చాలా ముఖ్యం. ఇది మరింత మెరుగ్గా జరగాలంటే సచివాలయాల సిబ్బంది పనితీరుపై మండల స్థాయిలో పర్యవేక్షణ ఉండాలి. సుస్థిర ప్రగతి లక్ష్యాలపై సచివాలయాల ఉద్యోగులందరికీ అవగాహన కలిగించాలి. - సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

మంచి పేరు వచ్చింది. ఎలాంటి లోపం లేకుండా సమర్థవంతంగా మళ్లీ నియామక ప్రక్రియ చేపట్టాలి' అని అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి ఖాళీల వివరాలను సేకరిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో అర్జీల పరిష్కారమన్నది చాలా ముఖ్యమని, వాటి పరిష్కారంలో స్పష్టత ఉండాలని సీఎం చెప్పారు. ఒకే అర్జీ మళ్లీ వచ్చినప్పుడు మళ్లీ అదే వ్యవస్థ దాన్ని పరిశీలించే బదులు ఆపై వ్యవస్థ పరిశీలన ద్వారా దానిని పరిష్కరించేలా చర్యలు ఉండాలన్నారు. అర్జీకి సంబంధించిన సమాచారం రీ వెరిఫికేషన్ కోసం పై వ్యవస్థకు వెళ్లడం అనేది ప్రధానం అని చెప్పారు. ఈ అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అప్పుడే గ్రామ, వార్డు సచివాలయాలు సమర్థవంతంగా పని చేయగలుగుతాయని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

పర్యవేక్షణ కోసం ఎస్‌వోపీ

- గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అనుకున్న లక్ష్యాల మేరకు సమర్థవంతంగా పని చేయాలంటే.. ప్రతి ఒక్క ఉద్యోగి ఎలాంటి బాధ్యతలు నిర్వహించాలన్న దానిపై సరైన ఎస్‌వోపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ఉండాలి. దీంతో పాటు పర్యవేక్షణ చాలా ముఖ్యం. ఇది లేకపోతే ప్రయోజనం ఉండదు.
- సిబ్బంది హాజరు దగ్గర నుంచి వారు ప్రజలకు అందుబాటులో ఉండటం వరకు అన్ని రకాలుగా పర్యవేక్షణ ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం నిర్వహించాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిపై విభాగాల వారీగా మండల స్థాయిలో పర్యవేక్షణ ఉండాలి. ఎవరెవరు ఏం చేయాలన్న దానిపై చాలా స్పష్టత ఉండాలి. విధులు, బాధ్యతలపై ఎస్‌వోపీలు ఉండాలి. వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. ఈ వ్యవస్థలో భాగస్వాములైన ప్రతి అధికారి ఓనర్‌షిప్ తీసుకోవాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.


సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతి నెలా 2 సచివాలయాలు సందర్శన

- ప్రభుత్వ శాఖాధిపతులు ప్రతి నెల రెండు సచివాలయాలను తప్పనిసరిగా సందర్శించాలి. దీనివల్ల వాటి సమర్థత పెరుగుతుంది. ప్రభుత్వంలో సమర్థవంతమైన ఉద్యోగులు ఉన్నారు. వారి సేవలు ప్రజలకు అందాలి. ప్రతి ప్రభుత్వ విభాగంలో ఫేషియల్ రికగ్నైజేషన్‌తో కూడిన హాజరును అమలు చేయాలి. ప్రభుత్వ శాఖాధిపతుల నుంచే ఇది అమలైతే కింది స్థాయిలో కూడా అందరూ అమలు చేస్తారు.
- దీనివల్ల సిబ్బంది అందుబాటులో ఉండి, ప్రజల వినతులకు సంబంధించిన పరిష్కారంపై దృష్టి పెడతారు. ఈ నెలాఖరు కల్లా రాష్ట్ర సచివాలయం నుంచి గ్రామ స్థాయి సచివాలయం వరకు ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు అమలు చేయాలి.

సుస్థిర ప్రగతి లక్ష్యాల్లో ఏపీ నంబర్ వన్ కావాలి

- సుస్థిర ప్రగతి లక్ష్యాల్లో దేశంలో మన రాష్ట్రం నంబర్ వన్ స్థాయిలో నిలవాలి. ఈ విషయమై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలి. అప్పుడే ఆ లక్ష్యాలను అందుకోగలం. గ్రామ స్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడు సుస్థిర ప్రగతి లక్ష్యాలను అందుకోగలం. లేదంటే ఆ లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించదు.
- సచివాలయాల్లో టెక్నాలజీ పరంగా.. సాంకేతిక పరికరాల విషయంలో లోపం ఉండకూడదు. నిరంతరం టెక్నాలజీని అప్‌డేట్ చేయాలి. సిబ్బందినీ అప్‌డేట్‌గా ఉంచాలి. అన్ని సచివాలయాలను వైర్డ్ ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయాలి. ప్రస్తుతం 2,909 గ్రామ సచివాలయాలు వైర్‌లెస్ ఇంటర్నెట్‌తో నడుస్తున్నాయి. వాటిని వైర్డు ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయాలి. గ్రామంలోని ఆర్బీకేలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి. అంగన్‌వాడీలను కూడా సచివాలయాల పర్యవేక్షణలోకి తీసుకురావాలి.
- ఈ సమీక్షలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి సాయి ప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, కమిషనర్ షన్ మోహన్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు

టీడీపీ నేత యనమల రామకృష్ణుడు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు, మీడియా గొంతునొక్కుతున్నారని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఒక హిట్లర్, ఒక తుగ్లక్, ఒక గోబెల్స్‌లకు ప్రతిరూపం అయిన పరిపాలన సాగుతోందని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. అత్యంత దుర్మార్గమైన బ్రిటీష్ కాలం నాటి యాక్ట్ 1861 ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, రోడ్‌షోలు నిర్వహించకూడదని ప్రభుత్వం జీవో నంబర్ 1ని జారీ చేయడం దుర్మార్గమని విమర్శించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి 144, 30 సెక్షన్లు నిరంతరం అమలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల సభలకు, రోడ్‌షోలకు అనుమతి నిరాకరిస్తూ జీవో తెచ్చిన సీఎం జగన్.. రాజమండ్రి, విజయనగరంలో రోడ్‌షోలు, ర్యాలీలు చేశారని విమర్శించారు. ప్రజాసమస్యలపై శాంతియుత ప్రదర్శనలను అణచివేస్తున్నారన్నారు.

ప్రజాస్వామ్యం పరిహాసం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబును కుప్పంలో పర్యటించకుండా ప్రభుత్వం అడ్డుకుందని, ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నానని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధమైన చర్యలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీల గొంతు వినిపించకూడదు...ఆ పార్టీలు కార్యక్రమాలు నిర్వహించకూడదు అనే ఉద్దేశంతోనే జీవో 1ని తీసుకువచ్చారని ఆరోపించారు. పాలకుల విధానాలను ప్రశ్నించాలని ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు.

రోడ్లపై సభలు వద్దంటే రభసా?

వీటితో కందుకూరు ఘటనలు మళ్లీ మళ్లీ జరిగే అవకాశం

- మిగతా కార్యక్రమాలకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటే చాలు
- ఈ ఉత్తర్వులకు కూడా చంద్రబాబు నాయుడి వక్రభాష్యం



కందుకూరులోని ఘటనాస్థలంలో చెల్లాచెదురుగా పడిన చెప్పులు(ఫైల్)

సాక్షి, అమరావతి: అసలు ఆ జీవోలో తప్పేమయినా ఉందా? రోడ్లపై సభలు, సమావేశాలను వద్దనటం మంచిదా... చెడ్డదా? అది కూడా కావాలని ఇరుకు రోడ్లో సభ నిర్వహించడంతో 8 మంది ప్రాణాలు కోల్పోయాక... అటువంటి సంఘటనలు ఇక పునరావత్తం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు కదిలి ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయటం సమంజసం కాదని అనగలమా? ఇవేమీ ఒక పార్టీనో, ఒక నాయకుడినో దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన ఉత్తర్వులు కాదు కదా?!. రోడ్లపై సభలు పెట్టకూడదన్నది అన్ని పార్టీలకూ, అందరు నాయకులకూ సమానంగా వర్తించే అంశం. ఇది తప్ప వేరే కార్యక్రమాలేమైనా రోడ్లపై చేసుకోవాలంటే దానికి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటే చాలని ఆ ఉత్తర్వుల్లోనే ఉంది. మరిప్పుడు దేన్ని తప్పుబడుతున్నారు? రోడ్లపై సభలు, సమావేశాలు వద్దనటాన్నా? లేక మిగతా కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలనటాన్నా? వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి దురుద్దేశాలు ఆపాదిస్తూ దుష్ప్రచారానికి దిగుతున్నారనేది మరోసారి తేటతెల్లం కావటం లేదా? ఇన్ని మరణాలు సంభవించాక కూడా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఉంటే చంద్రబాబుకు వంత పలికే ఇతర ప్రతిపక్ష పార్టీలు, మీడియా దీన్ని ఆక్షేపించకుండా ఉంటాయా? రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల భద్రతతో ఏమాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును ఏమనుకోవాలి? ఇరుకు రోడ్డులోకి కావాలని వాహనాన్ని పోనిచ్చి సభ నిర్వహించి, 8 మంది ప్రాణాలు బలితీసుకున్న ప్రతిపక్ష నాయకుడిలో కాస్తయినా పశ్చాత్తాపం కనిపించాలి కదా? పదుల సంఖ్యలో జనం గాయపడినా కూడా ఏ మాత్రం బాధపడకుండా రోడ్లపై మరో సభకు తయారై... దాన్ని ఎందుకు అడ్డుకుంటారంటూ రభస చేయటం సరైనదేనా?

ఎందుకిచ్చారు ఈ జీవో..?

ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే ప్రభుత్వం ఈ జీవో జారీ చేసిందంటూ టీడీపీ చేస్తున్న ప్రచారంలో అక్షరం కూడా నిజం లేదన్నది యథార్థం. ఎందుకంటే చంద్రబాబు నాయుడి పబ్లిసిటీ దాహంతో నెల్లూరు జిల్లా కందుకూరులో రోడ్డుపై నిర్వహించిన సభలో 8 మంది దుర్మరణం చెందారన్నది విస్మరించలేని విషాదం. నాలుగు రోడ్ల కూడలిలో కాస్త విశాలమైన ప్రాంతంలో సభ నిర్వహిస్తామని ముందుగా అనుమతి తీసుకున్న చంద్రబాబు... కేవలం తన సభకు వచ్చిన జనాన్ని తక్కువ మందిని కూడా రద్దీరద్దీగా బీభత్సమైన స్థాయిలో చూపించాలన్న వ్యూహాన్ని ఎంచుకున్నారు. అందుకోసం డ్రోన్లతో షూటింగ్‌కు సిద్ధమయ్యారు. తీరా సభా స్థలమయిన ఎన్టీఆర్ సర్కిల్‌కు వచ్చేసరికి జనం అనుకున్నంతగా లేరని భావించారు. ఆ విశాలమైన రోడ్లోంచి తన వాహనంతో సహా కాన్వాయ్‌ని మరో 50–70 మీటర్లు ముందుకు... ఇరుకు రోడ్లోకి పోనిచ్చారు. ఇరుకు రోడ్డులో ఫ్లెక్సీలు కట్టడంతో మరింత కుదించుకుపోయింది. అన్ని వాహనాలు అంత చిన్న రోడ్లోకి దూసుకు రావటంతో... అప్పటిదాకా అక్కడ నిల్చుని ఉన్న జనం వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో కొందరు కింద పడిపోయారు. వారిని తొక్కుకుంటూనే మిగిలిన వారు వెనక్కి వెళ్లారు. దీంతో దాదాపుగా ఎనిమిది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇరుకు రోడ్లో తక్కువ జనం వచ్చినా... పై నుంచి డ్రోన్లతో షూట్ చేస్తే భారీగా వచ్చినట్లు కనిపిస్తారని, దాన్నే ప్రచారానికి వాడుకోవచ్చని బాబు వేసిన వ్యూహం బెడిసికొట్టడమే ఈ నిండు ప్రాణాలను బలితీసుకుందని చెప్పటానికి వేరే ఏమీ అక్కర్లేదు.

అసలు ఆ జీవోలో ఏముంది?

ఇదిగో... ఈ సంఘటన నేపథ్యంలోనే ప్రజల ప్రాణాలను కాపాడటం తన బాధ్యతగా భావించి ప్రభుత్వం జీవో నెంబర్–1 జారీ చేసింది. పబ్లిసిటీ కోసం ఇరుకు రోడ్లలో జనాన్ని షూట్ చేసి.. మరిన్ని మరణాలకు కారణమయ్యే సంఘటనలేవీ జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ జీవో జారీ చేసింది. అయితే ఈ జీవోలో... సభలు నిర్వహించకూడదని ఎక్కడా చెప్పలేదు. కేవలం రోడ్లపై మాత్రమే నిర్వహించవద్దని పేర్కొన్నారు. మైదానాలు, ఇతర ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించుకోవచ్చు. అందుకోసం గ్రామ, మండల, మునిసిపాలిటీల పరిధిలో ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించాలని కూడా అధికార యంత్రాంగాన్ని స్వయంగా ప్రభుత్వమే ఆదేశించింది. అంటే ఏదైనా గ్రామంలో గానీ పట్టణంలో గానీ రోడ్లపై మాత్రమే సభలు నిర్వహించకూడదు. అక్కడి కాలేజీ మైదానాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చు. అందుకు దరఖాస్తు చేస్తే పోలీసులు అనుమతిస్తారు. కాబట్టి ప్రభుత్వం జారీ చేసిన జీవో సభల నిర్వహణకు ఏ విధంగానూ అడ్డంకి కాదు. వీటన్నిటికీ తోడు... రోడ్లపై సభలు వద్దన్న నిబంధనకు అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం మినహాయింపులిచ్చింది. ప్రత్యేక పరిస్థితుల్లో సభలు నిర్వహించాలని భావిస్తే అందుకు కారణాలను వివరిస్తూ జిల్లా ఎస్పీ/ పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సభ నిర్వహించే సమయం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, హాజరయ్యే జనం, ఇతర ఏర్పాట్ల వివరాలను తెలియజేస్తూ దరఖాస్తు చేయాలి. వాటిని పరిశీలించి పోలీసులు సంతృప్తి చెందితే సభ నిర్వహణకు షరతులతో అనుమతినిస్తారు. అనుమతి కోసం పేర్కొన్న షరతులకు విరుద్ధంగా సభను నిర్వహిస్తే మాత్రం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటారు.

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఇలాగే..

- ప్రధానిని, కేంద్ర హోంమంత్రిని అడ్డుకునే ప్రయత్నాలు చేశారు
- కుప్పంలో పోలీసులు బాబును అడ్డుకోవడం సరికాదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తన నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న క్రమంలో పోలీసులు ఆంక్షల పేరుతో అడ్డుకోవడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం.. 2018లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుటుంబసమేతంగా తిరుమల వచ్చిన సందర్భంగా పోలీసుల్ని, తెదేపా కార్యకర్తల్ని పెట్టి ఆయన కారుపై రాళ్లు, కర్రలతో దాడిచేశారని గుర్తుచేశారు. 2019 ఎన్నికల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌కు రాకుండా, ఆయన సభలు సక్రమంగా జరగకుండా అనేక విధాలుగా ప్రయత్నాలు చేసి, నిరసన కార్యక్రమాలు, నల్ల బెలూన్లు, జెండాలు, హోర్డింగులు పెట్టిన చరిత్ర చంద్రబాబునాయుడు ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే పంథాలో వ్యవహరించడం మంచిదికాదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలు హర్షించే విధంగా వ్యవహరించాలే తప్ప దురుద్దేశంతో వ్యవహరించటం మంచిది కాదని పేర్కొన్నారు. నాటి టీడీపీ, నేటి వైఎస్సార్‌సీపీ ప్రజాస్వామ్య వ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలేనని, ఈ పార్టీలు స్వార్థ, కుటుంబ ప్రయోజనాలకు ఇచ్చిన ప్రాధాన్యత రాష్ట్ర అభివృద్ధికి ఇవ్వవని ఆయన విమర్శించారు.

కొత్త జీవో చెల్లదు

- జగన్‌రెడ్డి పాలన బ్రిటీష్ వారికంటే దారుణంగా ఉంది
- నా సభలకు జన స్పందన చూసి ఓర్వలేకే కొత్తచట్టాలు
- నా నియోజకవర్గంలో నన్నే అడ్డుకుంటారా?
- కుప్పంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు మండిపాటు



పోలీసులను హెచ్చరిస్తున్న చంద్రబాబు

సాక్షి, చిత్తూరు: బ్రిటీష్ కాలం నాటి 1861 యాక్ట్ 30 ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 1 చెల్లదని, దాని ప్రకారం తనను అడ్డుకోవడం సబబు కాదని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం 121 పెద్దూరుకు ఆయన ర్యాలీగా వస్తుండగా.. రోడ్‌షో, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి నోటీసు ప్రతులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు పోలీసు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మేనేజర్‌కు ఇచ్చిన నోటీసులు తిరిగి తనకే ఇవ్వడం సరికాదని, ఎందుకు అడ్డుకుంటున్నారో రాత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఓడిపోతామనే భయంతోనే జగన్‌రెడ్డి తన సభలను అడ్డుకునేందుకు ఇలాంటి పనికి మాలిన జీవోలు తీసుకువచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వర్తించని చట్టాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కొత్త జీవో ప్రకారం పోలీసు యాక్ట్ 30.. 1వ తేది నుంచే అమల్లోకి వచ్చిందని డీఎస్పీ చెబుతుండగా, ఒకవేళ 1861 చట్టం అమల్లో ఉంటే కొత్తగా జీవో తీసుకురావాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కొత్త జీవో తీసుకురావాలంటే గెజిట్ ద్వారా చట్టబద్ధత ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో పాలన బ్రిటీష్ వారికంటే దారుణంగా తయారైందని మండిపడ్డారు. నా సభలకు వస్తున్న జన స్పందన చూసి ఓర్వలేక కొత్త చట్టాలు తెస్తున్నారన్నారు.

అణగదొక్కాలని చూస్తే.. రెచ్చిపోతా

42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవరూ తనను అడ్డుకోలేదని, నేడు ఈ సైకో జగన్‌రెడ్డి అడ్డుకున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. తనను ఎంత అణగదొక్కాలని చూస్తే అంత రెచ్చిపోతానని స్పష్టం చేశారు. 'ఇది నా నియోజకవర్గం. నేను ఇక్కడి ఎమ్మెల్యేను. నన్ను ఎందుకు అడ్డుకుంటున్నారు? ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు. ఇది ముమ్మాటికీ నేను ప్రజలకు దూరం చేసే కుట్ర' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

పోలీసుల పైనా చంద్రబాబు ఆగ్రహంతో ఊగిపోయారు. వేలు చూపిస్తూ.. గద్దిస్తూ, తీవ్రస్థాయిలో బెదిరింపు ధోరణిలో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఇతర పోలీసులు అధికారులను పదేపదే హెచ్చరించారు. 'నన్నే అడ్డుకుంటారా? ఈ హక్కు ఎవరిచ్చారు మీకు? ఆ జీవో నాకు వర్తించదు. చేతకాని డీజీపీ' అని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

'సాక్షి'ని బయటికి లాగి పడేయండి

'సాక్షి, సాక్షి టీవీని లాగి బయటికి పడేయండి..' అని చంద్రబాబు తీవ్ర అసహనాన్ని ప్రదర్శించారు. 121 పెద్దూరు వద్ద చంద్రబాబు మాట్లాడుతుండగా, మఫ్టీలో ఉన్న కానిస్టేబుల్ ఓ భవనం పై నుంచి వీడియో, ఫొటోలు తీస్తూ కనిపించాడు. కొందరు టీడీపీ కార్యకర్తలు అతన్ని సాక్షి వీడియోగ్రాఫర్ అని భావించి గట్టిగా కేకలు వేశారు. దీంతో చంద్రబాబు ఒక్కసారిగా అటు తిరిగి చూస్తూ.. 'ఏయ్.. ఏయ్.. సాక్షి సిబ్బందిని బయటికి లాగి పడేయండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకోలేదు: ఎస్పీ

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును కుప్పంలో పర్యటించవద్దని గానీ, అడ్డుకోవడం గానీ జరగలేదని చిత్తూరు ఎస్పీ వై రిషాంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన చంద్రబాబు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేస్తున్నామని.. నిబంధనల మేరకు సభలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చని తెలిపామన్నారు. 'ముందస్తుగా చర్యలు చేపడితే ఒకలా అంటున్నారు. జరగరానిది జరిగితే పోలీసు శాఖపై నింద నెడుతున్నారు. పోలీసు శాఖకు రాజకీయాలను ఆపాదించడం మంచిది కాదు' అని స్పష్టం చేశారు.

చిత్రగుప్తుడిలా తప్పులు లెక్కిస్తున్నా

శాంతిపురం (చిత్తూరు జిల్లా): వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న తప్పులను తాను చిత్రగుప్తుడిలా లెక్కిస్తున్నానని, అధికారంలోకి వచ్చాక వడ్డీతో కలిపి తీర్చుకుంటానని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. కెనమాకుల పల్లిలో ప్రజలనుద్దేశించి కాసేపు మాట్లాడారు. తన గెలుపు తథ్యం అని చెప్పారు. కుప్పం నియోజకవర్గ పర్యటన మొదటిరోజు బుధవారం నిర్ణీత సమయం కంటే ఆరు గంటలు ఆలస్యంగా సాగింది. శాంతిపురం మండలంలోని 121 పెద్దూరు వీధుల్లో తిరిగి స్థానికులతో మాట్లాడారు. బెండనకుప్పం, శివకురుబూరు, శాంతిపురంలో పర్యటించారు. జనం లేని కారణంగా శాంతిపురంలో సభను రద్దు చేసుకున్నారు.

బాబు మరో షో!

పబ్లిసిటీ కోసం మరోసారి చీప్ ట్రిక్స్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పబ్లిసిటీనే ప్రధాన అజెండాగా చంద్రబాబు మరో షోకు తెరతీశారు. తన పబ్లిసిటీ కోసం కందుకూరు, గుంటూరులో 11 మంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యిందే కాక.. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ మూకలు పోలీసులపై దాడులకు తెగబడేలా రెచ్చగొట్టారు. వెరసి.. ఎల్లో మీడియా ద్వారా పబ్లిసిటీ చేయించుకొని, రాజకీయ మైలేజీ పొందడానికి విఫలయత్నం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కుప్పం శాసనసభ్యుడిగా మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించాలని భావించారు. కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో రోడ్ల మీద బహిరంగ సభలను నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిన విషయం తెలిసిందే. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చిత్తూరు జిల్లా పోలీసులు.. ఆయన పీఏ మనోహర్‌కు ముందస్తు నోటీసులు ఇచ్చారు. చంద్రబాబు కార్యక్రమాల వివరాలు ఏమిటి? ఎక్కడెక్కడ పర్యటించనున్నారు? బహిరంగ సభలు ఎక్కడ నిర్వహించనున్నారు? రోడ్‌షోలు ఎక్కడ? అనే వివరాలు తెలియజేసి, అనుమతి తీసుకోవాలని సోమవారం రాత్రే నోటీసు ఇచ్చారు. అయితే మంగళవారం అర్ధరాత్రి వరకు చంద్రబాబు నుంచి కానీ, ఆయన పీఏ నుంచి కానీ పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు. దీంతో సభలు, సమావేశాలకు అనుమతులు లేవంటూ పోలీసులు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారు.

అంతా పథకం ప్రకారమే..

టీడీపీ శ్రేణులు ఏపీ, కర్ణాటక సరిహద్దులోని శాంతిపురం మండలం 121 పెద్దూరు, గడ్దూరు క్రాస్ వద్ద హంగామా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. చంద్రబాబు పర్యటనకు కుప్పం వాసుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో టీడీపీ శ్రేణులు మదనపల్లె, వీ.కోట, కర్ణాటక నుంచి ప్రత్యేక వాహనాల్లో జనాన్ని తీసుకు రావడం ప్రారంభించారు. దీంతో పోలీసులు అనుమతి లేని వాహనాలకు ప్రవేశం లేదని, వాటిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఇక్కడి విషయాలను మాజీమంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రబాబు పీఏ, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఎప్పటికప్పుడు చంద్రబాబుకు ఫోన్ ద్వారా చెబుతూ వచ్చారు.

డ్రామాను రక్తి కట్టించాలని..

కుప్పం వాసుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడం గ్రహించిన చంద్రబాబు.. తన ఎల్లో మీడియా ద్వారా విస్తృత ప్రచారానికి తెరతీశారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటున్నారంటూ.. టీడీపీ శ్రేణుల ద్వారా హడావుడి చేయించారు. తన జనాన్ని రెచ్చగొట్టి పోలీసుల పైకి ఉసిగొల్పారు. పోలీసులు లాఠీచార్జ్ చేస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచవచ్చనే ఉద్దేశంతో కొందరు టీడీపీ శ్రేణులను సామాన్య జనం రూపంలో గడ్దూరు క్రాస్ వద్దకు పంపించారు. వారి వద్ద రాడ్లు, కర్రలు, రాళ్లు కనిపించాయి. వారి ద్వారా గొడవ సృష్టించి లబ్ధి పొందడానికి విఫల యత్నం చేశారు.

1861 పోలీసు చట్టమే వర్తించదంటూ వక్రభాష్యం

చంద్రబాబుకు చట్టాల పట్ల కనీస అవగాహన లేదని మరోసారి నిరూపితమైంది. రోడ్లపై సభలకు అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం 1861 పోలీసు చట్టం ప్రకారం జీవోను జారీ చేసింది. అయితే ఆ చట్టం ఆంధ్రప్రదేశ్‌కు వర్తించదని చంద్రబాబు పోలీసులతో వాగ్వాదం పెట్టుకోవడం విస్మయపరిచింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 30 పోలీస్ యాక్ట్‌ను ఇక్కడ ఎలా అమలు చేస్తారని కూడా ఆయన ప్రశ్నించారు. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు.. కేంద్ర పోలీసు బలగాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు వ్యవస్థలు 1861 పోలీస్ యాక్ట్ ప్రకారమే పని చేస్తున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న రోజుల్లో కూడా రాష్ట్రంలో ఎన్నోసార్లు 30 పోలీస్ యాక్ట్ అమలు చేశారు.

జనం ముసుగులో పోలీసులపై దాడి

బుధవారం ఉదయం నుంచే గడ్దూరు వద్ద వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, అద్దె మనుషులు ఇరుకైన రోడ్లపై గుమికూడారు. దీనిపై పోలీసులు అభ్యంతరం తెలిపారు. అయినప్పటికీ టీడీపీ కార్యకర్తలు ససేమిరా అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలుగు తమ్ముళ్లను మరింత రెచ్చగొట్టారు. పోలీసులపై దాడికి దిగేలా ఉసిగొల్పారు. దీంతో కార్యకర్తలు మరింత ఆగ్రహంతో ఊగిపోయారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన బందోబస్తు బ్యారికేడ్లను పక్కకు లాగేశారు. రోడ్డుపై బైఠాయించారు. 'సీఎం డౌన్‌డౌన్.. ఇదేం ఖర్మ.. ఇదేం ఖర్మ..' అంటూ నినాదాలతో రెచ్చిపోయారు. ఈ గందరగోళం మధ్య కొందరు టీడీపీ కార్యకర్తలు పోలీసులపై పిడిగుద్దులతో దాడి చేశారు. పోలీసులు కూడా లాఠీలను పైకెత్తి వారిని తరిమే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, టీడీపీ కార్యకర్తల నడుమ తోపులాట జరిగింది. సాయంత్రం 4 గంటలకు కర్ణాటక సరిహద్దు నుంచి చంద్రబాబు 121 పెద్దూరు చేరుకున్నాక టీడీపీ శ్రేణులు మరింతగా రెచ్చిపోయాయి. ఇంకో వైపు తమను అడ్డుకుంటున్నారంటూ ఎల్లో మీడియా ద్వారా బ్రేకింగ్ న్యూస్‌లు వేయించారు. ఉదయం నుంచి ఇలా జరిగేలా చంద్రబాబు ప్రణాళిక రచించి, అమలు చేయించారని స్పష్టమైంది. ఇలా గొడవ చేయడం ద్వారా పోలీసులు తనను అరెస్టు చేసేలా వ్యూహం పన్నారు. అయితే పోలీసులు ఏమాత్రం సంయమనం కోల్పోకుండా చంద్రబాబు, టీడీపీ నేతలు, శ్రేణులను సమర్థవంతంగా కట్టడి చేశారు.

పబ్లిసిటీ కోసమే స్పందించలేదు..

కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇచ్చిన విషయం తెలిసీ తెలియనట్లు చంద్రబాబు వ్యవహరించారు. అందులో భాగంగానే పోలీసులు ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇవ్వొద్దని తన పీఏ మనోహర్‌కు ఫోన్ ద్వారా సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే పోలీసులు అడ్డుకుంటారని, ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పబ్లిసిటీ పొందవచ్చనేది బాబు ఉద్దేశమని ఆ పార్టీ కుప్పం నేత ఒకరు తెలిపారు.



శాంతిపురం మండలం పెద్దూరు వద్ద దాడిచేసేందుకు కర్రలు చేతబట్టి ఉన్న టీడీపీ కార్యకర్తలు



టీడీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులపైకి ఉసిగొల్పుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

చంద్రబాబు తీరు జుగుప్సాకరం

ప్రచార పిచ్చితో చంద్రబాబు ఇరుకు సందుల్లో సభలు పెట్టి ప్రజలు ప్రాణాలు తీస్తున్నారని రాష్ట్ర మంత్రులు మండిపడ్డారు. గతంలో ఆయన సీఎంగా ఉన్నప్పుడు గోదావరి పుష్కరాల్లో 29 మందిని బలి తీసుకున్నారని గుర్తు చేశారు. తాజాగా మొన్న కందుకూరులో ఎనిమిది మందిని, నిన్న గుంటూరులో ముగ్గురి ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. ఇంకెంత మంది ప్రాణాలు తీస్తారోనని.. ప్రజల మేలు కోసమే ప్రభుత్వం రోడ్లపై సభలను నిషేధిస్తూ జీవో తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఏమన్నారంటే..

- కార్యకర్తల్ని ఉసిగొల్పి పోలీసులపై దాడి చేయిస్తున్నారు
- సభలు పెట్టినప్పుడు ముందుగా అనుమతి తీసుకోవాలని తెలియదా?
- ప్రజల మేలు కోసమే ప్రభుత్వం జీవో తెచ్చింది
- ధ్వజమెత్తిన మంత్రులు

పాలకపక్షానికైనా, ప్రతిపక్షానికైనా నిబంధనలు ఒక్కటే

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సోమల (చిత్తూరు జిల్లా): చంద్రబాబు కుప్పం పర్యటనలో ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరు జిల్లా సోమలలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. బాబు సభల్లో వరుస ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడంతోనే ప్రభుత్వం రోడ్లపై సభలను నిషేధిస్తూ జీవో తెచ్చిందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికైనా, పాలక పక్షానికైనా నిబంధనలు ఒకటే ఉంటాయన్నారు. పలమనేరు డివిజన్‌లో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని.. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా సభలు నిర్వహించాలనుకోవడం తగదన్నారు. గతంలో కుప్పంలో జరిగిన పంచాయతీ, పరిషత్, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించిందని గుర్తు చేశారు. దీంతో గత ప్రాభవం కోసం చంద్రబాబు పాకులాడుతున్నారని విమర్శించారు. గోదావరి పుష్కరాల్లో 28 మంది మృతి చెందినా ఆయన తేలిగ్గా తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు సమావేశాల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయినా తిరిగి అదే రీతిలో కుప్పంలో పర్యటించాలనుకోవడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. పోలీసులపై కుప్పంలో చంద్రబాబు రౌడీలా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. ఇటీవల నంజంపేటలోనూ రాళ్లు, కర్రలతో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని గుర్తుచేశారు. ట్విట్టర్‌లో రాష్ట్రం జగన్ జాగీరా అని లోకేష్ ప్రశ్నిస్తున్నారని.. ఇప్పుడు రాజ్యాలు, రాచరికం లేవన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. ప్రభుత్వం చంద్రబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ధ్వజం



సాక్షి, అమరావతి: చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ధ్వజమెత్తారు. సభల్లో అమాయకుల ప్రాణాలు తీశారని మండిపడ్డారు. కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయిస్తున్నారని నిప్పులు చెరిగారు. రోడ్లపై బహిరంగ సభలు పెట్టకుండా.. ప్రజల మేలు కోసమే రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జోగి రమేష్ మీడియాతో మాట్లాడారు. సభ కోసం చంద్రబాబు అనుమతి కోరలేదన్నారు. కుప్పంలో ఓటు లేని బాబుకు కుప్పం మీద ప్రేమ ఉందా? అని నిలదీశారు. అన్నీ ఓడిన బాబుకు అక్కడ ఏం పని? అని ప్రశ్నించారు. కుప్పానికి ఏదైనా చేసుంటే ప్రజలు ఎన్నికల్లో బాబును ఎందుకు పాతరేశారని నిలదీశారు. పోలీసు వ్యవస్థ నడుస్తుందే 1861 పోలీస్ యాక్ట్ ప్రకారం అని తెలియదా అని ప్రశ్నించారు. ప్రజల రక్షణకు ఇచ్చిన జీవోని హర్షించాల్సింది పోయి రంకె లేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు ప్రజలకు ఇబ్బంది లేకుండా సభలు పెట్టుకోవచ్చన్నారు.

అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు


మంత్రి ఆర్కే రోజా



నగరి (చిత్తూరు జిల్లా): పబ్లిసిటీ పిచ్చితో.. ఇరుకు సందుల్లో సమావేశాలు పెట్టి.. చీరలు ఇస్తామంటూ ఆశ చూపి చంద్రబాబు అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. చిత్తూరు జిల్లా నగరిలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. గుంటూరులో 10 వేల మందికి చీరలిస్తామని అనుమతులు పొంది 30 వేల మందికి టోకెన్లు ఇచ్చారన్నారు. చివరకు వెయ్యి మందికి కూడా చీరలు పంచకుండా ముగ్గురు మహిళల మృతికి కారణమయ్యారని నిప్పులు చెరిగారు. ఈ ఘటనలో 30 మందికి కాళ్లు, చేతులు విరిగాయన్నారు. చంద్రబాబు మృతిచెందిన కుటుంబాలను పరామర్శించకుండా హైదరాబాద్‌కు పారిపోయి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. తొక్కిసలాటలతో తనకు సంబంధం లేదని చెప్పే చంద్రబాబుకు సమావేశాలు పెట్టే హక్కు కూడా లేదన్నారు.

మారణహోమమే బాబు లక్ష్యం

మంత్రి గుడివాడ మండిపాటు



సాక్షి, అనకాపల్లి: కుప్పంలో మారణహోమమే చంద్రబాబు లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. ఏదైనా ఒక సభ, సమావేశం పెట్టినప్పుడు ముందుగా అనుమతి తీసుకోవాలన్న విషయం ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. కుప్పం పర్యటనను ప్రభుత్వం అడ్డుకుంటోంది అంటున్న బాబు ముందు సభకు అనుమతి తీసుకున్నారో, లేదో స్పష్టం చేయాలన్నారు. ప్రచార పిచ్చితో రాజమండ్రి పుష్కరాల్లో 29 మందిని, కందుకూరులో 8 మందిని, గుంటూరులో ముగ్గురిని చంపిన చంద్రబాబు కన్ను ఇప్పుడు కుప్పం ప్రజలపై పడిందన్నారు.

ప్రచారం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం


డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పాలసముద్రం (చిత్తూరు జిల్లా): చంద్రబాబు దుర్బుద్ధి, దుష్ట ఆలోచనలు, ప్రచార ఆర్భాటాల వల్లే కందుకూరులో ఎనిమిది మంది, గుంటూరులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రానికి పట్టిన ఖర్మ చంద్రబాబు అని నిప్పులు చెరిగారు. బుధవారం చిత్తూరు జిల్లా పాలసముద్రంలో నారాయణస్వామి మీడియాతో మాట్లాడారు. ప్రజలకు మంచి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌లా ముందుండాలే కానీ.. ప్రచార ఆర్భాటాల కోసం ప్రజల ప్రాణాలను బలితీసుకోకూడదని చంద్రబాబుకు హితవు పలికారు. టీడీపీ పాలనలో పచ్చచొక్కాల వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. నేడు ఆ దుస్థితి లేదని.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. బాబు గ్రాఫిక్స్ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కనీసం మృతుల అంత్యక్రియలు, క్రతువులు జరగకుండానే రెండో రోజే చంద్రబాబు రోడ్ షోలు నిర్వహించడం దారుణమన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే బాబు కనీస మానవత్వం లేకుండా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు.

ప్రజల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

మంత్రి దాడిశెట్టి రాజా



తుని: ప్రచార ఆర్భాటం కోసం ప్రజలు ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరుకు సందుల్లో సభలు పెట్టవద్దని జీవో తెస్తే టీడీపీ నాయకుడు యనమల రామకృష్ణుడు ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేస్తున్నారని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పబ్లిసిటీ పిచ్చితో ఇప్పటికే చంద్రబాబు 40 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారని గుర్తు చేశారు. రాజమహేంద్రవరంలో వృద్ధురాలిని సైతం వదలకుండా రాజకీయ లబ్ధి కోసం ఎల్లో మీడియా పిచ్చిరాతలు రాసిందన్నారు. ప్రతి ఆవారా గాడు పాదయాత్ర చేస్తే ప్రజాభిమానం రాదని.. కొవ్వు మాత్రం కరుగుతుందని లోకేష్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



జనం ఆకలితో ఉన్నప్పుడు అధిక ధరలు వస్తాయని ధాన్యాన్ని నిల్వ చేసి ఉంచద్దు.
– జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, జనవరి, 5

ఆమెను చంపింది ఎవరు?

కొన్ని ఘటనలు ఉలిక్కిపడేలా చేస్తాయి. విస్మరిస్తున్న వాస్తవాలను కటువుగా కళ్ళెదుట నిలిపి, జవాబివ్వమని ప్రశ్నిస్తాయి. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తున్న క్షణాలలో ఢిల్లీలో జరిగిన దారుణ ఘటన అలాంటిదే. న్యూ ఇయర్ పార్టీ నుంచి స్కూటీ మీద ఇంటికి తిరిగి వెళుతున్న అంజలి అనే 20 ఏళ్ళ చిరుద్యోగిని ఎదురుగా కారులో అయిదుగురు యువకులు ఢీ కొట్టి, సుల్తాన్‌పురి నుంచి కంఝావాలా వరకు 12 కి.మీ పైగా అలాగే రోడ్డుపై కారుతో ఈడ్చుకెళ్ళి ప్రాణం తీసిన ఘటన ఘోరం. బాధితురాలిపై అత్యాచారం జరగలేదని తేల్చినా, తలకూ, వెన్నుకూ బలంగా దెబ్బలు తగిలాయనీ, పక్కటెముకలు బయటకొచ్చాయనీ, మెదడు మిస్సయిందనీ చెబుతుంటే ఒళ్ళు జలదరిస్తుంది

కారు ముందు భాగంలో ఎడమవైపు చక్రం కింద ఇరుక్కొని, రక్షించమని కేకలు పెడుతున్నా పట్టించుకోని వాహనదారుల మదోన్మత్తత వల్ల ఒంటి నిండా 40కి పైగా గాయాలతో బాధితురాలు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తుంది. కాపాడమని ఆమె అరుస్తున్నా, ప్రత్యక్షసాక్షి ఒకరు కారును వెంబడిస్తూ పదే పదే ఫోన్ చేసినా పట్టించుకోని గస్తీ పోలీసుల లోపం కోపం తెప్పిస్తుంది. ఇది అరుదైన ప్రమాదం కాదు, అమానవీయ హత్య అనిపిస్తుంది. మంచు కమ్మేసిన శీతకాలంలో... దారి కనిపించని చిమ్మచీకటిలో... ఢిల్లీలో వెలగని వీధి దీపాలు, లోపభూయిష్ఠ పాలనా వ్యవస్థ, అలక్ష్యం చూపిన పోలీసులు, ఒంటరి స్త్రీని చూస్తే చెలరేగే వంకర బుద్ధులు – ఇలా అందరూ కలసి చేసిన హత్య ఇది. దీంతో, అమృతోత్సవ భారతంలోనూ బయట ఎంత సురక్షితమనే ప్రశ్న ఉదయిస్తుంది.

కేంద్ర హోమ్‌శాఖ ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, నివేదిక కోరడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తం కాక తప్పలేదు. హంతక వాహనం తమ ముందు నుంచే పోతున్నా పట్టించుకోని పోలీస్ గస్తీ వ్యాన్ సహా అనేక లోపాలు జరిగాయని ఒప్పుకోక తప్పలేదు. మృతురాలితో కలసి ఆ రాత్రి స్కూటీపై ప్రయాణించి, ప్రమాదం జరిగాక ఎవరికీ ఏమీ చెప్పకుండా పోయిన రెండో యువతి నిధి మాటలు, చేష్టలు అనుమానాస్పదమే. కారు కింద యువతి ఉందని తెలీక బండి నడిపామంటున్న నిందితుల మాటలూ నమ్మశక్యం కానివి. వారు అక్కడక్కడే అనేక యూ టర్న్‌లు తీసుకుంటూ బండి నడిపిన విధానం కారు కింది బాధితురాలి శరీరాన్ని వదిలించుకోవాలని చేసిన ప్రయత్నమే. అందరి దృష్టితో ఇప్పుడిప్పుడే వేగవంతమవుతున్న దర్యాప్తులో పోనూపోనూ మరిన్ని బయటపడవచ్చు.

నేరం జరగకుండా నిరోధించాలి, ఒకవేళ జరిగితే త్వరితగతిన సాక్ష్యాధారాలు సేకరించాలి. ఈ రెంటిలోనూ ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారు. ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో పనిచేస్తూ, తండ్రి లేని కుటుంబానికి తానే ఆధారమైన అమ్మాయి ప్రాణాలు కోల్పోయిన ఈ కంఝావాలా ఘటన అనేక చేదు నిజాలు చెబుతోంది. ఘటనవేళ ప్రత్యక్షసాక్షి పదే పదే ఫోన్ చేసినా, పోలీస్ స్పందన అమితాలస్యమైంది. ప్రమాదం జరిగినా కారును వేగంగా ముందుకూ వెనకకూ దూకిస్తూ, కిలోమీటర్ల దూరం పోనిచ్చిన యువకుల తీరు చట్టమంటే భయం లేనితనానికి ప్రతీక. అలాగే, పోలీసులకూ, పౌరవ్యవస్థలకూ మధ్య సమన్వయమూ కొరవడింది. 'పోలీస్ కంట్రోల్ రూమ్' వ్యాన్ తమ దోవలో ఎదురుపడ్డా హంతక వాహనాన్ని ఆపకపోవడం మరీ దారుణం. పోలీస్ స్పందనలో పెరగాల్సిన వేగం సహా ఇది అనేక పాఠాలు నేర్పుతోంది.

అయితే, ఈ ఘటన పాలకులు చేపట్టాల్సిన చర్యలకు బదులు ఢిల్లీని పాలిస్తున్న ఆప్, దేశాన్ని పాలిస్తున్న బీజేపీల మధ్య ఆరోపణల పర్వానికి దారితీసింది. అరెస్టయిన నిందితుల్లో ఒకరు బీజేపీ సభ్యుడు కావడం అగ్నికి ఆజ్యం పోసింది. రాజకీయాలు పక్కనపెడితే, ఢిల్లీ లాంటి చోట కొన్నేళ్ళ క్రితం దాకా కేంద్రీయ పోలీసు స్పందనా వ్యవస్థ ఉండేది. ఎక్కడ నుంచి సహాయం కోరుతూ ఏ కాల్ వచ్చినా యంత్రాంగం అప్రమత్తమై, దగ్గరలోని సిబ్బందిని హుటాహుటిన పంపే వీలుండేది. ఆ వ్యవస్థను మార్చేయడం పెద్ద పొరపాటు. ఆ కేంద్రీయ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలి. మహిళా పోలీస్ స్టేషన్లతో పాటు మహిళా గస్తీ సిబ్బంది అవసరం. దాని వల్ల సామాన్య మహిళలకు భరోసా పెరుగుతుంది. 24 గంటల పోలీస్ పోస్టుల సమర్థ నిర్వహణ, గస్తీ, ఎలక్ట్రానిక్ నిఘా చట్టాన్ని అతిక్రమించాలనుకొనేవారికి బెదురు పుట్టిస్తాయి.

దేశంలో రోజూ 415 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని లెక్క. పైగా, 2021లో రోడ్డు ప్రమాద మరణాల్లో సగం మంది ద్విచక్ర వాహనదారులే. ఈ పరిస్థితుల్లో ఆఫీసు పని ముగిసి, రాత్రి పొద్దుపోయి ఇంటికి వచ్చేవారి భద్రత ఎలా? ఇక, క్రికెటర్ రిషభ్ పంత్ ప్రాణాలతో బయట పడ్డ ఘోర రోడ్డు ప్రమాదఘటన లాంటివి రహదారి భద్రతపై దృష్టి పెంచాలని గుర్తు చేస్తున్నాయి. ఒకపక్క అధిక వేగం, తప్పుడు లేన్లలో డ్రైవింగ్, సిగ్నల్స్ ఉల్లంఘన, రోడ్డుపైనే పార్కింగ్, అధిక శబ్దంతో హారన్ కొట్టడం లాంటి అనేక తప్పులు, మరోపక్క మత్తులో అమాయకుల ప్రాణం తీస్తున్న తాజా కంఝావాలా ఘటన లాంటివి జరుగుతుంటే గుడ్లప్పగించి చూస్తే ఎలా? ఒకరు చేసే తప్పుకు వేరెవరికో శిక్ష పడే ఈ రహదారి ఘటనల్లో దోషులు భయపడేలా కఠిన శిక్షలు విధించాలి. అమెరికా లాగా లెక్క దాటి తప్పులు చేస్తే డ్రైవింగ్‌లైసెన్స్ రద్దు లాంటివి మన దగ్గరా ప్రవేశపెట్టాలి. 'నిర్భయ' అత్యాచార – హత్యోదంతం జరిగి పదేళ్ళయినా, పాలకులు చట్టాలు చేయడమే తప్ప ప్రాథమిక చర్యలు విస్మరిస్తున్నారు. ఇలాగైతే... అర్ధరాత్రి సైతం స్త్రీ స్వేచ్ఛగా సంచరించగలిగిననాడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు అన్న గాంధీ మాటల్లో మనకు స్వాతంత్ర్యం ఎప్పటికి వచ్చేటట్టు?

ఆధారాలు లేకుండానే అనుమతులా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

జన్యుమార్పిడి పంటలపై ఎప్పుడు చర్చ మొదలైనా, సాక్ష్యాల ఆధారంగా ముందుకెళ్లాలని కొందరు శాస్త్రవేత్తలు చెబుతూంటారు. తద్వారా శాస్త్రీయ సమాచారం, ప్రజా విచారణలన్నీ పక్కకు తొలగిపోయేలా చేస్తూంటారు. నిజానికి శాస్త్రపరమైన విచారణను పరిమితం చేయడం మార్కెట్ పోకడల్లో ఒకటి. జీఎం (జన్యు మార్పిడి) ఆవాల విషయంలో జరుగుతున్నది స్పష్టంగా అదే. ఇటీవలే డీఎంహెచ్–11 జన్యుమార్పిడి ఆవాలకు పర్యావరణ అనుమతులు కూడా ఇచ్చేశారు. చిత్రంగా, దేశ వంటనూనె దిగుమతులను ఈ సరికొత్త ఆవాల ద్వారా తగ్గించుకోవచ్చు అన్న భావనను కలిగిస్తున్నారు. అయితే దీని దిగుబడి చాలా తక్కువ అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే జరుగుతున్న ప్రచారం ఎంత తప్పుడు భావనో అర్థమైపోతుంది.

ప్రశ్నలు వేయడం, వాటికి సమాధానాలు కనుక్కోవడంతోనే సైన్స్ ప్రస్థానం మొదలవుతుందని మా సైన్స్ టీచర్ చెబుతూండేది. ఇంకోలా చెప్పాలంటే... సైన్స్ ఎల్లప్పుడూ ప్రశ్నలకు సిద్ధంగా ఉంటుందీ అనాలి! దీనివల్ల సాంఘిక, ఆర్థిక ఆందోళనలకు తావిచ్చే, పర్యావరణ విధ్వంసానికి దారితీసే అపోహలను తొలగించుకోవచ్చు. అందుబాటులో ఉన్న సాక్ష్యాలపై వ్యాఖ్యానం చేయవచ్చు. అయితే ఆర్థిక ప్రయోజనాల కారణంగా సత్యాన్వేషణ తాలూకూ గొంతుకలను నొక్కివేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ క్రమంలో ప్రదర్శించే సాక్ష్యాలు కూడా నమ్మదగ్గవిగా ఉండవు. విషయం ఏమిటంటే... జన్యుమార్పిడి పంటలపై ఎప్పుడు చర్చ మొదలైనా, సాక్ష్యాల ఆధారంగా ముందుకెళ్లాలని కొందరు శాస్త్రవేత్తలు చెబుతూంటారు. తద్వారా శాస్త్రీయ సమాచారం, వాదం, ప్రజా విచారణలన్నీ పక్కకు తొలగిపోయేలా చేస్తూంటారు.

దేశంలోకి మొట్టమొదటి జన్యుమార్పిడి పంట బీటీ కాటన్‌ను 2001లో వాణిజ్యస్థాయిలో విడుదల చేశారు. అప్పట్లో జరిగిన జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ) సమావేశాల్లో పాల్గొన్న వారిలో నేనూ ఉన్నాను. జన్యుమార్పిడి పంటల ప్రవేశంపై తుది నిర్ణయం తీసుకునే ఈ జీఈఏసీ సభ్యులతోపాటు, 'జెనెటిక్ మ్యానిపులేషన్ అండ్ ద మానిటరింగ్ కమిటీ'కి సంబంధించిన పర్యవేక్షణ బృందం కూడా ఈ సమావేశంలో పాల్గొంది. బీటీ పత్తి విత్తనాన్ని అభివృద్ధి చేసిన మహికో – మోన్‌శాంటో సభ్యులు, కొంతమంది పౌర సమాజపు ప్రతినిధులు కూడా అందులో ఉన్నారు. రెండు నెలలు ఆలస్యంగా నాటినా ఆ ఏడాది పత్తి పంట దిగుబడి యాభై శాతం ఎక్కువైనట్లు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం చెబుతోందని సమావేశంలో ప్రస్తావించారు. బీటీ కాటన్ కారణంగానే ఇలా జరిగిందనడంతో ఆశ్చర్యం వేసింది నాకు.

ఆ సమాచారం తప్పనీ, అశాస్త్రీయమైందనీ, దాన్ని ఏదైనా పరిశోధన సంస్థతో నిర్ధారించాలనీ నేను పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్, అప్పటి ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్‌ను కోరాను. సాధారణ పరిస్థితుల్లో ఎదిగేందుకు ఐదు నెలల సమయం తీసుకునే పంటలో రెండు నెలలు ఆలస్యంగా విత్తినా అధిక దిగుబడి సాధించడం దాదాపు అసాధ్యం. వ్యవసాయ పరిశోధనల్లో విత్తనాలు వేసే సమయం చాలా ముఖ్యమైన అంశమన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి అంశంలో ఒక ప్రైవేట్ కంపెనీకి మినహాయింపు ఇస్తే, భవిష్యత్తులో యూనివర్సిటీ శాస్త్రవేత్తలను కూడా విత్తిన సమయం గురించి పట్టించుకోవద్దని చెప్పే అవకాశం ఏర్పడుతుంది. జీఈఏసీ ఛైర్మన్‌కు నేను వేసిన ప్రశ్న ఏమిటంటే– రెండు నెలలు ఆలస్యంగా విత్తినా దిగుబడి పెరగడమంటే... అది రైతులకు చాలా ప్రయోజనకరమైంది కాబట్టి, రైతులందరూ రెండు నెలలు ఆలస్యంగా విత్తుకోవాలని ఎందుకు సలహా



ప్రతీకాత్మక చిత్రం

ఇవ్వకూడదూ? అని!

ఈ సమావేశం పూర్తయిన తరువాత సాయంకాలం ఐసీఏఆర్ ఉన్నతాధికారి ఒకరు నాతో మాట్లాడుతూ, బీటీ విత్తనాల ట్రయల్స్ ఇంకో ఏడాది చేయాల్సిందిగా మహికో–మోన్‌శాంటో కంపెనీని కోరినట్లు తెలిపారు. అవసరమైనంత మేర అన్ని పరీక్షలు పూర్తి చేసినట్లు మోన్‌శాంటో చెప్పినా జన్యుమార్పిడి పంటల అనుమతిని ఒక ఏడాది ఆలస్యం చేయగలిగామన్నమాట. ఆ సమావేశంలో ప్రశ్నలేవీ వేయకుండా 'సాక్ష్యాల' ఆధారంగా అనుమతులిచ్చి ఉంటే ఏడాది ముందుగానే జన్యుమార్పిడి పంటలు దేశంలోకి వచ్చేసి ఉండేవి.

బీటీ వంకాయపై నిషేధం

దేశంలోకి బీటీ వంకాయ అనుమతిని నిరాకరిస్తూ 2010లో అప్పటి పర్యావరణ శాఖ మంత్రి జైరామ్ రమేశ్ ఒక ప్రకటన చేశారు. 'డెసిషన్ ఆన్ కమర్షియలైజేషన్ ఆఫ్ బీటీ బ్రింజాల్(బీటీ వంకాయ వాణిజ్యీకరణ మీద నిర్ణయం)' పేరుతో అప్పట్లో 19 పేజీల డాక్యుమెంట్ ఒకటి విడుదలైంది. దీనిపై శాస్త్రవేత్తలు ఎన్ని మాటలు చెప్పినా నా అంచనా ప్రకారం ప్రతి వృక్ష శాస్త్రవేత్తా కచ్చితంగా చదవాల్సిన డాక్యుమెంట్ అది. దేశ విదేశాల్లోని శాస్త్రవేత్తలతో, ఏడు దఫాలుగా ప్రజలతో సంప్రదింపుల తరువాత జైరామ్ రమేశ్ ఆ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. జన్యుమార్పిడీ టెక్నాలజీపై రైతులు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు దేశం మొత్తమ్మీద వంకాయ పండించే ప్రాంతాల్లో సంప్రదింపులు జరపడం ఇదే తొలిసారి.

జాగరూకత, ముందస్తు జాగ్రత్త, సిద్ధాంతాల ఆధారంగా జైరామ్ రమేశ్ ఒక నిర్ణయం తీసుకుంటూ... ఏ కొత్త టెక్నాలజీ అయినా ఆయా సముదాయాల సామాజిక, సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు.

మీడియాలో ఒక వర్గం జన్యుమార్పిడి పంటలపై బహిరంగ విచారణను తోసిపుచ్చింది. అంతా బూటకం అని కొట్టి పారేసింది కూడా. అయితే ప్రజలు లేవనెత్తిన కీలకమైన అభ్యంతరాలను మంత్రి గుర్తించి తగు నిర్ణయం తీసుకోవడం మాత్రం నాకు ఆనందం కలిగించింది. అంతేకాదు... జన్యుమార్పిడి విత్తన సంస్థల అధ్యయనాల నియమాలు, సమాచారాన్ని విశ్లేషించిన తీరు, ఫలితాలన్నింటినీ ప్రస్తావిస్తూ డాక్యుమెంట్‌ను రూపొందించడమూ ప్రశంసనీయమైన అంశం.

జాగరూకతతోనే ముందుకు

వాస్తవ పరిస్థితులకూ, కొందరు సేకరించే సాక్ష్యాలకూ మధ్య ఉన్న అంతరం సైన్స్ ఆధారిత పద్ధతుల అవసరాన్ని మరోసారి నొక్కి చెబుతోంది. శాస్త్రపరమైన విచారణను పరిమితం చేయడం మార్కెట్ పోకడల్లో ఒకటి. వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకు మార్కెట్లు సైన్స్‌ను తొక్కేసేందుకూ ప్రయత్నిస్తూంటాయి. జీఎం ఆవాల విషయంలో జరుగుతున్నదీ అదే. జీఈఏసీ ఇటీవలే దీనికి పర్యావరణ అనుమతులు ఇచ్చేసింది. ఈ డీఎంహెచ్–11 జన్యుమార్పిడి ఆవాల పంట దిగుబడి సామర్థ్యం ఎంతన్నది ఐసీఏఆర్‌కూ తెలియక ముందే పర్యావరణ అనుమతులు రావడం గమనార్హం. దేశ వంటనూనె దిగుమతులను ఈ సరికొత్త ఆవాల ద్వారా తగ్గించుకోవచ్చు అన్న భావనను కలిగిస్తున్నారు. అయితే దీని దిగుబడి చాలా తక్కువ అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే అదెంత తప్పుడు భావనో అర్థమైపోతుంది.

ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం... జీఎం ఆవాల పరీక్షలకు అన్ని ప్రోటోకాల్స్‌ను ఢిల్లీ యూనివర్సిటీ స్వయంగా సిద్ధం చేసింది. విద్యార్థినే ప్రశ్నాపత్రం తయారు చేయమని అడగటం లాంటిది ఇది. అంతేకాదు... హెర్బిసైడ్ల(గడ్డిమందుల)ను తట్టుకునే ఆవాల వెరైటీ బీటీ వంకాయ మాదిరిగా కనీస పరీక్షలను కూడా ఎదుర్కోలేదు. జీఎం ఆవాల పరీక్షల్లో ఆరోగ్య నిపుణులు ఎవరూ లేకపోవడం, తేనెటీగలపై జీఎం ఆవాల ప్రభావం ఏమిటన్నది పరిశీలించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న లోపాలు. ఇన్ని లోపాల మధ్య జీఈఏసీ విత్తనాల వృద్ధికి ఎలా అనుమతిచ్చిందో అర్థం కావడం లేదు.

సైన్స్ అంటే సత్యాన్ని వెతకడం. ఇటాలియన్–బ్రిటిష్ ప్రొఫెసర్ మైకెలా మాసిమీ 2017లో లండన్ రాయల్ సొసైటీ అవార్డు అందుకుంటున్న సందర్భంగా చేసిన ప్రసంగంలో అచ్చంగా ఈ వ్యాఖ్యే చేశారు. "ప్రజలకు సైన్స్ విలువను అర్థమయ్యేలా చేయడం మన బాధ్యత అని నేను నమ్ముతున్నాను. కచ్చితత్వం, సాక్ష్యాలు, సిద్ధాంతాలపై విశ్వాసం, కచ్చితమైన పద్ధతులను అవలంబించడం వంటి వాటిని కూడా నిశితంగా పరిశీలించాలి"!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వదులుకుంటేనే ఆరోగ్యం



చక్కెర అనేది ఒక డ్రగ్. వ్యసనానికి గురిచేసే పదార్థం. కొకెయిన్, హెరాయిన్ మెదడులోని ఏ ప్రాంతాలను ఉత్తేజితం చేస్తాయో అలాగే పనిచేస్తుంది. అందుకే దాన్ని విడిచిపెట్టలేం. కానీ నేనేం చెప్తానంటే, మీరు ఎంత త్వరగా దాన్ని వదిలిపెడితే అంత త్వరగా మీ రోగనిరోధక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మీ వయసు గడియారం వెనక్కి తిరుగుతుంది.

– ఫ్రాంక్ లిప్‌మాన్, ఫంక్షనల్ మెడిసిన్ డాక్టర్

మోసం గురో!



ఒక ఆడి లేదా బీఎండబ్ల్యూ కారు నడపడం యూఎస్‌లో సాధారణం. మీరు ఉన్నత మధ్యతరగతి వాళ్లయితే చాలు, వాటిని కొనగలరు. కానీ ఇండియాలో వాటిని కొనాలంటే మీరు అత్యంత ధనికులై ఉండాలి; పైగా ఆ పిచ్చి ట్రాఫిక్‌లో నడపను కూడా లేరు. ఇండియా దాటిపోయిన తర్వాతే మిమ్మల్ని ప్రభుత్వం ఎలా మభ్యపెట్టిందో గుర్తించగలరు.

– దీపక్ సింగ్, వ్యాఖ్యాత

ఏం చేస్తున్నట్టు?



సహజ సంపదలకు నెలవైన బలూచిస్తాన్ (పాకిస్తాన్)లో దుఃఖకరమైన వాస్తవం ఇది. బంగారం, రాగి, చమురు, విలువైన రాళ్లు, బొగ్గు లాంటి ఒక ట్రిలియన్ డాలర్లకు పైగా విలువైన సహజ సంపదను అక్కడ కనుక్కున్నారు. అయినా ఆసుపత్రులు లేవు, వైద్యులు లేరు, రోడ్లు లేవు. రోగులను మోసుకెళ్లాల్సి వస్తోంది.

– ఫజీలా బలూచ్, యాక్టివిస్ట్

వాడకం ఆగదు



ఒక టీ–షర్ట్ జీవిత కథ: కొత్తగా ఉన్నప్పుడు – పార్టీలకు, పాతబడితే– ఇంట్లో వేసుకుంటాం. దానికో రంధ్రం పడితే – రాత్రిళ్లు వేసుకుంటాం. రాత్రుళ్లు కూడా వేసుకోదగ్గట్టుగా లేకపోతే – క్లీనింగ్‌కు ఉపయోగిస్తాం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చేతిలో జుట్టు



ఈ దేశీయ మగవాళ్లకు మహిళల జుట్టు పొడవును కూడా నియంత్రించాలన్న పట్టుదల ఏమిటో!

– జెహ్రా జబీన్ షా, కవయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

నోట్ల రద్దు ఫలితమేంటి?

2016 నవంబర్ 8న ప్రధాని ప్రకటించిన నోట్ల రద్దుపై వ్యాజ్యాలను విన్న అత్యున్నత న్యాయస్థానం ఆ ప్రక్రియలో ప్రభుత్వం పరిధి మీరడం లాంటిదేమీ లేదనీ, అంతా పద్ధతి ప్రకారమే జరిగిందనీ తీర్పు వెలువరించింది. నలుగురు న్యాయమూర్తులు ఇదే అభిప్రాయం వెలిబుచ్చగా, ఒక్కరు మాత్రం సరికాదంటూ విభేదించారు. న్యాయస్థానం మద్దతు ప్రభుత్వానికి కొంచెం ఊరట. ఒకవేళ ఆ ప్రక్రియని న్యాయస్థానం తప్పుపట్టి ఉన్నా వాస్తవంలో పెద్ద ప్రభావం ఏమీ ఉండేది కాదు గానీ ప్రభుత్వం వైపు నుండి తప్పు జరిగినట్లు భావన స్థిరపడి పోయేది. ఎప్పుడో జరిగిపోయిన నిర్ణయం.. పర్యవసానాలు కూడా అనుభవమై పోయాక అది, తప్పో ఒప్పో అన్నది కేవలం మేధోమథనం కోసమే.

అయినా విధాన పరమైన నిర్ణయాల్లో న్యాయస్థానం ఎటూ జోక్యం చేసుకోదు. అది దాని పరిధిలోని అంశం కాదు. పెద్ద నోట్ల రద్దు విషయంలో రిజర్వ్ బ్యాంకును సంప్రదించకుండా ఏకపక్షంగా, హఠాత్తుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నది పిటిషనర్ల వాదన. అయితే ఆరు మాసాల ముందు నుండే సంప్రదింపుల ప్రక్రియ జరిగినట్లు, ప్రకటన వరకూ ఆ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు ప్రభుత్వం చెప్పడంతో న్యాయస్థానం ఆ ప్రక్రియ చట్టబద్ధతను సమర్థించింది. ప్రభుత్వానికి ఆ హక్కు ఉందని తెలియజేసింది. ఒక న్యాయమూర్తి మాత్రం నోట్ల రద్దు ప్రతిపాదన రిజర్వు బ్యాంకు నుండి కాకుండా కేంద్రం నుండి రావడాన్నీ, ప్రకటించే ముందు పార్లమెంట్‌ను విశ్వాసంలోకి తీసుకోకపోవడాన్నీ తప్పు పట్టారు. వారి అభిప్రాయం కూడా గమనంలోకి తీసుకుని ప్రభుత్వం భవిష్యత్‌లో ఈ తరహా పెద్ద నిర్ణయాల్లో ఇలాంటి వైఖరి తీసుకోకుండా ఉంటే సబబుగా ఉంటుంది.

భిన్న వాదనల్ని పక్కకు పెట్టి నిష్పక్షపాతంగా చూస్తే పెద్ద నోట్ల రద్దు ప్రకటించక ముందు ప్రభుత్వం ఇంకొంత జాగ్రత్త వహించి అన్నికోణాల్లో ఆలోచించి ఉంటే బాగుండేది. తీవ్రంగా నష్టపోయిన అసంఘటిత ఆర్థిక వ్యవస్థకు దెబ్బ తక్కువ తగిలేది. జనజీవనం, సామాన్యుల నగదు లావాదేవీలు కుదుపు నుండి తొందరగా కోలుకొనేవి. వెరసి ఆర్థిక వ్యవస్థకు లాభం జరిగేది. పెద్దనోట్ల రద్దు వల్ల ఒనగూడే ప్రయోజనాలు ఇవి అంటూ ప్రధాని ఏవైతే చెప్పారో (నల్లధనం తగ్గుదల, నకిలీ నోట్ల నివారణ, తీవ్రవాదులకు ఫండింగ్) వాటిలో ఎన్ని సాధ్యమయ్యాయో ఇప్పటికీ లెక్కలు లేవు. అధ్యయనం చేసి ఆ గణాంకాల్ని వెలికితీస్తే గానీ అసలు వాస్తవం బోధపడదు. నిర్ణయం చట్టబద్ధమే కావొచ్చు కానీ ఫలితం ఏమిటి అన్నది ప్రధానం. ఔషధం సరియైనదా, కాదా... సరియైనదే అయినా వికటించిందా, లేక అనుకున్న ప్రభావం చూపిందా అన్నదే గీటురాయి.

– డా॥ డి.వి.జి. శంకర రావు; మాజీ ఎంపీ, పార్వతీపురం
మొబైల్: 94408 36931

వేమనకు కొండంత వెలుగు


సందర్భం



డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి

వేమన పద్యం ఒకటైనా రాని తెలుగువారు ఉండరు. తెలుగు జాతి ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచే ఉంటాయి. తెలుగు నేలపై నడయాడిన వేమన తెలుగు సాహిత్యానికి ఒక కొండగుర్తుగా నిలుస్తారు. భాషలో, భావంలో ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేసిన ఘనత వేమనది. సమాజంలోని అన్ని అసమానతలు పోయి మనుషులు మానవీయంగా ఎదగాలని వేమన కోరుకున్నారు. ఉన్న స్థితి నుండి సమాజం మరో అడుగు ముందుకు సాగాలని తపించారు. ఆటవెలదులనే ఈటెలతో సమాజ సంస్కరణకు పూనుకొన్నారు. ఆ తర్వాత అనేక తరాల కవులకు మార్గదర్శకంగా నిలిచారు. దేశ విదేశాల పండితులను సైతం వేమన పద్యాలు ఆకర్షించాయి. పాశ్చాత్య భాషలలోనూ అనువాదమయ్యాయి.

తెలుగు సమాజానికి వెలుగులు నింపిన వేమనకు కొండంత వెలుగును ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 19న వేమన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్ణయించింది. డిసెంబర్ 30న ఈ విషయమై జీఓ 164ను విడుదల చేసింది.



కర్ణాటక ప్రాంతంలో తెలుగువారు స్వచ్ఛందంగా వేమన జయంతిని జరుపుకొనే సంప్రదాయం ఉంది. వందేళ్ళ నాడే కట్టమంచి రామలింగారెడ్డి తదితరుల ప్రోత్సాహం కూడా అందులో ఉంది. ప్రజల ఆకాంక్షలను గుర్తించి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్ 22న వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. తాలుకా స్థాయిలో రూ. 25,000, జిల్లా స్థాయిలో 50,000, రాష్ట్ర స్థాయిలో రూ.10 లక్షలు... మొత్తం అరవై తొమ్మిది లక్షల రూపాయలు ప్రతి ఏడాదీ కేటాయిస్తోంది. అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా ఇందులో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ధార్వాడ విశ్వ విద్యాలయంలో 1980లలోనే 'వేమన పీఠం' ఏర్పాటు చేసిన విషయం కూడా గమనించాలి.

ఆంధ్రప్రదేశ్‌లోనూ సాంస్కృతిక శాఖ వేమన జయంతిని కర్ణాటక రాష్ట్రంలో లాగా నిర్వహించాలని 2018 లోనే వేమన సంఘాలు, అభిమానులు కోరడమైంది. అప్పటి మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడమయింది. వేమన సమాధి ప్రాంతమైన కటారుపల్లి గ్రామం సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో ఉంది. స్థానికుల ఒత్తిడితో అప్పటి ఎమ్మెల్యే అత్తార్ చాంద్ భాష వేమన జయంతి విషయమై 10 సెప్టెంబరు 2019న అసెంబ్లీలో ప్రశ్నించారు. కనీస చర్చ కూడా జరగడానికి సభాపతి అవకాశం ఇవ్వలేదు. సాంస్కృతిక శాఖ కోట్లకు కోట్లు వేరు వేరు సాహిత్య, సాంస్కృతిక ప్రచార కార్యక్రమాలు ఆ రోజులలో చేసింది. అనేకమంది కవుల కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించింది. వేమనపై కనీసం ఒక సదస్సు నిర్వహించమని కోరినా పట్టించుకోలేదు.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే సాంస్కృతిక శాఖ పక్షాన వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ముందుకు రావాలని వేమన సంఘాలు కోరుతూ వచ్చాయి. 2019 నుండి ఈ ప్రక్రియ మొదలై నేడు అది సాకారమైంది. వేమన రాష్ట్ర స్థాయి పండుగ నిర్వహించబోతున్న ఈ సందర్భంలో ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నాం.

సత్యసాయి జిల్లా, కదిరి నియోజకవర్గంలోని కటారుపల్లి గ్రామంలోని వేమన సమాధి ప్రాంతంలో ప్రారంభ రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించాలి. రాష్ట్రంలోని వివిధ జోన్‌లలో ఒకో సంవత్సరం ఒకోచోట కార్యక్రమం ఉండేలా చేయాలి. జిల్లా, నియోజక వర్గ, మండల, గ్రామ స్థాయి వరకూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో 19న కార్యక్రమాలు చేయాలి. విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలలో ప్రత్యేకంగా వేమన పద్యపోటీలు, సదస్సులు నిర్వహించాలి.

మాజీ డీజీపీ పర్యాటకశాఖ సంస్థ ఛైర్మన్ చెన్నూరు అంజనేయరెడ్డి 2003లో ప్రత్యేక శ్రద్ధతో కటారుపల్లిలో వేమన సమాధిప్రాంతం, పరిసరాలలో అభివృద్ధి కోసం 3 కోట్లు కేటాయించారు. కోటిన్నర రూపాయల దాకా ఖర్చు జరిగింది. మిగతా నిధులు పూర్తి స్థాయిలో వినియోగించలేదు. తక్షణం నిధులు కేటాయించి పూర్తి స్థాయి పనులు చేపట్టాలి.

వేమన సాహిత్యంపై అధ్యయనానికీ, విస్తరణకూ ఒక ప్రత్యేక పరిశోధనా సంస్థనూ, గ్రంథాలయాన్నీ నెలకొల్పాలి. ఆధునిక తరానికి వేమన గురించి తెలిసేలా ప్రత్యేక వెబ్‌సైట్ నడపాలి. ప్రామాణిక వేమన పద్యప్రతిని రూపొందించడానికి నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలి. పాఠ్య పుస్తకాలలో వేమన పద్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వేమనతో ముడిపడిన కొండవీడు, గండికోట, నల్లచెరువు, పామూరు తదితర స్థలాలకు గుర్తింపు తీసుకురావాలి. జాతీయకవిగా వేమన గుర్తింపునకై కృషి జరగాలి.

వ్యాసకర్త కార్యదర్శి; వేమన ఫౌండేషన్, అనంతపురం
మొబైల్: 99639 17187

కర్మఫలం

'తగునిది తగదని యెదలో
వగవక సాధులకు పేదవారలకెగ్గుల్
మొగిజేయు దుర్వినీతుల
కగున నిమిత్తాగమంబులయిన భయంబుల్'

భారతం ఆదిపర్వం ప్రథమాశ్వాసంలో ఉన్న నన్నయగారి పద్యం ఇది.

ఒకప్పుడు జనమేజయుడు చాలా కాలం పట్టే యజ్ఞం ఒకదాన్ని తలపెట్టి చేస్తున్నాడు. అక్కడకు ఒక కుక్కపిల్ల వచ్చింది. దాన్ని జనమేజయుని తమ్ములు కొట్టారు. అది పెద్దగా ఏడ్చుకొంటూ తల్లి దగ్గరకు వెళ్లింది. ఆ తల్లి పేరు సరమ. సరమ దేవతల కుక్క.



జ్యోతిర్మయం

తల్లి కొడుకుని అడిగింది, "ఎందుకు ఏడుస్తున్నావు, ఎవరు కొట్టారు నిన్ను?" అని. "జనమేజయుని యజ్ఞం దగ్గర అతడి తమ్ములు కొట్టారు" అని చెప్పాడు కొడుకు. "నీవేమైనా చేయకూడని పని చేశావా?" అని ప్రశ్నించింది సరమ. "నేను ఏ తప్పూ చేయలేదు. అక్కడి పదార్థాల్ని వాసన చూడలేదు. కన్నెత్తి కూడా చూడలేదు" అన్నాడు కొడుకు.

కొడుకు చేయని తప్పుకు దండింపబడటం సరమ సహించలేక పోయింది. సరాసరి జనమేజయుడు ఉన్న చోటుకు వచ్చింది. కోపంతో అన్నది, "వీడు నా కొడుకు. ఎలాంటి తప్పూ చేయలేదు. ఎందుకు కొట్టారు నా కొడుకుని?" అని నిలదీసింది.

జనమేజయుడుగానీ, అతడి తమ్ములుగానీ నోరు మెదపలేదు. మౌనం వల్ల చేసిన నేరం ఒప్పుకున్నట్లు అయ్యింది.

అప్పుడు సరమ అంటుంది, "ఈ పని చెయ్యవచ్చు, ఈ పని చెయ్యకూడదు అనే విచక్షణా జ్ఞానం లేకుండా సాధువులకు, పేదవారికి ఎవరు నీతి తప్పి కీడు కలుగజేస్తారో, వారికి ఏ కారణం లేకుండానే భయానకమైన ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అమాయకుడైన నా కొడుకుకి కీడు కలుగజేశారు కాబట్టి అందుకు ప్రతిఫలంగా మీరు భవిష్యత్తులో మిక్కిలి బాధను అనుభవిస్తారు."

సరమ అన్నట్లుగానే జనమేజయుడు కొద్దికాలంలోనే గొప్ప బాధను అనుభవింపక తప్పలేదు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శు.చతుర్దశి రా.1.29 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: మృగశిర రా.9.22 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.10.14 నుండి 10.58 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.24 వరకు, అమృతఘడియలు: ప.11.50 నుండి 1.33 వరకు: రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు: సూర్యోదయం 6.36: సూర్యాస్తమయం 5.35.

ఒంగోలు జాతి పశువుల ఐవీఎఫ్ కేంద్రం ప్రారంభం


ఒంగోలు జాతి పశువుల ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేంద్రనాథ్, అధికారులు

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారు లాంలోని ఒంగోలు పశువుల లైవ్ స్టాక్ కేంద్రంలో ఐవీఎఫ్, టీకాలు, చెవి ట్యాగ్‌లు, బ్రాడింగ్ తదితర సేవల పశువుల క్రష్ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఒంగోలు పశువుల అభివృద్ధి సంఘం తణుకు అధ్యక్షుడు ముళ్లపూడి నరేంద్రనాథ్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువుల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. బ్రెజిల్ దేశపు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సదుపాయాలు గల పశువుల క్రష్, పశువుల కోరల్ ద్వారా కేంద్రంలో పశువుల వైద్య పరీక్షలు, చికిత్సలు తక్కువ సమయం, తక్కువ మానవ వనరులతో నిర్వహించవచ్చన్నారు. ఇటువంటి క్రష్ కేంద్రాన్ని దేశంలోనే మొదటి సారిగా గుంటూరులోని లాంఫాంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రష్ కేంద్రంలోని పరికరాలు విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నరేంద్రనాథ్‌ను లాంఫాం లైవ్‌స్టాక్ కేంద్రం అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ కె.సర్జన్‌రెడ్డి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ మన్‌మోహన్‌సింగ్, లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ హెడ్ డాక్టర్ ఎం.ముత్తారావు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న చంద్రబాబు

- 829వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: చంద్రబాబుకు మతిభ్రమించి రోడ్లపై సభలు పెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 829వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ పేద ప్రజల మాన ప్రాణాలు పోతుంటే చంద్రబాబు ఇంకా రోడ్‌షోలు అంటూ రోడ్లపై సంచారం చేయడం సిగ్గుచేటని, ప్రజలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్న బాబును ప్రజలు నమ్మే పరిస్థితి ఎప్పటికీ ఉండదన్నారు. ప్రజల ప్రాణాలపై స్పందించని ప్యాకేజీ పార్టీలు, ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు ప్రచారం చేసేందుకు డిబేట్‌లలో గగ్గోలు పెడుతుండడం దేనికి నిదర్శనమో చెప్పాలని డిమాండ్ చేశారు. బహుజనుల హక్కుల కోసం 829 రోజులుగా ఆకలి దప్పులతో పోరాటం చేస్తుంటే కనీసం తొంగి చూడని ఎల్లో మీడియా, కులవాదులు, కులగజ్జి పార్టీలు, బాబు కోసం బారులు తీరడం వెనుక ఆంతర్యమేమిటో అందరికీ అర్థమవుతుందని తెలిపారు. నేడు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధికి అన్ని విధాలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారనడంలో సందేహం లేదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సోము వల్లే నాయకులు పార్టీని వీడుతున్నారు

- పవన్, సంజయ్‌ను బలహీనపరిచే కుట్ర జరుగుతోంది
- బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తీరు వల్లే అనేక మంది నాయకులు పార్టీని వదిలి వెళ్లిపోతున్నారని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తాను నియమించిన జిల్లా అధ్యక్షులను కోర్ కమిటీలో చర్చించకుండానే మార్చారని తెలిపారు. తాను రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఎంతో మందిని బీజేపీలో చేర్పించానని, ఇప్పుడు వారంతా ఎందుకు పార్టీ వీడుతున్నారో వీర్రాజు సమాధానం చెప్పాలని అన్నారు. వీర్రాజు వియ్యంకుడు బీఆర్ఎస్‌లో ఎందుకు చేరారో చెప్పాలన్నారు. ఎంపీ జీవీఎల్ ఆలోచన ఎప్పుడూ కార్యకర్తల అభిప్రాయాలకు భిన్నంగా ఉంటుందని చెప్పారు. జగన్ – కేసీఆర్ కుట్రలో భాగంగానే బీఆర్ఎస్‌లోకి ఏపీ నేతలు వెళుతున్నారని ఆరోపించారు. ఏపీలో పవన్ కళ్యాణ్‌ను, తెలంగాణలో బండి సంజయ్‌ను బలహీన పరిచేందుకు జగన్, కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పవన్‌కు తామంతా అండగా ఉంటామన్నారు. కాపులపై మీడియా దుష్ప్రచారం చేస్తోందని వెల్లడించారు. మళ్లీ జగన్ వస్తే ఏ రాజకీయ నేతను బతకనీయరని తీవ్ర ఆరోపణలు చేశారు. అమిత్ షా పర్యటనను, బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడానికే జగన్ చీకటి జీవో విడుదల చేశారని తెలిపారు.

చిట్టడివి..చీకటి.. ఓ చిన్నారి

- బిక్కుబిక్కుమంటూ పొదల మధ్య 14 గంటలు
- తెల్లవార్లు వెతికినా గ్రామస్తులకు తెలియని జాడ
- తప్పిపోయిన పశువుల కోసం వెతుకుతున్న వారి కంటపడ్డాడు
- సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు


సుమంత్‌కు నీరు తాగిస్తున్న ఫారెస్టు అధికారులు

పోరుమామిళ్ల: ఏడేళ్ల బాలుడు ఇంటికి బయలుదేరాడు. ఊరు దారి విడిచి అడవి దారి పట్టాడు. చిట్టడవిలో చిక్కుకుపోయాడు. చీకట్లో బిక్కుబిక్కుమంటూ తెల్లార్లు గడిపాడు. బిడ్డ కోసం తల్లిదండ్రులు, గ్రామస్తులు రాత్రంతా అడవిలో వెతుకులాడినా ఫలితం లేదు. తెల్లవారిన తర్వాత తప్పిపోయిన పశువుల కోసం వెతుకుతున్న వారి కంట పడ్డాడు. సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. 14 గంటల గ్రామస్తుల ఉత్కంఠకు తెరదించాడు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలంలో కవలకుంట్ల పంచాయతీలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం... కవలకుంట్ల పంచాయతీ బుచ్చంపల్లెకు చెందిన మతకాల వెంకటసుబ్బయ్య, సీతామహాలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు సుమంత్(7) ఒకటవ తరగతి చదువుతున్నాడు. వెంకటసుబ్బయ్య గేదెలు మేపుకుంటూ, సీతామహాలక్ష్మి కూలిపనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం బడి నుంచి వచ్చిన సుమంత్ తల్లి కట్టెపుల్లలకు వెళుతుంటే తనూ వెళ్లాడు. సమీపంలో అడవికి దగ్గరలో తండ్రి గేదెలు మేపుతుండగా అమ్మతో చెప్పి నాన్న దగ్గరకు వెళ్లాడు. చీకటి పడుతుందని, నీవు ఈ దారిలో ఇంటికి వెళ్లు అని వెంకటసుబ్బయ్య కొడుక్కు చెప్పి.. తాను చెట్లు, పొదల్లో మేస్తున్న గొడ్లను తోలుకొస్తానని దారి చూపించి వెళ్లాడు. బుడ్డోడు సరేనని నాన్న చూపించిన దారిలో బయలుదేరాడు. పొరపాటున కొండదారి పట్టాడు. అలా నాలుగైదు కిలోమీటర్లు వెళ్లేసరికి బాగా చీకటిపడింది. కనుచూపు మేరలో ఊరు కనిపించలేదు. కేకలు వేసినా పలికే దిక్కు లేదు. బిక్కు బిక్కు మంటూ అలాగే ఓ పొద దగ్గర కూలబడిపోయాడు. చీకటి పడ్డా బిడ్డ ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడ్డారు. కనపడిన వారందరినీ అడిగారు. ఆచూకీ లభించలేదు. విషయం ఊరంతా పాకిపోయింది. ఓ యాభై మంది పిల్లాడిని వెతికేందుకు అడవికి బయలుదేరారు. పోలీసులు, ఫారెస్టు సిబ్బందికి సమాచారం అందడంతో వారూ వెతకడానికి వెళ్లారు. తెల్లారేంతవరకు పిల్లాడి ఆచూకీ దొరకలేదు.

పశువుల కోసం వెతుకుతుండగా...

ఈ నేపథ్యంలో బుధవారం పొద్దుపొడవకముందే కవలకుంట్లకు చెందిన ఏసయ్య, శాంతయ్యలు తప్పిపోయిన తమ గొడ్లను వెతికేందుకు అడవి దారి పట్టారు. అలా వారు వెళుతుండగా ఆరు గంటల ప్రాంతంలో పొద దగ్గర బాలుడి ఏడుపు విని అటు వెళ్లడంతో సుమంత్ కనిపించాడు. విచారిస్తే విషయం అర్థమయింది. బాలుడిని ఎత్తుకొని తల్లిదండ్రులకు అప్పగించేందుకు ఊరి దారి పట్టారు. దారిలో ఉండగానే ఫారెస్టు సిబ్బంది, గ్రామస్తులు ఎదురయ్యారు. సుమంత్‌ను చూసి ఫారెస్టు సిబ్బంది వాళ్లకు కృతజ్ఞతలు చెప్పి పిల్లాడిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. 14 గంటలు ఎంతో టెన్షన్ పెట్టినా చివరాఖరుకు కథ సుఖాంతమయింది.

నిర్ణీత సమయంలో శ్రీవారి దర్శనం



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్ స్లాట్ టికెట్లకు త్వరితగతిన దర్శనం లభిస్తోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,924 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.13 కోట్లు సమర్పించారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి అనంతరం మరో 8 రోజుల పాటు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ నెల 11 వరకు అన్ని సిఫారసు దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

స్వామి వారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం మండలిలో ప్రభుత్వ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎనర్జీ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వైకుంఠ ద్వారంలో ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు జరుగుతున్న కారణంగా ఈ నెల 6న తిరుమలలో జరగనున్న పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది.

‘ఉపాధి’ పనులను పరిశీలించిన కేంద్రం బృందం

- కర్నూలు జిల్లా బ్రాహ్మణపల్లెలో పర్యటన
- పనులు సాగుతున్న తీరుపై సంతృప్తి


మునగ రైతును అభినందిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఓర్వకల్లు: ప్రధాని నరేంద్రమోదీ సలహాదారు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు సభ్యులు అమర్‌జీత్‌సిన్హా నేతృత్వంలోని కేంద్ర బృందం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లెలో బుధవారం పర్యటించింది. ఆ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పండ్ల తోటల పెంపకం, అభివృద్ధి పనులను పరిశీలించింది. రైతు వెంకటేశ్వర్లు సాగు చేసిన మునగ తోటను పరిశీలించి పంట దిగుబడి, పెట్టుబడుల ఖర్చుల వివరాలను బృందంలోని సభ్యులు అడిగి తెలుసుకున్నారు. మునగ సాగు లాభసాటిగా ఉందని, దిగుబడులకు తగ్గట్టు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతు వివరించారు. సమీపంలో ఉపాధి హామీ పథకం కింద తవ్విన అమృత్ సరోవర్ (నీటి కుంట)ను కేంద్ర బృందం పరిశీలించింది. ఈ కుంట ద్వారా ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలు కలుగుతాయి, ఎంత ఖర్చు చేశారనే వివరాలను అడిగి తెలుసుకుంది. అనంతరం జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం ప్రయోజనాలు, పనితీరుపై గ్రామస్తులతో బృంద సభ్యులు సమీక్ష నిర్వహించారు. పేదరిక నిర్మూలనకు చేపట్టాల్సిన పనులపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఉపాధి పథకాన్ని మరింత విస్తృతం చేయాలని, రైతుల పంట పొలాలను అభివృద్ధి చేయాలని, పొలం రస్తాల వెంట వున్న కంపచెట్లను తొలగించాలని పలువురు కోరారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఉపాధి పథకమే తమను ఆదుకుందని, లేకపోతే ఎంతో మంది పస్తులుండాల్సి వచ్చేదని లక్ష్మీదేవి, శారదమ్మ అనే మహిళలు చెప్పారు. కేంద్ర బృందంలో కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ అశోక్ పంకజ్, ఎస్‌సీఏఈఆర్ ఎన్‌డీబీసీ డైరెక్టర్ సోనాల్డ్ దేశాయ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఎకనామికల్ అడ్వైజర్ ప్రవీణ్ మెహతా, ఎన్ఐఆర్‌డీ-పీఆర్ ప్రొఫెసర్ జ్యోతిస్ పాలన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోటేశ్వరరావు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పొగాకు రైతులకు వడ్డీ లేని రుణం

- రూ.10వేల చొప్పున 28,112 మంది రైతులకు..
- ఏపీలో ఫిబ్రవరి లేదా మార్చిలో ఆక్షన్ ప్రారంభం
- పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో మాండూస్ తుపాను ప్రభావంతో పొగాకు పంట నష్టపోయిన ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలకు చెందిన రైతులకు పొగాకు ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి నుంచి రూ.10 వేల చొప్పున వడ్డీ లేని పంట రుణం ఇచ్చేందుకు కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ మంత్రి పియూష్ గోయెల్ ఆమోదించారని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు చెప్పారు. గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి సభ్యులు 28,112 మంది రైతులకు రూ.10 వేల చొప్పున రూ.28.11 కోట్లు పంపిణీ చేసేందుకు అనుమతి లభించిందన్నారు. పొగాకు పంట నష్టపోయినట్లు రైతులు సెల్ఫ్ సర్టిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాజమండ్రిలోని సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీటీఆర్ఐ)కి చెందిన ఆరుగురు శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు అధికారులు, సిబ్బందితో కూడిన బృందాలు తుపాను ప్రభావిత పొగాకు పొలాలను సందర్శించి, తక్షణ నష్ట నివారణకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారని తెలిపారు. సుమారు రూ.25 కోట్ల మేర పొగాకు రైతులు మాండూస్ తుపాను వల్ల నష్టపోయారని తెలిపారు. ప్రస్తుతం బ్యారన్‌కు ఇచ్చిన రూ.5 లక్షలు రుణంకు అదనంగా మరో రూ.50 వేలు రుణం ఇవ్వాలని రాష్ట్ర బ్యాంకర్ల కమిటీకి సిఫారసు చేశామని చెప్పారు. అంతేకాకుండా పొగాకు పంట నష్టపోయిన రైతులకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు. ప్రస్తుతం కర్నాటక రాష్ట్రంలో పొగాకు వేలం జరుగుతోందని, అత్యధికంగా కిలోకు రూ.271 ధర లభిస్తోందని, సగటున కిలోకు రూ.239.16 లభించిందని తెలిపారు. ఏపీలో ఫిబ్రవరి మాసం చివర కానీ, మార్చి మొదటి వారంలో కానీ ఆక్షన్ ప్రారంభమవుతోందని శ్రీధర్‌బాబు వెల్లడించారు.


ఏపీఈపీడీసీఎల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో డిస్కం సీఎండీ కె.సంతోషరావు తదితరులు


● సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తోన్న గూడ్స్ రైలు పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో బోగీలను వదిలి ఇంజన్ వెళ్లిపోయింది. ఆ సమయంలో అటు వైపు రైళ్లు ఏమీ రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

సూక్ష్మ సేద్యం చకచకా

డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద తుంపర, బిందు సేద్యం పరికరాల అందజేత

- రాష్ట్రంలో ఇప్పటికే 1.16 లక్షల ఎకరాల్లో పరికరాల ఏర్పాటు
- ఈ నెలాఖరులోగా మరో లక్ష ఎకరాల్లో విస్తరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను విస్తరించడం ద్వారా వ్యవసాయ క్షేత్రాలు కళకళలాడేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ కింద బిందు సేద్యం, తుంపర సేద్య పరికరాలను పొందేందుకు రైతులు ఆర్‌బీకేల ద్వారా రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, సర్వే, అంచనాల తయారీ, మంజూరు ప్రక్రియతోపాటు పరికరాల అమరిక వేగం పుంజుకుంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హుల ఎంపిక, పరికరాల అమరిక పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 12 లక్షల మంది రైతులు 34.70 లక్షల ఎకరాల్లో బిందు, 12.98 లక్షల ఎకరాల్లో తుంపర సేద్యం చేస్తున్నారు. మరో 3.75 లక్షల ఎకరాల్లో డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద రూ.1,395 కోట్లతో బిందు, తుంపర సేద్య పరికరాలను అమర్చేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

90 శాతం సబ్సిడీపై పరికరాలు

ఈ ప్రాజెక్టు కింద ఐదెకరాల్లోపు విస్తీర్ణం గల చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 5నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం, ప్రకాశం మినహా కోస్తా జిల్లాల్లో 5నుంచి 12.5 ఎకరాల్లోపు రైతులకు 50 శాతం రాయితీతో బిందు, తుంపర సేద్య పరికరాలను అందిస్తున్నారు. ఇప్పటివరకు 5.88 లక్షల ఎకరాల్లో తుంపర, బిందు సేద్య పరికరాల కోసం 1.19 లక్షల మంది రైతులు ఆర్బీకేల్లో తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఇప్పటివరకు 2.16 లక్షల ఎకరాలకు సంబంధించి సర్వే పూర్తయింది. 1.30 లక్షల ఎకరాలకు సంబంధించి 49,597 మంది రైతులు తమ వాటా చెల్లించారు. 46,174 మంది రైతులకు చెందిన 1.26 లక్షల ఎకరాల్లో పరికరాల అమరికకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇప్పటివరకు 42,211 మంది రైతులకు చెందిన 1.16 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్య పరికరాలను అమర్చారు. ఈ నెలాఖరులోగా మరో లక్ష ఎకరాల్లో తుంపర, బిందు సేద్య పరికరాలను అమర్చనున్నారు. మార్చి నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అవసరం ఉన్న వారికే ప్రాధాన్యత



సూక్ష్మసేద్యం ప్రాజెక్టు శరవేగంగా జరుగుతోంది. పారదర్శకంగా అర్హుల ఎంపిక, పరికరాల అమరిక చేస్తున్నాం. జిల్లాల వారీగా లక్ష్యం నిర్దేశించినప్పటికీ ఎంతమందికి అర్హత ఉన్నా మంజూరు చేస్తున్నాం. క్షేత్రస్థాయి పరిశీలనలో అర్హుల గుర్తింపు, అంచనాల తయారీ, పరికరాల అమరికకు ప్రాధాన్యత ఇస్తున్నాం.
– డాక్టర్ సీబీ హరినాథరెడ్డి, పీవో, ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరుడు



కొత్తపల్లి: శ్రీశైలం ప్రాజెక్ట్‌లో నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. దీంతో శ్రీశైలం వెనుకజలాలలో నీటమునిగిన ప్రాచీన సంగమేశ్వరాలయం జలాధివాసం వీడుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా బుధవారం నాటికి 856 అడుగులకు చేరుకుంది. దీంతో సంగమేశ్వరాలయం ప్రధాన గోపురంతో పాటు చుట్టూ ఉన్న ఆలయ గోపురాలు బయటపడ్డాయి. మహాశివరాత్రి పర్వదినం నాటికి పూర్తిగా ఆలయం బయటపడి భక్తులకు సంగమేశ్వరుడు దర్శనమిస్తారని భక్తులు భావిస్తున్నారు.

రామ్‌పూర్ ప్రత్యేక కోర్టులో జయప్రద

ఎన్నికల నియమావళి కేసులో బెయిల్ మంజూరు



బరేలీ: ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ ప్రత్యేక కోర్టుకు సినీనటి, బీజేపీ నాయకురాలు జయప్రద హాజరయ్యారు. 2019నాటి ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులో ఆమె కోర్టు ఎదుట గత మూడున్నరేళ్లుగా గైర్హాజర్ కావడంతో గత నెలలో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. బుధవారం ఆమె కోర్టులో హాజరుకావడంతో న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. ''మాజీ ఎంపీ , బీజేపీ నాయకురాలు జయప్రద కోర్టు ఎదుట హాజరై బెయిల్ దరఖాస్తును సమర్పించారు. దీంతో కోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేసింది'' అని ప్రభుత్వం తరఫున లాయర్ తెలిపారు. స్థానిక అధికారుల అనుమతి లేకుండా 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో జయప్రద ఎన్నికల ర్యాలీ నిర్వహించడంతో రెండు వేర్వేరు పోలీసు స్టేషన్లలో ఆమె రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

వైరస్‌లను భోంచేస్తుంది

వింత సూక్ష్మజీవి ఉనికిని గుర్తించిన సైంటిస్టులు



వాషింగ్టన్: వైరస్‌లు. ఈ పేరంటేనే మనకు హడల్. కరోనా వంటి పలు రకాల వైరస్‌లు మనకే గాక ఇతర జీవ జాతులకూ ప్రాణాంతకాలు కూడా. అలాంటి వైరస్‌లనే లంచ్‌లోకి నమిలి మింగేసే ఒక వింత జీవి ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. నీళ్లలో తమ పరిధిలో ఉన్న నానా రకాల క్లోరో వైరస్‌లనూ అదీ ఇదీ అని లేకుండా ఇది భారీ సంఖ్యలో తినేస్తుందట! ఈ సూక్ష్మ జీవిని యూనివర్సిటీ ఆఫ్ నెబ్రాస్కా–లింకన్స్ పరిశోధకులు తొలిసారిగా కనిపెట్టారు. దీన్ని స్వచ్ఛమైన నీటిని కలుషితం చేసే హాల్టేరియా అనే సూక్ష్మజీవుల్లో ఓ జాతికి చెందినదిగా గుర్తించారు. ఇది మరో భోజనంతో పని లేకుండా కేవలం వైరస్‌లను మాత్రమే తిని పుష్టిగా పెరుగుతుందని, తమ సంతతినీ వృద్ధి చేసుకుంటోందని వారి పరిశోధనల్లో తేలడం విశేషం. పరిశోధనలో భాగంగా ఓ మంచినీటి కొలను నుంచి నీటిని సేకరించారు. అందులోకి క్లోరో వైరస్‌లను వదిలారు. కొంతకాలానికి వాటి సంఖ్య విపరీతంగా తగ్గిపోతుండటం వారిని ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో మరో రకం సూక్ష్మజీవులు పరిమాణంలో మామూలు కంటే ఏకంగా 15 రెట్లు పెరిగిపోతున్న వైనమూ కంటబడింది. వాటిని హాల్టేరియాగా గుర్తించారు. తినడానికి మరేమీ అందుబాటులో లేకపోవడంతో అవి హాయిగా క్లోరో వైరస్‌లనే తిని అరాయించుకుని అంతలా పెరిగాయట! ఈ పరిశోధన 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ద నేషనల్ అకాడెమీ సైన్సెస్'లో పబ్లిషైంది. దీని ఫలితాలు ఆహారచక్రం గురించిన మన అవగాహనను విప్లవాత్మకంగా మారుస్తాయని పరిశోధన బృందానికి చెందిన డాక్టర్ డిలాంగ్ అంటున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కి రక్తం గ్రూప్‌తో లింక్

ఎ గ్రూప్ ఉన్న వారికి 60 ఏళ్ల లోపు స్ట్రోక్ వచ్చే ప్రమాదం

వాషింగ్టన్: మీ రక్తం ఏ గ్రూప్ ..? దానిని బట్టి మీకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎంతో చెప్పేయొచ్చు. ఎ గ్రూప్ రక్తం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని మేరీల్యాండ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం చేసిన అధ్యయనంలో మనిషి రక్తంలో గ్రూప్‌కి, స్ట్రోక్‌కి మధ్య సంబంధం ఉందని తేలింది. ఈ అధ్యయనం వివరాలను మెడికల్ జర్నల్ ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ప్రచురించింది. ఒక మనిషి రక్తం గ్రూప్‌కు సంబంధించిన జన్యు రకాలను, మెదడు సహా ఇతర శరీర భాగాలకు రక్త సరఫరా సరిగా జరగకపోవడం వల్ల యుక్త వయసులో వచ్చే స్ట్రోక్స్‌కు సంబంధించిన డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు.

- ఒక వ్యక్తి రక్తం గ్రూప్ ఎ అయితే 60 ఏళ్ల కంటే ముందుగానే స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ గ్రూప్ కలిగిన వారి రక్తం గడ్డకట్టే ప్రమాదం అధికంగా ఉంటుంది. మిగతా గ్రూప్‌ల వారి కంటే స్ట్రోక్ వచ్చే అవకాశం 16% ఎక్కువ.
- ఓ–బ్లడ్ గ్రూప్ వారు నిశ్చింతగా ఉండొచ్చు. వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంది. మిగతా గ్రూప్‌ల కంటే రిస్క్ 12% తక్కువ.



- బి గ్రూప్ రక్తం ఉన్న వారికి ఏ వయసులోనైనా స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయి.

ఉత్తర అమెరికా, యూరప్, ఆసియా దేశాల్లో బ్రెయిన్ స్ట్రోక్స్‌పై జరిగిన 48పైగా అధ్యయనాలను విశ్లేషించి తాజా నివేదికను రూపొందించారు. ఈ అధ్యయనాల్లో 18 నుంచి 59 వరకు వయసు కలిగిన వారు ఉన్నారు. గతంలో ఒ గ్రూప్ కాని వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలున్నాయని తేలిందని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ బ్రాక్స్‌న్ మిచెల్ చెప్పారు.

సంక్షోభంలో పాక్

తలకు మించిన భారంగా ఇంధన దిగుమతులు

- కరెంటు ఆదా కోసం రంగంలోకి ప్రభుత్వం
- మార్కెట్లు, మాల్స్, ఫంక్షన్ హాళ్లు త్వరగా మూసేయాలని ఆదేశం
- జనం పెదవి విరుపు, వ్యాపారుల గగ్గోలు



ఇస్లామాబాద్: చుక్కలనంటుతున్న నిత్యావసరాల ధరలు. తీర్చలేని రుణ భారం. నానాటికీ పతనమవుతున్న కరెన్సీ విలువ. తీవ్ర రూపు దాలుస్తున్న కరెంటు కొరత. పులి మీద పుట్రలా పడ్డ ప్రకృతి విలయాలు... ఇలా ఎటు చూసినా సమస్యలతో పొరుగు దేశం పాకిస్తాన్ నానాటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. మరో శ్రీలంకలా మారకముందే ఏదోలా సమస్య నుంచి బయట పడే మార్గాల వెదుకులాటలో పడింది. ఆపద నుంచి గట్టెక్కించకపోతారా అని అంతర్జాతీయ ద్రవ్య నిధి తదితరాల వైపు ఆశగా చూస్తోంది...

పాకిస్తాన్‌లో నానాటికీ తీవ్ర రూపు దాలుస్తున్న ఆర్థిక సంక్షోభానికి అడ్డుకట్ట వేసేందుకు షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. దేశ మొత్తం దిగుమతుల్లో ఇంధన బిల్లుదే పెద్ద వాటా. ప్రస్తుతం విదేశీమారక నిల్వలు 11.7 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. దేశ మొత్తం దిగుమతి అవసరాలను తీర్చడానికి ఇవి మరో నెల రోజులు మాత్రమే సరిపోతాయి. ఈ నేపథ్యంలో ఇంధన పొదుపు కోసం ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగి పలు చర్యలు చేపట్టింది. మార్కెట్లన్నీ రాత్రి 8.30కల్లా మూసేయాలంటూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఫంక్షన్ హాళ్లు, రెస్టారెంట్లు కూడా పదింటికల్లా మూతబడాల్సిందేనని తేల్చి చెప్పింది. షాపింగ్ మాల్స్ కూడా ముందుగానే మూతపడుతున్నాయి. 'ఇంధన పొదుపు' లక్ష్యంతో మంగళవారం కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలన్నీ తక్షణం అమల్లోకి వస్తాయని పాక్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ వెల్లడించారు.

రూ.6,200 కోట్ల ఆదాయే లక్ష్యం...

పాక్‌లో విద్యుదుత్పాదన చాలావరకు చమురు ఆధారితమే. చమురు దిగుమతులపై ఏటా 300 కోట్ల డాలర్ల దాకా ఖర్చు పెడుతోంది. తాజా చర్యల ఉద్దేశం ఈ వ్యయాన్ని వీలైనంత తగ్గించడమే. అంతేగాక ప్రభుత్వ శాఖల్లో కూడా విద్యుత్ వాడకాన్ని కనీసం 30 శాతం తగ్గించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు వెల్లడించారు. దీనివల్ల మొత్తమ్మీద 6,200 కోట్ల రూపాయలు ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. వీటితో పాటు ఉద్యోగులు వీలైనంత వరకూ ఇంటి నుంచి పని చేసేలా చూడాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. నాసిరకపు విద్యుత్ బల్బుల తయారీ తదితరాలపై త్వరలో నిషేధం కూడా విధించనున్నారు. అయితే, ప్రభుత్వ తాజా నిర్ణయంపై దుకాణదారులు, ఫంక్షన్ హాల్స్, మాల్స్ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. కరోనాతో రెండేళ్లకు పైగా సతమతమై ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తమ పాటిల ఇది పిడుగుపాటు నిర్ణయమేనని, దీన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా షాపింగులు, రెస్టారెంట్లలో డిన్నర్లు పాకిస్తానీలకు రివాజు. ప్రభుత్వ నిర్ణయంపై వారినుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

600 కోట్ల డాలర్ల రుణం!

మరోవైపు ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడేందుకు ఐఎంఎఫ్ నుంచి కనీసం 600 కోట్ల డాలర్ల తక్షణ రుణం సాధించేందుకు పాక్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గత ఆగస్టులో ఐఎంఎఫ్ నుంచి పాక్ 110 కోట్ల డలర్ల రుణం తీసుకుంది. గత వేసవిలో విరుచుకుపడ్డ ఆకస్మిక వరదలు దేశాన్ని అతలాకుతలం చేసి వదిలాయి. వాటివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఏకంగా 4,000 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా.

గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు రూ.19,744 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఈ ఏడాది రూ.19,744 కోట్లు కేటాయించింది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర వేసింది. కేబినెట్ సమావేశానంతరం కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ కేబినెట్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా 2030 నాటికి రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయని తాము భావిస్తున్నట్లుగా చెప్పారు. వచ్చే అయిదేళ్లలో ఏడాదికి 50 లక్షల టన్నుల చొప్పున గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు కేటాయించిన రూ.20 వేల కోట్ల విలువైన ప్రోత్సాహకాలతో దాని ధర తగ్గుతుందని అన్నారు. కార్బన్ రహిత హైడ్రోజన్‌ను ఆటోమొబైల్స్ , ఆయిల్ రిఫైనరీలు, స్టీల్ ప్లాంట్లలో ఇంధనంగా వినియోగించవచ్చునని ఠాకూర్ చెప్పారు. ఈ మిషన్ కోసం ప్రాథమికంగా రూ.19,744 కోట్లు కేటాయించామని, స్ట్రాటజిక్ ఇంటర్‌వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ (సైట్) కార్యక్రమానికి రూ.17,490 కోట్లు, పైలెట్ ప్రాజెక్టులకు రూ.1,466 కోట్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కి రూ.400 కోట్లు, ఇతర అవసరాల కోసం రూ.388 కోట్లు ఖర్చు చేయడానికి కేబినెట్ అంగీకారం తెలిపిందని మంత్రి వివరించారు. ఈ మిషన్ సాకారమైతే ఇంధన రంగంలో భారత్ స్వయంప్రతిపత్తిని సాధిస్తుంది.



బిల్కిస్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం

న్యూఢిల్లీ: బిల్కిస్ బాను అత్యాచార ఘటన దోషుల ముందస్తు విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు సీపీఎం నేత సుభాషిణీ అలీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ బేలా ఎం.త్రివేదీల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. కాసేపటికే, ఈ విషయమై గతంలో బిల్కిస్ బానో వేసిన పిటిషన్‌పై విచారణ నుంచి గత డిసెంబర్ 13న జస్టిస్ త్రివేదీ తప్పుకున్న విషయాన్ని ఆమె తరఫు న్యాయవాది శోభా గుప్తా ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాంతో న్యాయమూర్తులిరువురూ కాసేపు చర్చించుకున్నారు. అనంతరం ఈ విచారణ నుంచి కూడా ఆమె తప్పుకుంటున్నట్టు జస్టిస్ రస్తోగీ చెప్పారు. ఆమె స్థానంలో మరో న్యాయమూర్తితో కలిసి ఫిబ్రవరి నుంచి విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. తాజా పిటిషన్లను బిల్కిస్ ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్‌కు కలిపి విచారిస్తామని వెల్లడించారు.

రిటైరైన జస్టిస్ నజీర్

ప్రజా న్యాయమూర్తి అంటూ సీజేఐ ప్రశంస



న్యూఢిల్లీ: జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విశేష సేవలందించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కొనియాడారు. బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వీడ్కోలు సభలో ఆయన ప్రసంగించారు. ''జస్టిస్ నజీర్‌ది బహుముఖీన వ్యక్తిత్వం. సాధారణ కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. ప్రజా న్యాయమూర్తిగా పేరుగడించారు'' అన్నారు. న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం తగినంత లేకపోవడం బాధాకరమని జస్టిస్ నజీర్ అన్నారు. జూనియర్ లాయర్లకు మంచి వేతనాలు, మరిన్ని అవకాశాలు కావాలని అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా...

సోనియాకు అస్వస్థత



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, ఎంపీ సోనియా గాంధీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వైరల్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ బారినపడ్డారు. చికిత్స కోసం బుధవారం ఉదయం ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరారు. సోనియా వెంట ఆమె కుమార్తె ప్రియాంకాగాంధీ వాద్రా ఉన్నారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సోనియా ఆరోగ్యంపై గంగారాం ఆసుపత్రి బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ చెస్ట్ మెడిసిన్‌లో ఆమెను డాక్టర్ ఆరూప్ బసు ఆధ్వర్యంలో అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. సోనియా గాంధీ మంగళవారం నుంచే అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది.

బ్రిటన్ విద్యార్థులు 18 ఏళ్లొచ్చేదాకా... గణితం నేర్వాల్సిందే: రిషి

లండన్: బ్రిటన్ విద్యార్థులకు 18 ఏళ్ల వచ్చేదాకా గణిత బోధన ఖచ్చితంగా ఉండాలని ఆ దేశ ప్రధాని రిషి సునాక్ అభిప్రాయపడ్డారు. ' 18 ఏళ్ల వచ్చేవరకు ప్రతి ఏటా గణితం చదవాల్సిందేననే నిబంధన బ్రిటన్‌లో ఇన్నాళ్లూ లేదు. ఇకపై అలా కుదరదు. ఖచ్చితంగా నేర్చుకోవాలి. ప్రపంచంలో ఏ ఉద్యోగం చూసినా డేటా, గణాంకాలతో ముడిపడి ఉంది. విద్యా వ్యవస్థకు గణితమే ప్రధాన భూమిక. అలాంటి విభాగంలో బ్రిటన్ విద్యార్థులు వెనుకంజ వేయొద్దు. గణితం నేర్వాల్సిందే' అని కొత్త ఏడాదిలో చేసిన తొలి ప్రసంగంలో సునాక్ స్పష్టంచేశారు. గణితం బోధనను తప్పనిసరి చేసేలా నిబంధనలను మార్చుతామని ప్రధాని చెప్పారని ప్రధాని కార్యాలయ అధికార ప్రతినిధి చెప్పారు. కాగా, బ్రిటన్‌లో చాన్నాళ్లుగా గణిత బోధకుల తీవ్ర కొరత ఉందని ది అసోసియేషన్ ఆఫ్ స్కూల్, కాలేజ్ లీడర్స్ తెలిపింది.

ఫస్ట్‌క్లాస్ టికెటెలా కొన్నాడో?

బాలీవుడ్ నటుడు సతీశ్ షాకు జాతి వివక్ష

ముంబై: లండన్ హీత్రూ విమానాశ్రయంలో తనకు జాతి వివక్ష అనుభవం ఎదురైందని ప్రముఖ బాలీవుడ్ నటుడు సతీశ్ షా చెప్పారు. ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణానికి టికెటెలా కొన్నాడంటూ ఇద్దరు ఎయిర్‌పోర్టు సిబ్బంది తనను ఉద్దేశించి మాట్లాడుకున్నారని తెలిపారు. భారతీయుడిని కాబట్టి కొన్నానంటూ నవ్వుతూ బదులిచ్చానని వెల్లడించారు. సతీశ్ ట్వీట్ వైరల్‌గా మారింది. 12,000 లైక్‌లు రాగా 1,300 మంది రీట్వీట్ చేశారు. భారతీయుడిని కాబట్టి ఖరీదైన టికెట్ కొన్నానంటూ సతీశ్ షా జవాబు చెప్పడం పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. బ్రిటిషర్లు భారత్‌ను 200 ఏళ్లపాటు పాలించకపోతే ఇప్పుడు భారతీయులకు ఇంగ్లాండ్ ఒక కాలనీగా మారి ఉండేదని ఓ నెటిజన్ అభిప్రాయపడ్డారు. సతీశ్ షా ను హీత్రూ విమానాశ్రయం ట్విట్టర్‌లో క్షమాపణ కోరింది. ఆ సంఘటనకు సంబంధించిన ఇతర వివరాలు ఉంటే ఇవ్వాలని విన్నవించింది.

లైంగిక సుఖానికి దూరమయ్యా... రూ.10,006 కోట్లివ్వండి

మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై ఓ వ్యక్తి కేసు

రత్లాం: గ్యాంగ్ రేప్ కేసు నుంచి నిర్దోషిగా బయటపడిన ఓ వ్యక్తి తనకు ప్రభుత్వం నష్ట పరిహారంగా రూ.10,006.2 కోట్లు చెల్లించాల్సిందేనంటూ కోర్టుకెక్కాడు. మధ్యప్రదేశ్‌లోని రత్లాం పట్టణంలో ఈ సంఘటన జరిగింది. గిరిజనుడైన కాంతూ అలియాస్ కాంతీలాల్ భీల్(35)ను గ్యాంగ్ రేప్ కేసులో 2020 డిసెంబర్ 23న పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు రెండేళ్లపాటు జైల్లో ఉన్నాడు. స్థానిక కోర్టు 2022 అక్టోబర్ 20న అతడిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. అంతరం కాంతీలాల్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. జైల్లో ఉన్నప్పుడు భార్యతో లైంగిక సుఖానికి దూరమయ్యానని, దేవుడిచ్చిన వరం వృథా అయ్యిందని, తీవ్ర మానసిక క్షోభ అనుభవించానని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు రూ.10,006.2 కోట్ల నష్ట పరిహారం చెల్లించేలా మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఇందులో రూ.10,000 కోట్లు మానసిక క్షోభ అనుభవించినందుకు మిగతా రూ.6.02 కోట్ల ఇతర ఖర్చుల కోసమని విన్నవించాడు.

పుర్రె పగిలి, వెన్ను విరిగి...

- చిత్రవధ అనుభవించిన అంజలి
- ఢిల్లీ కారు ప్రమాదంపై పోస్టుమార్టం
- మద్యం సేవించి లేదు: కుటుంబం



న్యూఢిల్లీ: వెన్నెముక విరిగిపోయింది. పుర్రె పగిలింది. దాంతో మెదడులో కొంత భాగం బయటికొచ్చి రోడ్డు పొడువునా పడిపోయింది. పక్కటెముకలు విరిగి ఛాతీ భాగం పగిలిపోయింది. వీపుపై చర్మం ఆనవాళ్లే లేకుండా పోయి శరీర భాగాలు బయటపడ్డాయి. అందరినీ కలచివేసిన ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో బాధితురాలు అంజలి పోస్టుమార్టం నివేదికలో తాజాగా వెలుగు చూసిన వివరాలివి! జనవరి 1 తెల్లవారుజామున అంజలి స్కూటీని కారు గుద్దేయడం, కారు కింద పడి అరుస్తున్నా అందులోని ఐదుగురు యువకులు ఆగకుండా 12 కిలోమీటర్ల దూరం అతి వేగంగా ఈడ్చుకుపోయి ఆమెను పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. ఆ క్రమంలో అంజలి ఎంతటి నరకం అనుభవించిందో పోస్టుమార్టం నివేదిక కళ్లకు కట్టింది. ఆమె ఒంటిపై 40కి పైగా గాయాలున్నట్టు తేల్చింది. అంతేగాకుండా ప్రమాద సమయంలో స్కూటీపై ఉన్న ఆమె స్నేహితురాలు నిధి చెప్పినట్టుగా అంజలి మద్యం సేవించలేదని నివేదికతో స్పష్టమైందని ఆమె కుటుంబీకులు చెబుతున్నారు.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: ఆప్

అంజలి కుటుంబాన్ని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పరామర్శించారు. రూ.10 లక్షల పరిహారం త్వరలో ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆమె తల్లికి పూర్తి వైద్యం అందిస్తామన్నారు. బాధితురాలి వ్యక్తిత్వ హననానికి పాల్పడేందుకు స్నేహితురాలే ప్రయత్నిస్తున్నట్టు కన్పిస్తోందని ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతీ మలివాల్ ఆరోపించారు. ప్రమాద సమయంలో అంజలి తాగి ఉందని నిధి చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ''అంతటి ఘోర ప్రమాదానికి గురైన మిత్రురాలిని కాపాడే ప్రయత్నం కూడా చేయకుండా ఇంటికెళ్లి పడుకున్న వ్యక్తి మాటలు నమ్మలేం. స్టేట్‌మెంట్‌లో ఆమె చెప్పిన విషయాలపై లోతుగా విచారణ జరగాలి'' అని డిమాండ్ చేశారు.

యూపీలోనూ అదే దారుణం

ఢీకొట్టి 3 కి.మీ. లాక్కెళ్లిన లారీ!

మహిళా లెక్చరర్ దుర్మరణం

లక్నో/కౌశాంబి(యూపీ): సంచలనం సృష్టించిన ఢిల్లీ ఘటన తరహాలోనే ఉత్తరప్రదేశ్‌లోనూ బుధవారం ఓ దారుణం జరిగింది. బందా జిల్లా మావై బుజుర్గ్ గ్రామంలో స్కూటీపై వెళ్తున్న మహిళా లెక్చరర్‌ను వేగంగా వచ్చిన ఓ భారీ ట్రక్కు బలంగా ఢీకొట్టి 3 కిలోమీటర్లు లాక్కెళ్లింది. దీంతో ఆమె తీవ్రగాయాలపాలై కన్నుమూసింది. ఈ క్రమంలో లారీలో మంటలు చెలరేగాయి. మంటలార్పి ట్రక్కు కింది నుంచి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. లక్నోకు చెందిన ఆమె యూనివర్సిటీ నుంచి ఇంటికెళ్తూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది.



కౌశాంబిలోనూ...

యూపీలోని కౌశాంబిలోనూ జనవరి ఒకటిన ఇలాంటి ఘటనే జరిగింది. కౌసల్యా దేవి అనే అమ్మాయి కంప్యూటర్ క్లాసు కోసం సైకిల్‌పై వెళ్తుండగా ఒక కారు అదుపు తప్పి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. సైకిల్‌తోపాటు ఆమెను 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. అమ్మాయి అదృష్టవశాత్తూ గాయాలతో బయటపడింది.

రిపబ్లికన్ అభ్యర్థి మెక్‌కార్తీకి ఎదురుదెబ్బ

- అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ ఎన్నికలో విపక్షానికి పరాభవం
- మూడు రౌండ్ల ఓటింగ్‌లో లభించని మెజార్టీ
- తొలిరోజు స్పీకర్‌ను ఎన్నుకోలేకపోవడం గత వందేళ్లలో ఇదే తొలిసారి



వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్)లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభ(హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)లో ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీదే మెజార్టీ. అయినప్పటికీ స్పీకర్ ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నెగ్గలేకపోయారు. నూతన సభ మంగళవారం కొలువుదీరింది. తొలిరోజు సభాపతి (స్పీకర్) ఎన్నిక నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగిన కెవిన్ మెక్‌కార్తీ మెజార్టీ ఓట్లు కూడగట్టడంలో విఫలమయ్యారు. మంగళవారం రాత్రంతా సభలో హైడ్రామా చోటుచేసుకుంది. మూడు రౌండ్లు ఓటింగ్ నిర్వహించారు. స్పీకర్‌గా నెగ్గడానికి 218 ఓట్లు అవసరం కాగా, మెక్‌కార్తీకి తొలి రెండు రౌండ్లలో 203 ఓట్ల చొప్పున, మూడో రౌండ్‌లో 202 ఓట్లు వచ్చాయి. దీంతో తదుపరి ఓటింగ్‌ను స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. స్పీకర్ లేకుండానే సభ వాయిదా పడింది. అమెరికా చరిత్రలో 1923 నుంచి చూస్తే ప్రతినిధుల సభలో తొలి రోజు స్పీకర్‌ను ఎన్నుకోలేకపోవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. మెక్‌కార్తీ ఇక ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కొత్త స్పీకర్ ఎన్నికయ్యే దాకా సభలో ఓటింగ్ నిర్వహిస్తారు. మెక్‌కార్తీకి వ్యక్తిగతంగా, రాజకీయంగా చాలామంది ప్రత్యర్థులు ఉన్నారని రిపబ్లికన్ ముఖ్యనేత ఒకరు చెప్పారు. ఆయన స్పీకర్‌గా ఎన్నిక కావడం సొంత పార్టీలోనే కొందరికి ఇష్టం లేదన్నారు. మెక్‌కార్తీ స్పీకర్ కావడం కష్టమేనని రిపబ్లికన్ సభ్యుడు బాబ్‌గుడ్ వ్యాఖ్యానించారు. స్పీకర్ లేకుండా సభ సంపూర్ణం కాదు. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడం, కమిటీలకు చైర్మన్లను నియమించడం, సభా కార్యకలాపాలు నిర్వహించడం వంటివి స్పీకర్ బాధ్యతలే. మెజారిటీ ఉన్నా సొంత పార్టీ అభ్యర్థి స్పీకర్‌గా నెగ్గకపోవడం విపక్షానికి చేదు అనుభవమేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్..!

సెనేట్ ఆమోదానికి పంపిన బైడెన్



వాషింగ్టన్ : భారత్‌లో అమెరికా రాయబారిగా ఎరిక్ గార్సెట్టిని (51) అధ్యక్షుడు జో బైడెన్ పునర్నియమించారు. ఎరిక్ నియామకాన్ని అమెరికా కాంగ్రెస్‌లో సెనేట్ ఆమోదించాల్సి ఉంది. లాస్ ఏంజెల్స్ మాజీ మేయర్ అయిన ఎరిక్ గార్సెట్టి బైడెన్‌కు అత్యంత సన్నిహితుడు. గతంలో 2021 జులైలో ఎరిక్‌ను భారత రాయబారిగా నియమించినప్పుడు అప్పట్లో రిపబ్లికన్ సెనేటర్ చక్ గ్రాసిటీ అడ్డుకున్నారు. మరోవైపు తన పాలనా విభాగంలోని కీలక పదవుల్లో అరడజనుకిపైగా ఇండియన్ అమెరికన్లను బైడెన్ మంగళవారం రీ నామినేట్ చేశారు. బైడెన్ డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ మేనేజ్‌మెంట్ రిసోర్సెస్ పదవికి రిచర్డ్ వర్మ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ప్రతినిధిగా డాక్టర్ వివేక్ హాలెగెరె మూర్తి (45)ని రీ నామినేట్ చేస్తూ సెనేట్ ఆమోదానికి పంపించారు. వీరే కాకుండా ప్రవాస భారతీయులైన అంజలి చతుర్వేది, రవి చౌధరి, గీతా రావు గుప్తా, రాధా అయ్యంగార్‌లను ప్రభుత్వంలో వివిధ పదవులకు రీ నామినేట్ చేస్తూ సెనేట్‌కు పంపించారు.

తోటి ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన

- న్యూయార్క్–ఢిల్లీ ఎయిర్ ఇండియా ఫ్లైట్‌లో దారుణం
- నిందితుడిపై 30 రోజులపాటు నిషేధం విధించిన ఎయిరిండియా



ముంబై: న్యూయార్క్–ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానంలో షాకింగ్ సంఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు తోటి ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేశాడు. అతడు 70 ఏళ్ల వృద్ధుడని తెలిసింది. గత ఏడాది నవంబర్ 26న జరిగిన ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖరీదైన బిజినెస్ క్లాస్‌లో ప్రయాణిస్తూ అందరూ తలదించుకొనేలా ప్రవర్తించాడు. దీంతో అతడు 30 రోజులపాటు తమ విమానాల్లో ప్రయాణించకుండా ఎయిర్ ఇండియా యాజమాన్యం నిషేధం విధించింది. తీవ్ర అభ్యంతరకరంగా, అమర్యాదకరంగా ప్రవర్తించాడని ఆక్షేపించింది. ఎయిర్ ఇండియా సమాచారం ప్రకారం.. నవంబర్ 26న ఏఐ–102 విమానం అమెరికాలోని న్యూయార్క్ జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టు నుంచి స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఢిల్లీకి బయలుదేరింది. ప్రయాణికులంతా భోజనం చేసిన తర్వాత లైట్లు ఆర్పేశారు. కొద్దిసేపటికి మద్యం మత్తులో ఉన్న వృద్ధుడు నెమ్మది నడుచుకుంటూ వెళ్లి, సీట్లో కూర్చున్న ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేశాడు. అనంతరం అక్కడే నిల్చున్నాడు. మరో ప్రయాణికుడు ఇదంతా గమనించి, గట్టిగా మందలించడంలో తన సీట్లోకి తిరిగి వచ్చాడు. విమానంలోని సిబ్బంది బాధితురాలికి మరో సీట్ ఏర్పాటు చేశారు. విమానంలో తనకు జరిగిన అవమానంపై బాధితురాలు ఎయిర్ ఇండియా అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అధికారులు ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వృద్ధుడిపై కేసు నమోదయ్యింది. విమానం ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత నిందితుడిని ఎయిర్ ఇండియా సిబ్బంది పట్టుకోకుండా వదిలేశారని బాధితురాలు ఆరోపించింది. ఆమెకు న్యాయం చేకూర్చేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తామని ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఎయిర్ ఇండియా నుంచి పూర్తి నివేదిక కోరామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) స్పష్టం చేసింది. నిందితుడి కోసం గాలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసు అధికారుల బుధవారం తెలియజేశారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 5 । జనవరి । 2023



వేణుగోపాలుని సేవలో మంత్రి జోగి రమేష్

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణుగోపాలస్వామిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ బుధవారం దర్శించుకొన్నారు.



గ్రామాల్లో రెడ్‌క్రాస్ సేవల విస్తరణ

చిలకలపూడి(మచిలీపట్నం): రెడ్‌క్రాస్ సేవలు గ్రామాల్లో సైతం విస్తరించాలని కృష్ణా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. చిన్నాపురంలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. -8లో▶



ఫ్యామిలీ పెన్షన్ మేళా

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో సెకండరీ ఫ్యామిలీ పెన్షన్- మెగా పీపీఓ మేళా నిర్వహించారు. 101 మందికి పీపీఓలు అందజేశారు. -8లో▶

శాప్‌లో ప్రక్షాళన

● గత పాలకుల వైఖరి కారణంగా శాప్‌పై అవినీతి మరక ● వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి ఉద్యోగులపై కొరడా ● ప్రభుత్వ చర్యలతో క్రీడాకారులు, సంఘాల్లో పెరిగిన విశ్వాసం

గత పాలకుల హయాంలో అవినీతి తిమింగలంగా ముద్ర పడిన ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)లో ప్రక్షాళన జరుగుతోంది. క్రీడాకారులను, క్రీడా సంఘాల ప్రతినిధులను ఇబ్బందులకు గురి చేస్తూ అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఆరునెలల క్రితం ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకున్న దరిమిలా క్రీడాకారుల్లో శాప్‌పై విశ్వాసం ఏర్పడింది. తాజాగా ఆ శాఖ ఉన్నతాధికారులు మరో మహిళా అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పలు క్రీడా సంఘాల నాయకులు, క్రీడాకారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



విజయవాడ స్పోర్ట్స్: ఏడాదిన్నర క్రితం వరకు కూడా రాష్ట్ర క్రీడా శాఖపై క్రీడాకారులకు, క్రీడా సంఘాల ప్రతినిధులకు సదభిప్రాయం ఉండేది కాదు. శాప్ అంటే ఓ అవినీతి తిమింగలం అనే భావన వారిలో వేళ్లానుకుపోవడమే అందుకు కారణం. రాష్ట్ర విభజన తరువాత 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వారి అనుయాయులకే పోస్టింగ్‌లు ఇచ్చి కోట్లాది రూపాయలను పక్కదారి పట్టించి శాప్‌కు అవినీతి మరక అంటించింది. శాప్‌పై పడిన అవినీతి ముద్రను చెరిపేందుకు గత మూడేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అవినీతి అధికారులపై చర్యలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ఆరు నెలల కిందట ముగ్గురు అధికారులపై వేటు

జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు శాప్ ద్వారా పారితోషకాలను అందిస్తాయి. క్రీడలను నిర్వహించే సంఘాలకు ఖర్చులను అందజేస్తాయి. అయితే ఈ నగదును ఇచ్చేందుకు శాప్ అధికారులు క్రీడాకారులు, సంఘాల నుంచి పర్సంటేజీలను వసూలు చేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. పర్సంటేజీ ముందుగానే ఇచ్చుకోలేని ఎందరో క్రీడాకారులు, సంఘాలు ఏళ్ల తరబడి శాప్ చుట్టూ తిరుగుతూనే ఉండేవి. శాప్ వీసీ, ఎండీగా డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత శాప్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలల క్రితం ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేశారు. రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసిన క్రీడాకారులను ఎయిర్‌పోర్టుకు వెళ్లి మర్యాదపూర్వకంగా ఆహ్వానించడం, కార్యాలయానికి తీసుకువెళ్లి సన్మానించే సత్సంప్రదాయం కూడా ప్రారంభించారు. దీంతో క్రీడా సంఘాల ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారుల్లో శాప్‌పై నమ్మకం కలిగింది. అప్పటినుంచి వారు శాప్ మెట్లెక్కడం ఆరంభమైంది. అయితే కార్యాలయంలో తిష్ట వేసి అవినీతికి పాల్పడుతున్న మరికొందరు అధికారులను తొలగిస్తేనే శాప్‌కు పూర్తిగా స్వచ్ఛత సంతరించుకుంటుందనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది.

మహిళా అధికారి నోటి దురుసు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు అందించే 'పారితోషికాలు (ఇన్సెంటివ్స్)'తో పాటు, స్టోర్, వాటర్ స్పోర్ట్స్ క్రీడకు సంబంధించిన శాఖను పర్యవేక్షించే సెక్షన్ మహిళా అధికారికి తాజాగా మెమోలతో పాటు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న ఈమెకు గతంలోనూ పలుసార్లు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. వాటర్ స్పోర్ట్స్ క్రీడకు సంబంధించిన కార్యకలాపాలపై ఆమె తరచూ తమను ఇబ్బందులు పెడుతోందంటూ సంబంధిత ఆంధ్రప్రదేశ్ రోయింగ్ సంఘం ప్రతినిధులు ఇటీవల శాప్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఓ క్రీడాకారుడు తనకు రావాల్సిన పారితోషికం ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆమెపై ఫిర్యాదు చేశాడు. ఇదే సెక్షన్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు కూడా ఆమె ప్రవర్తనపై అధికారులకు ఫిర్యాదు చేశారు. తనను ప్రశ్నించిన అధికారులపై ఆమె మహిళా ఉద్యోగినైన తనను వేధిస్తున్నారంటూ బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆమె నోటి దురుసు కారణంగా ఆ సెక్షన్‌లో పనిచేసే ఓ ఉద్యోగి స్పృహ తప్పి పడిపోగా అత్యవసరంగా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని తోటి ఉద్యోగులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమెపై క్రమశిక్షణ చర్యలకు కూడా సిఫార్సు చేశారు. సభ్యత, సంస్కారం లేకుండా ప్రవర్తిస్తూ దూషిస్తోందంటూ లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెకు గత నెల 22న మెమో జారీ చేశారు. పది రోజుల లోపు సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నా ఇప్పటి వరకు ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదంటూ కార్యాలయ అధికారులు చెబుతున్నారు.



ఫ్లయిట్ టికెట్లు బుక్ చేయమన్నారు



వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు సెక్షన్ ఆఫీసర్ జూన్‌గెహ్లాట్ ఎన్నో ఇబ్బందులను సృష్టించారు. ఆమె అడిగిన ప్రతి పేపర్‌ను అందజేశాం. అయినా ఇబ్బందులు పెడుతూనే ఉండేవారు. మా డబ్బులతోనే కొన్నిసార్లు ఆమెకు ఫ్లయిట్ టికెట్లు బుక్ చేయించిపెట్టాం. ఆమె హైదరాబాద్, వైజాగ్ వెళ్లాలంటే మేం కారులో డ్రాప్ చేసి రావాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులు పడలేక ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శాప్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

–పి.భాను, కార్యనిర్వాహక సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రోయింగ్ సంఘం

మహిళా అధికారిపై ఫిర్యాదులు వాస్తవం

సెక్షన్ ఆఫీసర్ జూన్‌గెహ్లాట్ ప్రవర్తనపై ఆమె చూసే సెక్షన్ ఉద్యోగుల నుంచి ఫిర్యాదులొచ్చిన మాట వాస్తవం. కొన్ని సంఘాల ప్రతినిధులు, జాతీయ పతకాలు సాధించిన కొందరు క్రీడాకారులు కూడా ఆమెపై ఫిర్యాదులిచ్చారు. దీనిపై సమాధానం చెప్పాలని ఆమెను కోరాం. ఇప్పటి వరకు ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. సమాధానం వచ్చిన తరువాత ఉన్నతాధికారులతో సమాలోచన చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం.

–ఉమామహేశ్వరరావు, పరిపాలన అధికారి, శాప్

న్యూస్‌రీల్

'డూప్లికేటుగాళ్లు'పై ఆరా!

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, విజయవాడ: సాక్షి దినపత్రికలో 'డూప్లికేటుగాళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందన వచ్చింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఉన్నతాధికారులు, ఇంటిలిజెన్స్ అధికారులు నకిలీలపై ఆరా తీస్తున్నారు. పోలీసులు ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. రాజ్ చైతన్య వెనుక ఎవరెవరు ఉన్నారు? ఈ ముఠా ఎక్కడెక్కడ దొంగ రిజిస్ట్రేషన్లు చేశారు. వీరికి సహకరించిన వారెవరు? ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.రెవెన్యూ శాఖలో పనిచేసే వ్యక్తికి ఈ ముఠాతో ఉన్న లింకులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఫేక్ డాక్యుమెంట్ల వ్యవహారం బయటపడినప్పటి నుంచి అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రెండు రోజుల్లో ఈ వ్యవహారం పూర్తిగా ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

ఈ నెలలో 26, 27 తేదీల్లో జాతీయస్థాయి నృత్య పోటీలు



విజయవాడ కల్చరల్: శ్రీనృత్యనిలయం ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో జాతీయ స్థాయి, సంప్రదాయ కూచిపూడి, జానపద నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్టు నాట్యాచారిణి జి.శైలశ్రీ తెలిపారు. సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే జాతీయస్థాయి నృత్య పోటీలలో సబ్ జూనియర్స్ 9 సంవత్సరాల లోపు, జూనియర్స్ 13 సంవత్సరాల లోపు, ఆపై సీనియర్ విభాగంలో పోటీలు జరుగుతాయని, ఏ విధమైన ప్రవేశరుసుము చెల్లించనవసరం లేదన్నారు. వివరాల బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో ఈవెంట్ డైరెక్టర్ ఎండీ అక్బర్ పాషా, సంస్థ సభ్యులు కె. రమేష్, యోహాన్, రాజ్, తులసీరామ్, భాను ప్రకాష్ పాల్గొన్నారు. వివరాలకు జి.శైలజ, 83091 74713 నంబరులో సంప్రదించాలని కోరారు.

భూసేకరణకు ప్రజలు సహకరించాలి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్



గుడివాడరూరల్: గుడివాడ పట్టణం, మండలంలో నూతనంగా నిర్మించనున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం నిర్వహించే భూసేకరణకు ప్రజలు, రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులు, రైతులు, ప్రజలతో భూసేకరణపై సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణం, మండలంలో సేకరించనున్న భూములకు నష్టపరిహారం కింద ప్రభుత్వం చెల్లించనున్న పారితోషకాలను వివరించారు. ఇబ్బందులు ఉంటే వెంటనే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఆర్డీవో పి.పద్మావతి, తహసీల్దార్ కె.ఆంజనేయులు, జాతీయ రహదారులశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్యాలయ భూసేకరణ అధికారులు, సిబ్బంది, గుడివాడ, బిళ్లపాడు, మల్లాయపాలెం, గంగాదరపురం గ్రామాల రైతులు, రెవిన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి కృష్ణా టెన్నిస్ బాల్ క్రికెట్ సెలక్షన్స్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండపల్లి జెడ్పీ బాలుర పాఠశాలలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి సీనియర్స్ మెన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ సెలక్షన్స్ శుక్రవారం జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకటేష్ నాయక్ తెలిపారు. ఎంపిక అయిన క్రీడాకారులు ఈనెల 10,11,12 తేదీల్లో ఏలూరు జిల్లా చింతలపూడిలో జరిగే సీనియర్ లీగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. సీనియర్ లీగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని ఈనెల 27, 28, 29 తేదీల్లో ఒంగోలులో జరిగే 30వ ఫెడరేషన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తారు. వివరాలకు 93912 83387 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాంకేతికతతో విద్యుత్ చౌర్యానికి చెక్

- 5,578 మందిపై కేసులు నమోదు
- రూ.7.45 కోట్లు జరిమానా
- అత్యధికంగా రామవరప్పాడు రింగ్, గంపలగూడెం, పెడనలో చోరీ కేసులు
- విద్యా, వ్యాపార సంస్థల్లోనే ప్రధానంగా విద్యుత్ చౌర్యం



విద్యుత్ చోరీలను గుర్తించి కేసు నమోదు చేస్తున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యుత్ చౌర్యానికి అడ్డుకట్ట వేసే దిశగా విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు అడుగులు వేస్తున్నారు. వారు ఇటీవల వెలువరించిన వార్షిక నివేదికలో ఈ విషయం తేటతెల్లం అయ్యింది. విద్యుత్ శాఖ ఆపరేషన్, విజిలెన్స్ అండ్ యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్, డిస్కం నుంచి ప్రత్యేక అధికారులు, సిబ్బంది తొమ్మిది బృందాలుగా ఏర్పడి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరెంటు దొంగలను జల్లెడ పట్టారు. విద్యుత్ డీఈలు, ఏఈలతో పాటు విజిలెన్స్‌లోని సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుల్, హోంగార్డులు ఈ బృందాల్లో సభ్యులుగా ఉండి మారుమూల ప్రాంతాల్లో సైతం విద్యుత్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.

వ్యాపార సంస్థల విద్యుత్ దోపిడీ

అధికారుల నిఘాలో ప్రధానంగా వ్యాపార సంస్థలే అత్యధికంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు తేటతెల్లమైంది. విద్యా సంస్థలు, మినరల్ వాటర్ ప్లాంట్‌లు, రైస్ మిల్లులు, కోళ్ల ఫారాలు, చేపల చెరువులు, ఇటుకల బట్టీలు, మరికొన్ని పరిశ్రమలతో పాటు నివాస ప్రాంతాల్లోనూ విద్యుత్ చోరీలు జరిగాయి. గంపలగూడెం, పెడన, చాట్రాయి, నూజివీడు రూరల్, వత్సవాయి, పెడన, ఉయ్యూరు, విజయవాడ రూరల్ పరిధిలోని రామవరప్పాడు రింగ్ విద్యుత్‌శాఖ సెక్షన్‌లలో ఈ తరహా ఘటనలు వెలుగు చూశాయి. రామవరప్పాడు రింగ్ ప్రాంతంలోని ఓ విద్యాసంస్థ చేసిన విద్యుత్ చోరీని సెప్టెంబర్ నెలలో అధికారులు గుర్తించారు. ఆ సంస్థకు రూ.2.75 లక్షలు జరిమానా విధించారు. గంపలగూడెంలోని వాటర్‌ప్లాంట్‌కు రూ.2.52 లక్షలు, పెడనలోని చేపల చెరువుకు 2.04 లక్షలు, చాట్రాయిలోని కోళ్ల ఫారానికి రూ.1.50 లక్షలు, పెడనలోని ఓ ఇంటికి రూ.1.74 లక్షలు జరిమానా విధించారు.

రూ.7.45 కోట్ల జరిమానా

గత ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు అధికారులు నమోదు చేసిన కేసుల వివరాల ప్రకారం డైరెక్ట్ టాపింగ్(విద్యుత్ లైన్లకు నేరుగా వైర్లు వేలాడ దీసి చోరీ చేయడం) 664, మీటర్ బైపాస్(విద్యుత్ మీటర్‌కు మరో వైరును ఏర్పాటు చేసి మీటర్ తిరగకుండా చేయడం) 625, మాల్‌ప్రాక్టీస్(ఒక కేటగిరీకి అనుమతి తీసుకుని వేరే కేటగిరీకి విద్యుత్ వాడటం) 504, డెవలప్‌మెంట్(అధిక లోడు వాడటం) 3,597, బాక్‌బిల్లింగ్(కేటగిరీ మార్చకుండానే అధికలోడు వాడటం) 126, హెచ్‌డీ(హై డెన్సిటీ పరిశ్రమలు) సర్వీస్ 62 కేసులు నమోదయ్యాయి. మొత్తం 5,578 కేసులకుగానూ 7 కోట్ల 45 లక్షల 37 వేల 121 రూపాయలను జరిమానాగా విధించారు.

నిరంతర పర్యవేక్షణ



విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎండీ మల్లారెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్యలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఆల్ఫాన్స్, డీఈ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించాం. దొంగతనం చేస్తూ తొలిసారి పట్టుబడిన వారికి జరిమానా విధిస్తున్నాం. పదేపదే దొంగతనాలు చేస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నాం, అభివృద్ధి చెందిన సాంకేతికత ఆధారంగా విద్యుత్ చోరీ జరుగుతున్న ప్రదేశాన్ని గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సందర్భాల్లో ప్రజల నుంచి వస్తున్న సమాచారం కూడా మాకు చాలా సహకరిస్తోంది.

–గంగాభవానీ, సీఐ, విద్యుత్ శాఖ విజిలెన్స్

అంధులకు వెలుగు ప్రదాత బ్రెయిలీ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



అంధ విద్యార్థికి కేక్ తినిపిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంధుల జీవితాల్లో వెలుగులు నింపి, వారికి ఆరాధ్యదైవంగా నిలిచిన లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయులని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సర్ లూయిస్ బ్రెయిలీ 214 వ జయంతి వేడుకలు బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంధ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ భాషకైనా అన్వయింపగలిగిన విధంగా లిపిని రూపొందించిన ఘనత ఆ బ్రెయిలీకే దక్కుతుందన్నారు. అంధులలో ఎంతో మంది గొప్ప కవులు, కళాకారులు, రాజకీయవేత్తలు ఉన్నారన్నారు. గొప్ప కవి గాయకుడు సూరదాస్, ప్యారడైజ్ లాస్ట్ రచించిన మిల్టన్‌ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంధులకు చూపు లేకపోయినా వినికిడి శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. అంధులకు సదరం సర్టిఫికెట్లు వేగంగా జారీ చేయాలని, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ బ్లయిండ్ సొసైటీ ద్వారా దాతలు ఇచ్చిన కళ్లతో కంటి చూపు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. లూయిస్ బ్రెయిలీ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో విజయమేరీ అంధుల పాఠశాల విద్యార్థిని వర్షిత బ్రెయిలీ లిపిని చదివి, వినిపించి అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అంధులకు ఉపకరించే ల్యాప్‌ట్యాప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రామ్‌కుమార్, జిల్లా అంధ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ కెప్టెన్ అజయకుమార్ రెడ్డి, న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి, మానసిక వైద్యుడు డాక్టర్ జి.శంకరరావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంత విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి

అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో జేసీ, డీఆర్వో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి వివిధ దశల్లో ఉన్న 5 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సామూహిక గృహ ప్రవేశాలకు 12వేల ఇళ్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, అందులో 7వేల ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన 5వేల ఇళ్లను వారాల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని ఉగాది నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టరేట్ నుంచి బుధవారం జగనన్న కాలనీలు, నాడు-నేడు పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ఇళ్లు, రూఫ్ లెవల్, ఆర్‌సీ స్థాయిలో ఉన్న వాటిని వారానికి రెండు వేలు లక్ష్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలలో ప్రగతి చూపని మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలతో కూడిన టీం సభ్యులు సంజాయిషీ ఇవ్వవలసి ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు.

మన బడి నాడు- నేడు పనులను త్వరితగతిన చేయాలి

నాడు-నేడు కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపడుతున్న అదనపు తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు వంటి వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో జిల్లాలో 341 పాఠశాలల్లో రూ.811 కోట్లతో పనులు పూర్తి చేశామన్నారు. అదే స్ఫూర్తిని రెండవ దశలోనూ కొనసాగించాలని కలెక్టర్ అధికారులను కోరారు. రెండవ దశలో 431 పాఠశాలల అభివృద్ధికి రూ.185.12 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీటితో 96 ఉన్నత పాఠశాలలు, 69 ప్రాథమికోన్నత, 266 ప్రాథమిక పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టడం, తాగునీటి సౌకర్యం కల్పించడం, మధ్యాహ్న భోజనానికి ప్రత్యేక షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో శ్మశానవాటికలకు స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన జనాభా ఎక్కువగా నివసించే ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పత్రాల పంపిణీ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. లంక భూముల లీజుకు సంబంధించి రెన్యూవల్ పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, హౌసింగ్ డీఈ రవికాంత్, డీఈఓ సీవీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల నవీకరణతోనే పురోగతి

సిద్ధార్థలో ఉత్సాహంగా బ్లిట్జ్‌క్రీగ్-2023



విద్యార్థినుల ఫ్యాషన్ షో

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత తమలోని నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం ద్వారా జీవితంలో పురోగతి సాధించవచ్చని స్టేట్ స్ట్రీట్ హెచ్‌సీఎల్ సర్వీసెస్ విజయవాడ సెంటర్ హెడ్ బాలాజీ రామన్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సిద్ధార్థ ఆడిటోరియంలో బ్లిట్జ్‌క్రీగ్-2023 పేరుతో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో సాంస్కృతిక, సాంకేతిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి బాలాజీ రామన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే యువత నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత రిలాక్స్ కాకుండా ఐటీ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తదనుగుణంగా అప్‌డేట్ అవుతుండాలని, అప్పుడే జీవితంలో మంచి స్థాయికి చేరగలమన్నారు. మరో అతిథి గన్నవరంలోని టెక్ మహీంద్ర కంపెనీ హెచ్‌ఆర్ విభాగం హెడ్ వి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమలోని ప్రతిభను నిరూపించుకోడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల ఉపాధి విభాగాధికారి కావూరి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను బహిర్గతం చేయడానికి ఇలాంటి వేదికలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలాజీ రామన్

ఉత్సాహంగా సాగిన పోటీలు

అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టెక్నికల్ క్విజ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, స్పాట్ ఫొటోగ్రఫీ, ట్రెజర్ హంట్, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, బిజినెస్ ఐడియాస్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ మేధస్సును చూపారు. మిస్టర్ అండ్ మిస్ బ్లిట్‌క్రీగ్-2023 పేరుతో నిర్వహించిన ఫ్యాషన్ షోలో విద్యార్థులు ర్యాంప్ వాక్ చేసి అలరించారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి కోడ్ జ్ఞాస్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు యు.సాయిరామ్, సాకేత్ హాజరై వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.



ప్యాప్టో జిల్లా చైర్మన్‌గా సయ్యద్ ఖాశిం



ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ప్యాప్టో చైర్మన్‌గా సయ్యద్ ఖాశిం (ఏపీటీఎఫ్) ఎన్నికయ్యారు. ఇబ్రహీం పట్నంలో బుధవారం నిర్వహించిన ప్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశంలో పరిశీలకులు ఇమామ్ బాష ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా షేక్ ఇక్బాల్ బాషా, కో చైర్మన్‌లుగా గంధం రామారావు, ఇంటి రాజు, సహాయ కార్యదర్శులుగా అలవాల సుందరయ్య, వేముల భిక్షమయ్య, రవీంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వీరిని ప్యాప్టోలోని వివిధ యూనియన్‌ల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ బియ్యం పంపిణీ తనిఖీ



పెనమలూరు: ఆహార భద్రత చట్టం కింద పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఏపీ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌జోషి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్‌సింగ్ తనిఖీ చేశారు. కామయ్యతోపు, పోరంకి ప్రాంతాల్లో తెల్లరేషన్ కార్డుదారులకు వాహనం ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని బుధవారం పరిశీలించారు. పంపిణీలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. తహసీల్దార్ టీవీ సతీష్, పీడీఎస్ డీటీ భవాని, ఆర్‌ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా



గరికపాడు(జగ్గయ్యపేట): కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 65వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం హాలియా నుంచి విజయవాడ వెళ్తున్న కారు గ్రామంలోని కేవీకే వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మస్తాన్‌వలి, వెంకటరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విజయవాడలో సెకండరీ ఫ్యామిలీ పెన్షన్ మేళా

101 పీపీఓలు అందజేసిన డీఆర్‌ఎం



పెన్షనర్‌కు పీపీఓ అందజేస్తున్న డీఆర్‌ఎం శివేంద్రమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశంలోనే మొట్ట మొదటిసారిగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో ఒకేసారి 101 మందికి సెకండరీ ఫ్యామిలి పెన్షన్ పీపీఓలు (పెన్షన్ పేమెంట్ ఆర్డర్) అందజేయడం డివిజన్‌కే గర్వకారణం అని డీఆర్‌ఎం శివేంద్రమోహన్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సెకండరీ ఫ్యామిలి పెన్షన్- మెగా పీపీఓ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అతిథులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోవిడ్ కారణంగా గత రెండేళ్లుగా సెకండరీ ఫ్యామిలీ పెన్షన్‌లు సుమారు 170 వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించడం కోసం కచ్చితమైన లబ్ధిదారులను ఎంపిక సులభతరంగా ఉండేలా జేపీఓ (జాయింట్ ప్రొసీజర్ ఆర్డర్) జారీ చేసిన హెడ్ క్వార్టర్స్ పర్సనల్, అకౌంట్స్ విభాగం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కారణంగానే డివిజన్ వ్యాప్తంగా పర్సనల్, అకౌంట్స్ విభాగం అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో మరణించిన రైల్వే ఉద్యోగిపై ఆధారపడి జీవించే అవివాహిత, విడో, విడాకులు తీసుకున్న కుమార్తెలు, శారీరక, మానసిక విభిన్న ప్రతిభావంతులను గుర్తించి పీపీఓలు అందించామని చెప్పారు. అందుకోసం పర్సనల్ బ్రాంచ్‌లో పెన్షన్‌దారుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి బ్యాంకు అధికారులతో సంప్రదింపులు చేయడం ద్వారా పెండింగ్ కేసులను యుద్ధ ప్రాతిపాదికన క్లియర్ చేశామని వెల్లడించారు. అందుకు కృషి చేసిన పర్సనల్, అకౌంట్స్ బ్రాంచ్ అధికారులను డీఆర్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు. పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే వారు రైల్వేశాఖ జారి చేసిన కచ్చితమైన ధ్రువపత్రాలు సమర్పించినట్‌లైతే కేవలం 45 రోజుల్లోనే వారికి పీపీఓలు అందిస్తామని వివరించారు. పీపీఓలు పొందిన వారు భవిష్యత్తులో వారి ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు చోటు చేసుకుంటే అట్టి సమాచారం రైల్వేశాఖకు తెలియజేసి తమ పీపీఓలు రద్దు చేసుకోవాలని కోరారు. ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు అంకిత భావంతో సేవలు అందించడంలో విజయవాడ డివిజన్ ముందుంటుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పి.కిషోర్‌బాబు మాట్లాడుతూ రైల్వేలో శ్రమించి విధులు నిర్వర్తించినన ఉద్యోగుల శ్రమ వృథా కాకుండా కష్ట కాలంలో వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ రూపంలో అండగా ఉండటం గొప్పవిషయం అన్నారు. అనంతరం డీఆర్‌ఎం చేతుల మీదుగా పెన్షన్‌దారులకు పీపీఓలు అందజేశారు. సీనియర్ డీపీఓ బాలమురళీధర్, సీనియర్ డీఎఫ్‌ఎమ్ పి.చంద్రశేఖర్, డీపీఓ షాహబాజ్ హనూర్, ఏపీఓ సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి విజయం సాధించండి

రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి

గుడివాడ రూరల్: కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించడానికి ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగవరం కే-కన్వెన్షన్‌లో గుడివాడ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముఖ్య నేతల సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్ల శ్రీను అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా అయోధ్య రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలిశ్రీవెంకటేశ్వరరావు (నాని) మరో సారి అఖండ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, మిగిలిన పార్టీలు కలిసి కుట్రలు చేసేందుకు ఇప్పటికే సిద్ధమయ్యాయని, వాటిని తిప్పి కొట్టేందుకు సైనికుల్లా పని చేయాలని కోరారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో మనం అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి గ్రామస్థాయిలోని ప్రజలకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు వివరించాలన్నారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలతో ఎంపీ, పరిశీలకుడు ఎస్‌ఎంఆర్ పెదబాబులు అంతర్గతంగా సమావేశమయ్యారు. ఎమ్మెల్యే కొడాలి నాని ద్వారా పార్టీ స్థితిగతులను తెలుసుకున్నారు. గుడ్లవల్లేరు, నందివాడ, గుడివాడకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెడ్‌క్రాస్ సేవలు విస్తరించేందుకు కృషి

కలెక్టర్ రంజిత్‌బాషా



డైరీలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియాకు ఎంతో ప్రాధాన్యం ఉందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశపు హాల్లో విలేకర్లకు డైరీల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ శాసన, కార్యనిర్వాహక న్యాయవిభాగాలకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియాకూ అంతే ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర గణనీయమైనదని చెప్పారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు 55 శాతం పూర్తయ్యాయన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి రాబోయే సంవత్సరం అడ్మిషన్లు కల్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈవో జి.శ్రీనివాసరావు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రణాళిక

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతిని పరిశీలించడానికి ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సమీర్‌శర్మ జిల్లాలో పర్యటించనున్నారని చెప్పారు. నేపథ్యంలో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. రక్తహీనత ఉన్న 10–19 సంవత్సరాల వయసు గల బాలికల శాతం, 15–40 సంవత్సరాల వయసు కలిగిన మహిళల శాతం, ఐదు సంవత్సరాలలోపు తక్కువ బరువు ఉన్న పిల్లల శాతం, ప్రాథమిక విద్యలో 1 నుంచి 8వ తరగతి వరకు సర్దుబాటు చేసిన నికర నమోదు నిష్పత్తి, ఉన్నత విద్యలో 11 నుంచి 12వ తరగతి వరకు స్థూల నమోదు నిష్పత్తి, మౌలిక సదుపాయాల్లో ప్రాథమిక సదుపాయాలు కలిగి ఉన్న పాఠశాలల శాతం పరిశీలించాలన్నారు. వీటన్నింటిని సమన్వయం చేసుకోవాలని డీఎల్‌డీవో సుబ్బారావుకు సూచించారు. ఈ ఎనిమిది అంశాలను సమీర్‌శర్మ పరిశీలిస్తారని అనంతరం సచివాలయాలను సందర్శించారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, సీపీవో వై శ్రీలత, డీఈవో తాహెరాసుల్తానా, డీపీవో నాగేశ్వర్ నాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ కె.సరస్వతి, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.ఫణిదూర్జటి పాల్గొన్నారు.

గ్రామాల్లో సైతం రెడ్‌క్రాస్ సేవలు

కోనేరుసెంటర్: రెడ్‌క్రాస్ సేవలు గ్రామాల్లో సైతం మరింత విస్తరింపజేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బందరు మండలం చిన్నాపురం జెడ్పీ హైస్కూల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ దేశంలోనే అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో గవర్నర్ అధ్యక్షుడిగా రెడ్‌క్రాస్ సేవలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిస్థితులను సర్వే చేసేందుకు ఈ శిబిరం దోహదం చేస్తుందని తెలిపారు. శిబిరంలో డయాబెటిక్, గుండె, క్యాన్సర్, పంటి, కంటి, చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వీరేంద్రనాథ్, హనుమంతయ్య, పీఎల్ సాహితీ, రంగనాథ్, పవన్‌కుమార్ పెద్ద సంఖ్యలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరితో పాటు మణిపాల్ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొంది. ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, జిల్లా చైర్మన్ తోట బాలాజి, ఆర్డీవో ఐ.కిషోర్, జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ వి. శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, జిల్లా కోశాధికారి కొండపల్లి రాంబాలాజి, బెల్లంకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొరివి చైతన్య



కొరివి చైతన్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కొరివి చైతన్య నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ తూర్పు నియోజకవర్గానికి కొరివి చైతన్యను యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక ప్రకటనలో పేర్కొంది.

చెరువులో పడి బాలుడి మృతి



పెనమలూరు: ప్రమాదవశాత్తూ చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ ఆర్. గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... అజయ్‌నగర్ కాలనీలో షేక్ మీరాబీ కుటుంబం నివాసం ఉంటుంది. శుభకార్యం ఉండటంతో భీమవరంలో ఉంటున్న మీరాబీ సోదరి మస్తాన్‌బీ మంగళవారం కుటుంబసభ్యులతో పెనమలూరు వచ్చింది. ఈ క్రమంలో మస్తాన్‌బీ కుమారుడు కరిముల్లా (4) ఆడుకుంటూ సమీపంలోని చెరువులో పడి గల్లంతయ్యాడు. బాలుడి కోసం గాలించగా మృతదేహం దొరికింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



పార్వతీపురం: రైలు నుంచి జారిపడిన యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాంబాబు (25) కొందరితో కలిసి కొమరాడ మండలం చినఖేర్జల గ్రామంలో పొలాలకు కంచెవేసే పనులకు వచ్చాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బుధవారం ఉదయం రాయగడ నుంచి వస్తున్న బొకారో ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కాడు. రైలులో రద్దీ ఎక్కువగా ఉండడంతో రైలు బోగీ మెట్ల దగ్గర నిలబడి ప్రయాణిస్తుండగా మరిపివలస గ్రామం రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తు జారిపడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రవివర్మ కేసు నమోదుచేశారు.

బ్రదర్ జోసఫ్ తంబి నవదిన ప్రార్థనలు ప్రారంభం



ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడవాలని కేసరపల్లి విచారణకర్త ఫాదర్ పీకే జోసఫ్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సంఘ పెద్దలతో ప్రదక్షణ నిర్వహించి తంబి సమాధి వద్ద పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్య పూజాబలి నిర్వహించారు. ఈ నెల 13,14,15 తేదీల్లో జరగనున్న జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలకు ఆత్మీయంగా సిద్ధపడేందుకు నవదిన ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో విచారణకర్తలు మరియన్న, సహాయక గురువు శౌరిరెడ్డి, ఫాదర్లు ప్రవీణ్ గోప్, ఆరోగ్యరాజు, కిషోర్, మఠకన్యలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగ్గురమ్మల జాతర



దొనబండలో ముగ్గురమ్మల జాతరలో బుగ్గలకు ఇరువైపులా ఇనుప శూలాలు గుచ్చుకున్న భక్తులు



దొనబండలో ముగ్గురమ్మలకు మొక్కులు చెల్లించుకుంటున్న మహిళా భక్తులు

దొనబండ(ఇబ్రహీంపట్నం): మండలంలోని దొనబండ గ్రామంలో మారియమ్మ, కాళియమ్మ, సత్తెమ్మ (ముగ్గురమ్మల) ఆలయం జాతర బుధవారం కనుల పండువగా జరిగింది. 9 రోజులుగా ఉపవాసాలు ఉన్న భక్తులు తెల్లవారుజామున అమ్మవార్లకు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరింపజేసి ఊరేగింపుతో ఆలయంలో ప్రవేశ పెట్టారు. భక్తులు పాలు, పొంగళ్లు పొంగించి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వాహనాలకు ఆయుధ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపులో భక్తులు ఒళ్లు గగుర్పొడిచేలా విన్యాసాలు చేశారు. మొక్కుబడుల చెల్లింపులో భాగంగా వీపుకు ఇనుప శూలాలు తగిలించుకుని అమ్మవారి చిత్రపటం ఏర్పాటు చేసిన కారును లాగారు. కొంతమంది శరీరానికి నిమ్మకాయలు, నాలుక, బుగ్గలకు ఇరువైపులా ఇనుప శూలాలు ధరించి అమ్మవార్లపై తమ భక్తిని చాటుకున్నారు. తమిళనాడు నుంచి వలస వచ్చిన క్వారీ కార్మికులు ముగ్గురమ్మల ఆలయం నిర్మించుకుని సుమారు 40 ఏళ్లుగా జాతర నిర్వహించడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోంది.

సెల్‌ఫోన్ చార్జర్ వైర్‌తో చిన్నారులపై దాడి

ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వ్యక్తి ఆమె పిల్లలపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో చిన్నారులు సుధాకర్ (11), యేసు (5) గాయాలపాలయ్యారు. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదాల దైవకృప జ్యోతి (శ్రావణి) వెంకన్నకు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరు కృష్ణా జిల్లా కెంపల్లి కొత్తగూడెంలో ఉండేవారు. వీరిద్దరూ రెండేళ్ల క్రితం విడిపోయారు. శ్రావణి ప్రస్తుతం భారతినగర్‌లో నివాసముంటూ నగరంలోని ప్రముఖ హోటల్లో పని చేస్తుంది. అక్కడే పని చేస్తున్న రఘువర్మతో పరిచయం ఏర్పడటంతో ఆరు మాసాలుగా వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం నడుస్తుంది. సరిగా చదవడం లేదనే సాకుతో రఘువర్మ సుధాకర్, యేసును సెల్‌ఫోన్ చార్జర్ వైర్‌తో కొట్టడంతో పిల్లల వీపులపై వాతలు వచ్చాయి. దీంతో శ్రావణి పటమట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పిల్లలను చైల్డ్‌లైన్‌కు తరలించారు. రఘువర్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణి ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: తొమ్మిది నెలల గర్భిణి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన ఆమె భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజదేవి బుధవారం తీర్పు చెప్పారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన లారీ డ్రైవర్ ఎండీ నయీమ్‌కు తోట్లవల్లూరుకు చెందిన సబినాకు 2014లో వివాహం జరిగింది. కొన్ని నెలల తరువాత గర్భం దాల్చిన సబినా తన పుట్టింటికి వెళ్లింది. తొమ్మిది నెలల గర్భంతో ఉన్న సబినాతో నయీమ్ అసభ్యంగా ప్రవర్తించి రెండో పెళ్లి చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన సబినా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 2015 జూన్ 27వ తేదీన జరిగిన ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. బాధితుల తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణు కోర్టుకు వాదనలు వినిపించారు. 13 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నయీమ్‌కు జైలు శిక్షతో పాటు రూ. 3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

7న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్, క్విజ్ పోటీలను, 10వ తేదీన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవో యు.శ్రీనివాసరావు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయసున్న యువకులు ఈ పోటీలకు అర్హులన్నారు. జీవిత నిర్మాణంలో యువత పాత్రపై స్వామి వివేకానంద సందేశం, సమాజ నిర్మాణంలో యువత పాత్ర అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు.

A.P.STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED, VIJAYAWADA

D.No.1013/A, Civil Supplies Bhavan, Mikkilineni Sudheer Babu Road, Governorpet, Vijayawada-2. Office Cell No.7702003571
email: dcsmntr@gmail.com.

NOTIFICATION FOR RECRUITMENT

No.P.Admn/Paddy/Recr/1/2022 Dt.04.01.2023.

The AP State Civil Supplies Corporation Ltd., NTR district will be requiring the services 01 (one) Accountant Gr-III on contract basis for a period of one year for Finalization of Paddy and Regular Accounts of the Corporation for the KMS 2022-23. The selection will be made through District Selection Committee headed by the Joint Collector & E.O.E.D., APSCSCL, NTR.

Applications are invited from interested and eligible local candidates for the posts. The following are the minimum qualifications prescribed and other terms and conditions for selection of candidates.

Accountant Gr-III (Contract basis)
CA/CMA Semi Qualified i.e., Inter Passed and computer skills.
Appointment on contract basis for a period of One year
Two (2) years experience in relevant field.
Monthly consolidated remuneration of Rs.30,000/-
Maximum age Limit : (a) General: 35 years (b) Reserved: 40 years
75 Marks/Points : Merit of basic Academic Qualification 5 Points : Experience in Government Departments/Semi Government with reasonable evidence (1 point per each year) 20 Points : Additional qualifications: (a) Other Professional Qualifications with Inter passed (CA/CMA/CS)- (5 Points) (b) Graduation/Post Graduation in Commerce - (15 Points) (Certificate courses in Computer and Diploma etc., are not added additional qualifications)
Non-local candidates will be selected when local candidates are not available

No interviews will be held for selection of candidates in Accountant Gr-III on contract basis and recruitment will be strictly on the basis of merit duly following roaster points.

The legibly filled in applications should be submitted to the District Civil Supplies Manager, AP State Civil Supplies Corporation Ltd., Civil Supplies Bhavan, D.No.1013/A, Uda Office Road, Governorpet, Vijayawada-520002 along with the copies of relevant certificates should be submitted by 12.01.2023 up to 5.00 P.M. and verification of Original Certificates will be on 17th and 18th January'2023.

Sd/-JOINT COLLECTOR & E.O.E.D.,
APSCSCL :: NTR District



క్లుప్తంగా

బధిర ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా బధిర, విభిన్నప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ఆవిష్కరించారు. గాంధీనగర్ ఎన్జీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బధిర, విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులు మొక్కవోని ధైర్యంతో విధులను నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. బధిర ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బధిర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వై.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.పాండురంగారావు, సహా అధ్యక్షులు బి.లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యక్షుడు డి.శివకుమార్, సెక్రటరీ టి.టి.దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ షేక్ ముస్తఫా, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, మహిళా కార్యవర్గ సభ్యులు ఏ.నాగ దీప్తి, పి.కృష్ణకుమారి, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు సీహెచ్ శ్రీరామ్, కార్యదర్శి కె.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు డైరీ, క్యాలెండర్ అందజేత



మంత్రి బొత్సకు డైరీ, క్యాలెండర్ అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్లు జమలపూర్ణమ్మ, మధుబాల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్లు జమల పూర్ణమ్మ, మధుబాల మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి బొత్సకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయ సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని అందజేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకత ఎంతో ఉందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని ఫార్మసీ కళాశాలలో ఈ నెల 3, 4 తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. ఓటు నమోదు విధానాన్ని విద్యార్థులకు వివరించారు. విధిగా ఓటును వినియోగించుకోవడం ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తులు మంచి ప్రభుత్వాల ద్వారానే సాధ్యమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఓటువేయడం ద్వారా ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 90 మంది విద్యార్థులు ఓటును నమోదు చేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో జనవరి 7వ తేదీ నుంచి వివిధ అంశాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ కేర్ అసిస్టెంట్, జ్యూట్ క్రాఫ్ట్ ప్రాడక్ట్స్ మేకర్, అసిస్టెంట్ ప్లంబింగ్ శానిటరీ వర్క్, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, కట్టింగ్ అండ్ టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ రిపేర్, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ అంశాల్లో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866-2470420 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

గురుకుల కళాశాలలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో బుధవారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాలలో నూతన వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి బ్రెయిలీ అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో వెల్లివిరిసిన ఆనందం

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- ఉత్సాహంగా పింఛన్ వారోత్సవాలు



మాచవరంలో కొత్త పింఛన్‌దారులకు చెక్కు అందజేస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, కార్పొరేటర్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పింఛన్ నగదును పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో అవ్వ తాతల ముఖంలో ఆనందం నెలకొందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. స్థానిక మాచవరం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో బుధవారం పింఛన్ వారోత్సవాలను నిర్వహించారు. 2, 6 డివిజన్లలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక చెక్కులను దేవినేని అవినాష్ అందజేశారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇప్పుడు కొత్తగా ఈ రెండు డివిజన్లలో 101 మందికి పింఛన్లను మంజూరు చేశామని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 39 లక్షల మందికి పింఛను ఇస్తే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 66.50 లక్షల మందికి ప్రతి నెలా పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా చెప్పినట్లుగా పింఛన్‌ను సీఎం వైఎస్ జగన్ పెంచుతున్నారన్నారు. ఈ నెల నుంచి పింఛన్‌దారులకు నెలకు రూ.2750లను అందిస్తున్నామని చెప్పారు. పింఛన్లపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. అర్హులైన ఎవరికీ పింఛన్లు తొలగించలేదని అవినాష్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలాకుమారి, వియ్యపు అమర్‌నాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, పార్టీ నాయకులు లంకా అబ్బినాయుడు, ప్రభు, రామదొరయ్య తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె బుధవారం తన ఛాంబర్‌లో కార్యాలయ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఫ్ఆర్ఎస్ అమలు, కార్యాలయం పరిపాలన పరమైన వ్యవహారాలు, బాధ్యతలు, సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణ వంటి అంశాలపై సమీక్షించి తగు ఆదేశాలిచ్చారు. అదే విధంగా ఫైల్స్ క్లియరెన్స్, పని నాణ్యత వంటి అంశాలపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో గణాంక అధికారి ఎస్.లక్ష్మీజీ, సూపరింటెండెంట్ వి.శ్రీనివాసరావు, డెప్యూటీ గణాంక అధికారి బి.గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌లు సీతాకళ్యాణి, ప్రసూనాంబ, కె.వాసు, ఆనందరావు, 104 జిల్లా సమన్వయ అధికారి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో విజేతకు అభినందన



రజత పతకం పొందిన ప్రవీణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాంబశివరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గత నెల 24, 25 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లోని ఖాన్‌దుబాయ్ సేనైహాల్‌లో జరిగిన 37వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి రజత పతకం సాధించాడని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మండవ సాంబశివరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ సీఈసీ చదువుతున్న టి.ప్రవీణ్ అండర్-18 బాలుర విభాగంలో 70 కేజీల వెయిట్ సామర్థ్యంలో సెల్ఫ్ డిఫెన్స్ విభాగంలో రజత పతకం సాధించాడన్నారు. ప్రవీణ్‌ను కళాశాల వ్యాయామ అధ్యాపకుడు కె.మార్కండేయులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

చారిత్రక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చారిత్రక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి వాటి చారిత్రక విశేషాలను తెలుసుకోవాలని ఆంధ్రా లయోలా కళాశాల అధ్యాపకుడు మొవ్వ శ్రీనివాసరెడ్డి చెప్పారు. వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ స్కూల్‌లో బుధవారం సీబీఎస్ఈ వారి సూచనల మేరకు స్కూల్‌లోని విద్యార్థులతో యువ టూరిజం క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. టూరిజం శాఖ నోడల్ అధికారి రత్న సేనాపతి, అసిస్టెంట్ మేనేజర్ చేతన్ జదార్ మాట్లాడుతూ.. చారిత్రక కట్టడాలు, కళా ఖండాల పూర్వ వైభవాన్ని, చరిత్ర గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ క్లబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సభ అనంతరం విద్యార్థులను బందరురోడ్డులో బాపు మ్యూజియం సందర్శనకు తీసుకువెళ్లారు. ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న పోలీసులు



శ్రావణికి నగదు అందచేస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు సహాయం అందిస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులు మరోమారు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రావణి తండ్రిని కోల్పోయింది. తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో శ్రావణికి బీఫార్మసీలో సీటు వచ్చిన నేపథ్యంలో మొదటి సంవత్సరం కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో పోలీసు సిబ్బంది నిర్వహించే దీవెన ఫౌండేషన్ గురించి తెలుసుకున్న ఆమె వారిని సంప్రదించింది. వెంటనే స్పందించిన వారు బుధవారం ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును ఆయన చాంబర్‌లో కలుసుకుని ఆయన చేతుల మీదుగా శ్రావణికి 15 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ బ్రహ్మం, శరత్ కుమార్, గోపిచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంలో దీవెన ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

సోదరుడి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తన సోదరుడు అదృశ్యంపై మద్దాల వెంకట సుబ్బారావు అనే వ్యక్తి బుధవారం నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఫిర్యాది తమ్ముడు మద్దాల శ్రీనివాసరావు(35) అవివాహితుడు, పాతరాజీవ్‌నగర్ వద్ద చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. శ్రీనివాసరావుకు, స్థానికులకు మధ్య గత నెల 30న గొడవ జరిగిందన్నారు. ఆ రోజు నుంచి తన తమ్ముడు కనిపించడంలేదని సుబ్బారావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

నేటితో పింఛన్ల పంపిణీ పూర్తి



మానసిక దివ్యాంగురాలు కనకదుర్గకు పింఛన్ అందజేస్తున్న సుబ్బారావు

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని 15,16 డివిజన్లలో నాలుగు రోజుల నుంచి 94.91 శాతం వృద్ధులకు పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్టు సంక్షేమ కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. ఈ రెండు డివిజన్లలో మొత్తం పింఛన్ దారులు 2,618 ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో కొత్త పింఛన్లు 90 ఉన్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి 15,16 డివిజన్లలో పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశామన్నారు. గతం కంటే త్వరితగతిన పంపిణీ చేశామని తెలిపారు. దివ్యాంగులకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి, వారి దగ్గరకు వెళ్లి పెంచిన పింఛన్ ఇచ్చినట్టు చెప్పారు. శనివారంతో పంపిణీ కార్యక్రమం పూర్తి అవుతుందని పేర్కొన్నారు.

నేడు జైనుల మౌన ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలోని వివిధ ప్రాంతాల్లో జైనుల పుణ్యక్షేత్రాల రక్షణ కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మౌన ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు విజయవాడ జైన్ సంఘ్ కన్వీనర్ పన్నాలాల్‌జైన్ చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆ సంఘ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జైనులు మైనార్టీలుగా ఉన్నారన్నారు. తక్కువ సంఖ్యలో ఉన్న తమకు, తమ పుణ్యక్షేత్రాలను కాపాడేందుకు, రక్షణ కల్పించేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మౌన ప్రదర్శనలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జైనుల అత్యంత పవిత్రమైన తీర్థ క్షేత్రమైన గుజరాత్‌లోని శ్రీ శత్రుంజయ తీర్థంపై ఇటీవల కొంతమంది దుండగులు దాడి చేసి అక్కడ భగవంతుని పాదాలను ధ్వంసం చేశారన్నారు. అలాగే జార్ఖండ్‌లోని శిఖర్జీ తీర్థ ప్రదేశానికి పర్యాటక కేంద్రంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జైనులు పూర్తి శాఖాహారాన్ని పాటించటమే కాకుండా అనేక కఠిన నియమాలను ఆచరిస్తూ జీవితాలను కొనసాగిస్తారన్నారు. అటువంటి జైన పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించటం వలన జైనుల సిద్ధాంతాలకు విరుద్ధంగా అక్కడి కార్యకలాపాలు జరిగే ప్రమాదముందన్నారు. దీనిని యావత్ జైన సమాజం వ్యతిరేకిస్తుందన్నారు. తక్షణం జార్ఖండ్ ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చే నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. వీటిపై దేశ వ్యాప్తంగా జైనులు నిరసనలు తెలియజేసి ప్రభుత్వానికి తమ విన్నపాలను వివరించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా విజయవాడలో మౌనప్రదర్శనగా వెళ్లి కలెక్టర్‌ను, గవర్నర్‌ను కలిసి వినతిపత్రాలను అందిస్తామని చెప్పారు. సమావేశంలో జైన సమాజ్ నాయకులు మనోజ్ కొఠారి, అశోక్‌జైన్, భోగిలాల్‌జైన్, సందీప్‌కాన్కరియా, సంజయ్‌జైన్, రాజు జైన్, మహేంద్రజైన్, ప్రవీణ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్టీఎస్ రోడ్డుకు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డుకు మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రహదారిపై గోతులు పడడంతో మరమ్మతు పనులు నిర్వహించారు. భానునగర్ జంక్షన్ నుంచి పడవల రేవు సెంటర్ వరకు బుధవారం పనులు జరిగాయి. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

సాక్షి, అమరావతి: 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, అదే సందర్భంలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కూడా విజయఢంకా మోగిస్తామని ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వం చేయని రీతిలో విజయవాడ తూర్పు నియోజకవర్గాన్ని సీఎం జగన్ అభివృద్ధి చేశారని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులలతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి, విజయం సాధించడానికి విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గ నేతలకు, కార్యకర్తలకు సీఎం జగన్ అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారని చెప్పారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, తక్షణమే పరిష్కరించేందుకు సీఎం హామీ ఇచ్చారన్నారు. కృష్ణానది వెంట రిటైనింగ్ వాల్ నిర్మించారు, సీఎం ఇచ్చిన భరోసా, అండకు ఏమిచ్చినా ఆయన రుణం తీర్చుకోలేమన్నారు. విజయవాడ తూర్పు ప్రాంతంలో ప్రతి ఇంట్లో సీఎం జగన్ పట్ల సంతోషం కనిపిస్తోందని, ఇదే వచ్చే ఎన్నికల్లో విజయానికి సూచిక' అని తెలిపారు.

లక్ష్య సాధనలో యువత శ్రద్ధ చూపాలి



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో చూపిన శ్రద్ధ ఆ లక్ష్యాలను సాధించడంలో కూడా చూపాలని సీతానగరంలోని రామకృష్ణ మఠం సహాయ కార్యదర్శి స్వామి సేవ్యానంద మహారాజ్ చెప్పారు. వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సదస్సు జరిగింది. సేవ్యానంద మహారాజ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో ఎవరైనా తప్పులు చేస్తారని, చేసిన తప్పులను తెలుసుకుని వాటిని సరిదిద్దుకుంటూ యువత ముందుకు సాగాలని చెప్పారు. చేసిన తప్పులను సరిదిద్దుకోకపోతే అవి మరింత పెద్ద ఆపదను తెచ్చిపెడతాయన్నారు. జీవితంలో సమస్యలు, సవాళ్లు ఎన్ని ఎదురైనా ఎదురు నిలిచి ధైర్యంగా పోరాడితేనే విజయం దక్కుతొందని వివేకానంద చెప్పిన మాటలను యువత ఎల్లప్పుడు గుర్తించుకోవాలని చెప్పారు. మనలను బలహీనులుగా చేసే ఆలోచనలను విడిచిపెట్టినప్పుడే విజయాలను సొంతం చేసుకోగలమని సేవ్యానంద మహారాజ్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యూబెక్టమీ అనంతరం.. మళ్లీ పిల్లలు



మాట్లాడుతున్న సంధ్యారాణి, పక్కన డాక్టర్ వల్లి కొడాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లలు పుట్టకుండా పదేళ్ల కిందట ట్యూబెక్టమీ చేయించుకున్న ఇద్దరు మహిళలకు, ఇప్పుడు మళ్లీ ఐవీఎఫ్ ద్వారా వారికి పిల్లలు జన్మించారని విగ్నేష్ ఫెర్టిలిటీ వైద్యురాలు వల్లి కొడాలి తెలిపారు. శిఖామణిసెంటర్‌లో తమ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గణపవరానికి చెందిన ఎం.సంధ్యారాణి-కనకరాజు, కబేళాకు చెందిన ఎం.సరిత-దుర్గాప్రసాద్‌ల దంపతులకు పదిహేనేళ్ల కిందట వివాహం కాగా, వారికి గతంలో పిల్లలు పుట్టారన్నారు. దురదృష్టవశాత్తు వారి పిల్లలు గతేడాది మరణించారని చెప్పారు. వారిద్దను తమను ఆశ్రయించడంతో ఐవీఎఫ్ పక్రియ ద్వారా చికిత్స అందించడంతో పిల్లలు జన్మించారన్నారు. సంధ్యారాణి, సరిత మాట్లాడుతూ.. పిల్లలను కోల్పోయి బాధలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న తమకు డాక్టర్ వల్లి వైద్య సలహాలు, మా పట్ల చూపిన వ్యక్తిగత శ్రద్ధ కారణంగా మళ్లీ పిల్లలు జన్మించడంతో చాలా ఆనందంగా ఉన్నామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాణిగారితోటలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న అవినాష్, కార్పొరేటర్ రామిరెడ్డి, నాయకులు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాణిగారితోట, 17వ డివిజన్, 79వ వార్డు సచివాలయం పరిధిలోని తిరుపతమ్మ రోడ్డు, సుధాకర్ రెడ్డి హాస్పిటల్ రోడ్డు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి అవినాష్ ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

అసత్య ప్రచారాలు సిగ్గుచేటు..

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ సంక్షేమ పథకాల ద్వారా సుస్థిర ప్రగతి సాధించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి పథకాన్ని నేరుగా పేదల ఇంటి ముంగిటకే అందించేలా సీఎం జగనన్న చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజల్లో జగనన్నకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు తన సభలకు భారీగా ప్రజలను తరలిస్తున్నారని, ప్రచారం చేసుకోవడానికి ఇరుకు సందుల్లో మీటింగ్‌లు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఇటీవల కందుకూరు, గుంటూరుల్లో డ్రోన్ షూట్‌లు, ఫొటోల కోసం ప్రచార యావతో చేసిన తప్పిదాల వలన 11 మంది అభాగ్యులు ప్రాణాలు కోల్పోయారని, దానికి బాధ్యత ఎవరని ప్రశ్నించారు. తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం మీద బురద జల్లుతూ అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ కార్యకర్తలు చంద్రబాబు మీటింగ్‌లో తొక్కిసలాటలో చనిపోతే సీఎం జగనన్న మానవతా దృక్పథంతో స్పందించి మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయటం ఆయన మంచితనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ప్రజల భద్రత కోసమే తప్పా రాజకీయ పార్టీల అవసరాలకు కాదని గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇస్త్రీ బండి వితరణ

జీవనోపాధి నిమిత్తం నిరుపేదకు దేవినేని అవినాష్ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం ఇస్త్రీ బండిని వితరణ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 17వ డివిజన్‌కు చెందిన ఆర్.సింహాచలం తాను ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని, తనకు సహాయం చేయాలని అవినాష్‌ను కోరారు. వెంటనే అవినాష్ స్పందించి ట్రస్ట్ ద్వారా ఇస్త్రీ బండిని ఉచితంగా అందజేశారు.

సీఐడీ కేసులు వాదించేందుకు స్పెషల్ పీపీల నియామకం

• ప్రభుత్వం ఉత్తర్వులు

గుంటూరులీగల్: జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, సెషన్స్ కోర్టుల్లో క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)తరఫున కేసులు వాదించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది స్పెషల్ పీపీలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ నిమిత్తం సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వినతి మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవోను సవరిస్తూ.. కొందరి పేర్లు మారుస్తూ.. ఈ ఉత్తర్వులిచ్చింది. స్పెషల్ పీపీలుగా నియమితులైన వారి వివరాలు.. విజయనగరం జిల్లాకు నండూరి వెంకట సత్యలింగేశ్వర్, విశాఖకు ఎ.శేషుబాబు, కాకినాడకు పిల్లి శ్రీనివాస్, ఏలూరుకు ఎం.రాజేంద్ర, మచిలీపట్నానికి కె.మెహర్‌ప్రసాద్, విజయవాడకు బెల్లపు సత్యనారాయణ, గుంటూరుకు గొట్టం శివప్రసాదరెడ్డి, ఒంగోలుకు కొల్లా నాగేశ్వరరావు, నెల్లూరుకు నన్నం కనకదారి చెన్నయ్య, చిత్తూరుకు పి.విజయకృష్ణారెడ్డి, అనంతపూర్‌కు పి.రాజశేఖర్, కర్నూలుకు వి.నాగలక్ష్మి, కడపకు జి.వెంకటేశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్‌గుప్తా జీవో ఇచ్చారు. వీరు ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు.

దసపల్లా భూములపై కోర్టు తీర్పును అమలు చేయాల్సిందే

• విశాఖ కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలోని వాల్తేరు వార్డు పరిధిలో పలు సర్వే నంబర్లలో గల దసపల్లా భూములు రాణి కమలాదేవికి చెందినవేనంటూ హైకోర్టు ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాలను, ఆ ఆదేశాలను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని విశాఖ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు తేల్చి చెప్పింది. 12 ఏళ్ల క్రితం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమే అవుతుందని స్పష్టం చేసింది. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలను అమలు చేయాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్ 27న జారీ చేసిన మెమోను గరిష్ఠంగా 15 రోజుల్లో అమలు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. అలా చేయనిపక్షంలో స్వయంగా కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలంది. తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత ఈ నెల 2న ఉత్తర్వులు జారీ చేశారు. వాల్తేరు వార్డులోని సర్వే నంబర్లు 1027, 1028, 1029, 1136, 1197లోని భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ, వాటిని నిషేధిత భూముల జాబితాలో చేర్చాలంటూ 2015లో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆ భూముల యజమాని రాణి కమలాదేవి 2016లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం స్టే

వైద్య పరికరాల సరఫరాకు బిల్లు చెల్లించాలని అధికారులకు సింగిల్ జడ్జి ఆదేశం

• బిల్లు చెల్లించినా, ఆ చెల్లింపునూ తప్పు పట్టిన సింగిల్ జడ్జి
• అధికారుల వ్యక్తిగత హాజరుకు ఆదేశం
• ధర్మాసనం ఎదుట అధికారుల అప్పీల్
• సింగిల్ జడ్జి ఉత్తర్వులను చదివిన ధర్మాసనం
• వెంటనే ఆ ఉత్తర్వుల నిలిపివేత
• విచారణ ఫిబ్రవరి 1కి వాయిదా



సాక్షి, అమరావతి: వైద్య పరికరాలు, ఫర్నీచర్ సరఫరా చేసిన సంస్థకు ఏపీ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) బిల్లులు చెల్లించినప్పటికీ, ఆ చెల్లింపులపై సందేహం వ్యక్తం చేస్తూ సంస్థ వైస్ చైర్మన్, నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) డైరెక్టర్ కోర్టు ముందు హాజరు కావాలంటూ సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఇచ్చిన ఉత్తర్వులపై ధర్మాసనం స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు స్టే కొనసాగుతుందని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రంలో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలకు వైద్య పరికరాలు, ఫర్నీచర్ సరఫరా చేసిన ఆర్మీ సర్జికల్ వర్క్స్ తమకు రూ.3.05 కోట్లను చెల్లించడంలేదంటూ దాఖలు చేసిన వ్యాజ్యంపై సింగిల్ జడ్జి జస్టిస్ దేవానంద్ విచారణ జరిపారు. ఆర్మీ సర్జికల్ వర్క్స్ బిల్లు చెల్లించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్ చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. విచారణను డిసెంబర్ 22కి వాయిదా వేశారు. ఆరోజు విచారణకు రాగా, డిసెంబరు 21నే బిల్లు చెల్లించినట్లు ఏపీఎంఎస్ఐడీసీ న్యాయవాది వెంకటరెడ్డి చెప్పారు. బిల్లులు చెల్లించాలని తాను ఆదేశాలు ఇవ్వకపోయినా ఆర్మీ సర్జికల్ కంపెనీకి బిల్లు చెల్లించడంపై సందేహం ఉందని న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ అన్నారు. పెండింగ్ బిల్లులన్నింటి వివరాలతో ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ వ్యాజ్యం డిసెంబర్ 29న మరోసారి విచారణకు రాగా.. ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్ అఫిడవిట్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ ఆర్మీ సర్జికల్ వర్క్స్ బిల్లు రూ.3.05 కోట్లు విడుదల చేశారని, దానిని పిటిషనర్‌కు చెల్లించామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ స్పందిస్తూ, దాదాపు రూ.300 కోట్ల మేర బిల్లులు ఆ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారని, ఎంతెంత బిల్లులు చెల్లించాలో వివరాలను ఇవ్వడంలో విఫలమయ్యారని ఆక్షేపించారు. జనవరి 5న స్వయంగా కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్‌లను న్యాయమూర్తి ఆదేశించారు.

బిల్లులు చెల్లించడమూ తప్పేనట

ఈ ఆదేశాలను సవాలు చేస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను చదివి వినిపించారు. పిటిషనర్ కంపెనీకి బిల్లులు చెల్లించకపోవడాన్ని సింగిల్ జడ్జి తప్పుపట్టారని, దీంతో వారికి బిల్లులు చెల్లించేశామని ఏఏజీ చెప్పారు. దీనినీ సింగిల్ జడ్జి తప్పుపట్టారన్నారు. ఆదేశాలు ఇవ్వకపోయినా ఎలా చెల్లిస్తారంటూ అధికారులపై మండిపడ్డారని, వారి వ్యక్తిగత హాజరుకు, మొత్తం బిల్లులు వివరాలు సమర్పించాలని ఆదేశాలిచ్చారన్నారు. ధర్మాసనం సైతం సింగిల్ జడ్జి ఉత్తర్వులను చదివింది. వెంటనే సింగిల్ జడ్జి జస్టిస్ దేవానంద్ ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేసింది.

అనాధీనం, ఖాళీ కాలమ్ భూముల సమస్యకు పరిష్కారం

• చుక్కల భూముల చట్టం పరిధిలోకి ఈ రెండు రకాల భూములు



సాక్షి, అమరావతి: అనాధీనం, ఖాళీగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో (ఆర్ఎస్ఆర్) నమోదైన వేలాది ఎకరాల భూముల సమస్యను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రెండు రకాల భూములను చుక్కల భూముల చట్టం పరిధిలోకి తీసుకువచ్చింది. ఇందుకోసం 2017 చుక్కల భూముల చట్టాన్ని సవరించింది. ఈ మేరకు 2022 ఏపీ చుక్కల భూముల (సవరణ) ఆర్డినెన్స్‌ను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ జారీ చేశారు. దీంతో ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాలకు సంబంధించి దాదాపు 40 వేల మంది రైతులు దీనివల్ల లబ్ధి పొందుతారు. అనాధీనం భూములు అనకాపల్లి, శ్రీకాకుళం, అంబేడ్కర్ కోనసీమ, విశాఖ జిల్లాల్లో ఎక్కువగా ఉండగా, ఖాళీ (కాలమ్) భూములు రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారు, రిమార్కుల కాలమ్‌లలో చుక్కలు ఉన్నట్లుగానే అనాధీనం, ఖాళీ (చుక్కల బదులు ఖాళీగా వదిలేసిన) భూములు రాష్ట్రవ్యాప్తంగా చాలా ఉన్నాయి. ఈ కేటగిరీ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఇప్పటివరకు ఎలాంటి అవకాశాలూ లేవు. ఈ తరహా భూములు ఎక్కువగా ఉన్నట్లు పలు జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదించారు. ఆ భూముల రైతులు చుక్కల భూముల చట్టం ప్రకారం వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని దరఖాస్తులు పెడుతున్నట్లు తెలిపారు. కానీ, చుక్కల భూముల చట్టంలో అనాధీనం, ఖాళీ భూముల ప్రస్తావన లేకపోవడంతో ఆ దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం లేకుండాపోయింది. దీంతో ఈ భూముల సమస్య పరిష్కారానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్లు ప్రభుత్వాన్ని కోరారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం దానిపై దృష్టి సారించి చుక్కల భూముల చట్టం ద్వారా వాటికి పరిష్కారం చూపింది. అనాధీనం, ఖాళీ కాలమ్ భూములను చుక్కల భూముల చట్టంలో చేర్చింది. కొత్తగా ఈ చట్టంలో చుక్కల భూములతోపాటు అనాధీనం, ఖాళీ భూములు (బ్లాంక్ ల్యాండ్స్) అని రెండు కాలమ్స్‌ను అదనంగా కలిపారు. ఇకపై ఈ భూములను చుక్కల భూముల మాదిరిగానే కచ్చితమైన రికార్డులు ఉంటే నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రైవేటు భూములుగా నిర్ధారించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించవచ్చు.

అలాగే 2017 చుక్కల భూముల చట్టాన్ని కేవలం రాయలసీమ ప్రాంతంలోని భూములకే పరిమితమయ్యేలా కాలమ్ 16, 17 అని పేర్కొన్నారు. ఆ కాలమ్‌లు రాయలసీమ జిల్లాల్లో మాత్రమే ఉండేవి. కోస్తా జిల్లాల్లోని ఆర్ఎస్ఆర్‌లో 11, 12 కాలమ్ వరకే ఉండటంతో ఈ చట్టం అక్కడి జిల్లాలకు వర్తించడంలేదు. తాజా సవరణ చట్టంలో ఏ కాలమ్‌లో చుక్కలు ఉన్నా, అనాధీనం, బ్లాంక్ ఉన్నా దానికి ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొన్నారు.

పట్టణ సర్వేకి లెక్కలు సిద్ధం

• సర్వర్‌లో 50 లక్షల ఆస్తుల వివరాలు నమోదు
• 123 యూఎల్‌బీల్లో 15 లక్షల ఎకరాల గుర్తింపు
• 10 లక్షల ఎకరాల్లో నివాసాలు, ప్లాట్లు
• 5 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూమి
• సంక్రాంతి తర్వాత ఇంటింటి డేటా పరిశీలన



సాక్షి, అమరావతి: పట్టణ ఆస్తుల సమగ్ర భూహక్కు సర్వేలో కీలకమైన పనులు కొలిక్కి వచ్చాయి. మొత్తం 123 పట్టణ స్థానికసంస్థల (అర్బన్ లోకల్ బాడీస్-యూఎల్‌బీల)పరిధిలో ఉన్న ఆస్తుల వివరాలను మున్సిపల్ సిబ్బంది సర్వర్‌లో భద్రపరిచారు. యూఎల్‌బీల్లోని అసెస్‌మెంట్ల వారీగా వివరాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఉన్న రికార్డుల ప్రకారం ఆస్తులు, వాటి యజమానుల గుర్తింపు ప్రక్రియ కూడా ఇకపై తేలికకానుంది. మొత్తం 123 యూఎల్‌బీల్లో 15 లక్షల ఎకరాల్లో 50 లక్షల ఆస్తులు ఉన్నట్టు తేల్చారు. దీన్లో 10 లక్షల ఎకరాల్లో నివాసాలు, ప్లాట్లు ఉండగా ఐదులక్షల ఎకరాలు వ్యవసాయ భూమిగా ఉంది. రికార్డుల ప్రకారం ఆయా యజమానులకు వార్డు సచివాలయ సిబ్బంది ఆస్తుల యజమానులను వ్యక్తిగతంగా కలిసి మరోసారి వివరాలను సరిచూస్తారు. సర్వర్‌లో నమోదైన వివరాలను, డ్రోన్లతో నమోదు చేసిన ఆస్తుల పటాలను సరిపోలుస్తారు. ఈ రెండింటి వివరాలతో ఆస్తుల యజమానుల సమక్షంలోనే సరిహద్దులను గుర్తించి హక్కుదారు సమగ్రమైన వివరాలను పరిశీలించనున్నారు. ఏమైనా సవరణలు ఉంటే అక్కడే చేస్తారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం' కింద యజమానికి హక్కు పత్రం ఇచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కోసం పిలిచిన టెండర్లు కొలిక్కి వచ్చాయి. ఈ నెలలో అవి అందుబాటులోకి రానున్నాయి.

15 యూఎల్‌బీల్లో మ్యాపింగ్ పూర్తి

తొలుత డ్రోన్లతో మున్సిపాలిటీల పరిధి మ్యాప్‌లను సిద్ధం చేసిన మున్సిపల్ శాఖ.. నవంబర్ నుంచి ఆస్తుల మ్యాపింగ్ చేపట్టింది. రెండునెలల్లో 15 యూఎల్‌బీల్లో ఆస్తుల వివరాలు, సరిహద్దులను నమోదు చేశారు. డ్రోన్ల మ్యాపింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. డ్రోన్ల సంఖ్యను పెంచి పనులను వేగవంతం చేయాలని సీడీఎంఏ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఫిబ్రవరి నుంచి మంచు తగ్గుదల మొదలవుతుందని, ఏప్రిల్ చివరినాటికి 123 యూఎల్‌బీల్లో ఆస్తుల మ్యాపింగ్ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. పట్టణాల్లో భూ ఆక్రమణలు, ఒకే స్థలం లేదా ఇల్లు రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయడం వంటి సమస్యలు లేకుండా ఆయా ఆస్తిదారులకు నమ్మకమైన గుర్తింపుపత్రం ఇచ్చేందుకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ఆస్తుల సర్వేకి సిద్ధమైంది. ఈ ప్రక్రియ పూర్తయితే.. వ్యవసాయ భూములకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నట్టుగానే పట్టణాల్లోని స్థలాలు, ఇళ్లకు కూడా గుర్తింపు కార్డులతోపాటు ఆస్తులకు సమగ్రమైన రికార్డులు సిద్ధమవుతాయి. ఈ ప్రక్రియలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సర్వే అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాత పట్టణాల రికార్డులతోపాటు పట్టణాల్లో విలీనమైన 648 గ్రామాల రికార్డులు, ప్రస్తుతమున్న రికార్డులతో సరిపోల్చి ఏ ఆస్తి ఎవరి పేరిట నమోదైందో పూర్తి సమాచారాన్ని సర్వర్‌లో నమోదు చేశారు. సర్వేతోపాటు రెవెన్యూ రికార్డులు, ప్లానింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా వార్డు సచివాలయ సిబ్బంది ఆస్తుల యజమానులను స్వయంగా కలిసి మరోసారి రికార్డులను సరిచూస్తారు.

యజమానుల సమక్షంలోనే పరిశీలన

పట్టణాల్లో ఈ సర్వే పనులు చేసేందుకు మొత్తం 25 వేలమంది సిబ్బంది వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. వీరికి అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు వీడియో కాన్ఫరెన్స్‌ల్లో ఉన్నతాధికారులు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి వార్డులోను ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీతోపాటు ఐదుగురు సర్వే సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీరు తమ పరిధిలోని సుమారు వెయ్యి నివాసాలు, మరో 200 ఇతర ఆస్తుల వివరాలను సర్వర్‌లో ఉన్న ఆస్తుల వివరాలతో సరిపోలుస్తారు. ఈ ప్రక్రియను సంక్రాంతి వెళ్లిన తర్వాత చేపట్టాలని నిర్ణయించారు. అంటే ఒకపక్క డ్రోన్లతో ఆస్తుల సరిహద్దులను గుర్తిస్తూనే మరోపక్క ఈ ప్రక్రియ పూర్తయిన యూఎల్‌బీల్లో సిబ్బంది ఆస్తుల యజమానులను వ్యక్తిగతంగా కలిసి వివరాలు సేకరిస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉండి, సరిహద్దు సమస్యలు లేని ఆస్తులకు వాటి యజమానుల అంగీకారంతో హక్కుపత్రాలు జారీచేస్తారు.

స్థానిక వార్తలు

ఎడ్ల పందేలు... కేరాఫ్ తెనాలి

• రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు
• భారతదేశంలో తొలి ప్రదర్శన జరిగింది ఇక్కడే!
• యడ్లపల్లి ఎడ్లజతదే ఇప్పటికీ రికార్డు
• బ్రెజిల్ దేశస్తులు కొనుగోలు చేసిన ఎడ్లజత
• నేటి నుంచి కొల్లిపరలో వృషభ రాజాల బండలాగుడు బలప్రదర్శన



పందెపు ఎడ్లకు శిక్షణ ఇచ్చేది ఇలా...

తెనాలి: వెలనాడుగా పిలుచుకునే తెనాలి ప్రాంతం వ్యవసాయ ప్రధానమైంది. పశుసంపదకు ఇక్కడ ప్రత్యేక స్థానం ఉంది. ఎడ్లపందేలకు, పశుప్రదర్శనలకు తెనాలి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. భారతదేశంలోనే తొలి పశుప్రదర్శన 1935లో తెనాలి దగ్గర్లోని గోవాడలో ఆలపాటి సూర్యనారాయణ నిర్వహించారు. ఈ స్ఫూర్తితో అప్పటి వైస్రాయి విల్లిత్ గో ఢిల్లీలో అఖిలభారత పశు ప్రదర్శన జరిపారట! తర్వాత అధిక పాల దిగుబడినిచ్చే గేదెలు, ఆవులు, బరువులు లాగే ఎద్దులతో ప్రదర్శనలు, పోటీలు విస్తృతమయ్యాయి. తెనాలిలో 1940లో తొలి పశుప్రదర్శన జరిగింది. తర్వాత కొన్నేళ్లకు అత్తలూరు రావు కోటేశ్వరరావు, సిరిపురం వీరయ్య చెంచుపేటలో ఎడ్లపందేలు నిర్వహించారు. 1950లో ఈదర సుబ్బయ్య చౌదరి అధ్యక్షుడిగా 'దేశోద్ధారక పశుప్రదర్శన' జరిపారు. 1952 ప్రాంతంలో కొల్లూరులో గుమ్మడి బసవయ్య, వెంకట చంద్రరావులచే ఎడ్లపందేలు జరిగాయి.

రికార్డు.. మన్నే సత్యనారాయణ ఎడ్లజతదే!

తెనాలి స్ఫూర్తితో ఎడ్లపందేలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. వరహాపురం రైతు కన్నెగంటి రావులింగయ్య, యడ్లపల్లి రైతు మన్నె సత్యనారాయణ, అనంతరం రైతు దావులూరి రావులింగయ్య, యలవర్రు ఆసామి దావులూరు రావుమోహన రావు, ఈమని నివాసి అంచే మారుతి వరప్రసాద్ పందెపు ఎడ్ల పెంపకం / పోటీల్లోకి వచ్చారు. అనేక పోటీలకు తీసుకెళ్లి రికార్డులు సృష్టించారు. కన్నెగంటి రామలింగయ్య స్వయంగా ఎడ్ల జతలను పోషిస్తూ, పోటీల ఎడ్లకు శిక్షణ కూడా ఇచ్చారు. యడ్లపల్లిలోని మన్నె సత్యనారాయణ తన ఎడ్ల జతతో 1962 మే 1న సృష్టించిన బండలాగుడు రికార్డును ఇప్పటి వరకు ఎవరూ అధిగమించ లేదంటారు. 1653.4 అడుగుల దూరాన్ని అర్ధగంటలో లాగిన ఆ ఎడ్లజతను 1963లో బ్రెజిల్ దేశీయులు రూ.30 వేలకు కొనుగోలు చేశారు.

నేతల భాగస్వామ్యంతో ఉత్సవ సంరంభం

గ్రామీణుల్లో ఎడ్లపందేలకున్న క్రేజ్‌తో రాజకీయ నాయకులు ఇందులోకి వచ్చారు. ఇక దీంతో ఉత్సవ సంరంభమే. తెనాలిలో ఒకేరోజు రెండు వేర్వేరు చోట్ల ఎడ్లపందేలకు పోటీలు జరిగాయంటే రాజకీయులు వీటిని ఎంత ప్రతిష్టాకరంగా భావించేవారో అర్థం చేసుకోవచ్చు. మంత్రులుగా చేసిన వెనిగళ్ల సత్యనారాయణరావు, ఆలపాటి వెంకట్రామయ్యలు, పట్టణ ప్రముఖులు చిట్టినేని సంపెంగరావు, శంకరరావు వర్గం, రాజ్యసభ మాజీ సభ్యుడు యడ్లపాటి వెంకట్రావు వర్గం ఈ పోటీల్లో ఎడ్లజతల్ని ఉధృతాలుగించాయి. రాజకీయ ప్రముఖులు నన్నపనేని వెంకట్రావ్, అన్నాబత్తుని సత్యనారాయణ కూడా ఈ పోటీలను నిర్వహించారు.

దాదాపు మూడు దశాబ్దాలు ఇవి ఆనవాయితీగా కొనసాగాయి. తెనాలి వరకు చూస్తే మాజీమంత్రి ఆలపాటి వెంకట్రామయ్య, మాజీ ఎంపీ వెనిగళ్ల సత్యనారాయణ, మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ, దావులూరి రామమోహనరావు, జెట్టి భానుప్రసాద్, నన్నపనేని వెంకట్రావు, ఈదర సుబ్బయ్య, రావి సత్యనారాయణ వీటిని నిర్వహించారు. ఆలపాటి రాజా తెనాలి ఎమ్మెల్యేగా ఉండగా ఈ పోటీలను జరిపారు. ఎడ్లపందేల్లో రకాలున్నా.. బండ లాగుడు పోటీలే ఎక్కువయ్యాయి.

కేటగిరీల వారీగా పోటీలు ఇలా..

గురువారం ఆరుపళ్లు, 6న న్యూ కేటగిరి, 7న సబ్ జూనియర్స్, 8న జూనియర్స్, 9న సీనియర్స్ వంటి కేటగిరీల వారీగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలల్లో ఒంగోలు జాతి వృషభ రాజములకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఒక విభాగంలో పాల్గొన్నవి మరొక విభాగంలో పాల్గొనకూడదు. సూరపనేని రాధాకృష్ణ, గూడా శ్రీనివాసరావు (దుర్గిశ్రీను), చిరంజీవి, నరసింహా రెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు.



పోటీలు జరిగే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న తెనాలి ఎమ్మెల్యే శివకుమార్

ఉదయం 11 గంటలకు..

కొల్లిపర: మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, అన్నాబత్తుని సత్యనారాయణ , గుడిబండి వెంకటరెడ్డి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బండ లాగుడు బల ప్రదర్శన పోటీలు గురువారం ఉదయం 11 గంటల నుంచి తూములూరు-కొల్లిపర గ్రామం మధ్యలో చెంచల రామిరెడ్డి ఇటుక బట్టీలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన నిర్వాహకులతో కలసి పోటీలు నిర్వహిస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే శివకుమార్ ఆధ్వర్యంలో ఐదురోజులు ఎద్దుల బండ లాగుడు బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వస్తున్నట్లు తెలిపారు.

41,940 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 41,940 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,183 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.27,000,ఏసీ కామన్ రకం రూ.10,000 నుంచి రూ.23,000 వరకు, ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,200 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది.

క్లుప్తంగా...

విజయవాడలో ఎంఎస్‌ఎంఈ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

సాక్షి, అమరావతి: ఏపీలోని ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించే విధంగా విజయవాడలో జనవరి 6,7 తేదీల్లో ఎంఎస్‌ఎంఈ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను జరగనుంది. కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖతో కలిసి విజయవాడ, శ్రీనివాస్ నగర్ బ్యాంక్ కాలనీలోని పరిటాల ఓంకార్ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఓఎన్‌జీసీ, ఆర్‌ఐఎన్‌ఎల్, గెయిల్, దక్షిణ మధ్య రైల్వే, బీడీఎల్, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ వంటి అనేక సంస్థలు పాల్గొంటున్నట్లు ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ తెలిపారు. వీటితో పాటు ఎంఎస్‌ఎంఈలకు రుణాలను అందజేసే పలు బ్యాంకులు ఈ సమావేశంలో పాల్గొని రుణ పథకాలను వివరించనున్నాయి.

నేటి నుంచి భోపాల్‌లో వాటర్ విజన్-2047 సదస్సు

సాక్షి, అమరావతి: దేశంలో జలవనరులను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడమే అజెండాగా వాటర్ విజన్-2047 పేరుతో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులతో కేంద్ర జల్ శక్తి శాఖ సదస్సు నిర్వహిస్తోంది. 2 రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును గురువారం కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రారంభిస్తారు. మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఈఎన్‌సీ నారాయణ రెడ్డిలు ఈ సదస్సులో పాల్గొనడానికి బుధవారం భోపాల్ వెళ్లారు. మురుగు నీటిని శుద్ధి చేసి పునర్ వినియోగించుకోవడంతోపాటు జలవనరులను సమర్థవంతంగా వాడుకోవడంపై మంత్రి అంబటి సదస్సులో నివేదిక సమర్పించనున్నారు. వాతావరణ మార్పులను అధిగమించేలా, నీటిని నిల్వ చేసేలా మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవడం, నీటి నాణ్యతను పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సదస్సులో చర్చిస్తారు.

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

అమలాపురం టౌన్: నాలుగేళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. రూ.3 వేల జరిమానా విధించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రమణ అనే నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో కాకినాడ జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు బుధవారం పై విధంగా తీర్పు చెప్పారు. నేరం జరిగిన కేవలం అయిదు నెలల్లోనే ముద్దాయికి పోక్సో కేసు ద్వారా జైలు శిక్ష పడడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గత సంవత్సరం ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం మండపేట రూరల్ మండలంలోని ఓ గ్రామంలో ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికను ఇంట్లోకి తీసుకునివెళ్లి మండపేటకు చెందిన 55 ఏళ్ల రమణ లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పట్లో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై మండపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో రమణపై పలు సెక్షన్లతో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం తుది విచారణలో రమణపై నమోదైన కేసు రుజువు కావడంతో న్యాయమూర్తి వెంకటేశ్వరరావు పై విధంగా తీర్పు చెప్పి శిక్ష విధించారు.

50 వేలమందికి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో స్థలాలు

సాక్షి, అమరావతి: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇంటిస్థలాలు పొందిన 50 వేలమంది లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గృహనిర్మాణ సంస్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 30.3 లక్షల మంది నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లపట్టాలు మంజూరు చేసినట్టు పేర్కొంది. పలు ప్రాంతాల్లో ఊరికి దూరంగా, శ్మశానాలకు పక్కనే లేఅవుట్‌లు ఉండటంతో తమకు వేరొకచోట స్థలాలు కేటాయించాలని 50 వేలమంది కోరినట్టు తెలిపింది. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని పేర్కొంది. ఈ క్రమంలో 50 వేలమంది లబ్ధిదారులను వందశాతం సంతృప్తిపరిచేలా కలెక్టర్లు స్థలాలు అన్వేషిస్తున్నట్లు తెలిపింది.

ఉగాదికి 5 లక్షల ఇళ్లు పూర్తికావాలి

మంత్రి జోగి రమేశ్

సాక్షి, అమరావతి: ఉగాది నాటికి రాష్ట్రంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఐదులక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలను పూర్తిచేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఒకేరోజు ఐదులక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించడం ద్వారా దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు సాధించాలన్నారు. లక్ష్యఛేదనలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని సీఎం జగన్ పాల్గొనే సభలో అవార్డుతో సత్కరిస్తామని చెప్పారు. అధికారులు అజయ్ జైన్, లక్ష్మీషా తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతోనే అధిక ప్రమాదాలు

మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల 2.2 శాతం..

2021కి సంబంధించి కేంద్రం నివేదిక



దేశంలో అతివేగం వల్ల 71.7 శాతం రోడ్డు ప్రమాదాలు

సాక్షి, అమరావతి: దేశంలో అతివేగం వల్లే అత్యధిక రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. 2020తో పోల్చితే 2021లో అతివేగం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఈ మేరకు 2021లో రాష్ట్రాల వారీగా రోడ్డు ప్రమాదాలపై కేంద్రం నివేదిక విడుదల చేసింది. దేశంలో ఆ ఏడాదిలో మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 71.7 శాతం ప్రమాదాలు అతివేగం వల్లే జరిగాయి. అంతేకాకుండా 2020తో పోల్చితే ఇవి 11.4 శాతం పెరిగాయి. రోడ్డు ప్రమాదాల మొత్తం మరణాల్లో అతివేగం వల్ల ఏకంగా 69.6 శాతం మృతి చెందగా 72.9 శాతం గాయపడ్డట్టు నివేదిక పేర్కొంది. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల 2.2 శాతం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల 1.6 శాతం రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో కూడా జాతీయ రహదారులపై అతివేగం కారణంగా 2021లో 5,167 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 2,155 మంది మృతి చెందినట్లు నివేదిక పేర్కొంది. అలాగే రాష్ట్రంలో మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల జాతీయ రహదారులపై 113 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 13 మంది మృతి చెందారు.

దేశంలో రోడ్డు ప్రమాదాలు ఇలా (2021కి)..

ఉల్లంఘన	ప్రమాదాలు	శాతం	మృతులు	శాతం	గాయాలు	శాతం
అతివేగం	2,95,522	71.7	1,07,236	69.6	2,80,285	72.9
మద్యం సేవించి డ్రైవింగ్	9,150	2.2	3,314	2.2	7,509	2.0
తప్పుడు డ్రైవింగ్	21,491	5.2	8,122	5.3	20,351	5.3
రెడ్‌సిగ్నల్ జంపింగ్	2,203	0.5	679	0.4	1,905	0.5
మొబైల్ ఫోన్ వినియోగం	6,530	1.6	2,982	1.9	5,394	1.4
ఇతర	77,536	18.8	31,639	20.5	69,004	7.9

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించాలి

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్ జారీకి ముందే సచివాలయాల్లో పనిచేస్తున్న వారికి బదిలీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన బుధవారం గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ఖాళీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత అవకాశం కల్పిస్తే.. పట్టణ, గ్రామీణ స్థాయిలో ఉన్న ఖాళీలు పూర్తయి బదిలీలు కోరుకునే వారికి అవకాశం ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ నాయకులు బత్తుల అంకమరావు, బీఆర్ఆర్ కిషోర్ విపర్తి నిఖిల్ కృష్ణ,పిల్లి హరీష్‌రెడ్డి, మధుబాబు, రియాజ్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఎస్సీ గురుకులాలు సన్నద్ధం

- నూరు శాతం ఉత్తీర్ణత కోసం కసరత్తు
- రాష్ట్రస్థాయిలో అకడమిక్ మానిటరింగ్ యూనిట్
- వారాంతపు పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి పతకాలు

సాక్షి, అమరావతి: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సన్నద్ధమైంది. ఈ ఏడాది మార్చి 15 నుంచి జరిగే ఇంటర్, ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 189 అంబేడ్కర్ గురుకులాలు ఉన్నాయి. వీటిలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 1,09,825 మంది విద్యార్థులున్నారు. వారిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 13,808 మంది, జూనియర్ ఇంటర్ 10,685, సీనియర్ ఇంటర్ 11,265 మంది ఉన్నారు.

గురుకుల విద్యాలయాల సంస్థ ప్రణాళిక ఇదీ

పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు నెలకొల్పేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర స్థాయిలో అకడమిక్ మానిటరింగ్ యూనిట్ నిరంతర పర్యవేక్షణతో పాటు జిల్లా స్థాయిలో జిల్లా సమన్వయ అధికారుల ద్వారా పాఠశాలల వారీగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సబ్జెక్టుల వారీగా నిపుణులైన ఉపాధ్యాయులను బృందాలుగా నియమించి మేధోమథనం (బ్రెయిన్ స్టార్మింగ్ వర్క్‌షాప్) నిర్వహించి పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. నెలవారీ సిలబస్‌ను వారాల సిలబస్‌గా (మైక్రో షెడ్యూల్స్) విభజించి సబ్జెక్ట్, అంశాల వారీగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. వారంలో జరిగిన సిలబస్‌పై అదే వారంలో అసైన్మెంట్ ప్రాక్టీస్ చేయిస్తున్నారు. వాటిపై ఆ తర్వాత వారంలో రోజుకు ఒక పరీక్ష చొప్పున స్వల్ప వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రతి రివిజన్ టెస్టు జరిగిన తర్వాత వాటి ఫలితాలను విశ్లేషించి ప్రతిభ చాటిన వారికి బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు బ్యాడ్జెస్ బహూకరిస్తారు. రివిజన్ టెస్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి వారికి పిల్లల జవాబు పత్రాలను చూపించి బిడ్డల చదువులపై వారికి మరింత శ్రద్ధ పెంచుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో మొత్తం సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి, పబ్లిక్ పరీక్ష విధానంలో రివిజన్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు, మూడు పూర్తిస్థాయి మోడల్ పరీక్షలను నిర్వహించనున్నారు.

మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ



ఎస్సీ గురుకులాల్లో చదివే విద్యార్థులు టెన్త్, ఇంటర్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతతోపాటు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గురుకులాల్లో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉండేలా తీర్చిదిద్దుతున్నాం.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

తెలంగాణలో మకాం.. ఏపీలో రాజకీయాలా?

బాబు, లోకేష్, పవన్‌పై ఎంపీ భరత్‌రామ్ ధ్వజం



రాజమహేంద్రవరం రూరల్: 'వాళ్ల మకాం తెలంగాణలో.. వారు ఏపీకి వచ్చి చచ్చు రాజకీయాలు చేస్తుంటారు' అని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. నిజంగా వారికి ఈ రాష్ట్ర ప్రజలపై మమకారం ఉంటే ఏపీలోనే ఎందుకు ఉండరని ప్రశ్నించారు. చంద్రబాబు తరువాత లోకేష్ అట.. అసలు ఆ పప్పు సుద్దకు రాష్ట్రాన్ని ఎలా అప్పగిస్తామని ప్రశ్నించారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల పాలనను బేరీజు వేసుకుని నిజంగా ఏ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు దక్కాయో మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని అన్నారు. సెక్షన్ 30ని చూసి ప్రతిపక్ష నేతలు ఎందుకు కలవరపడుతున్నారని ప్రశ్నించారు. ఈ చట్టం స్వాతంత్ర్యం రాకముందు నుండీ ఉన్నదేనని, సీఎం జగన్ లేదా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా తెచ్చినట్టు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. చంద్రబాబు సభలలో తొక్కిసలాట జరిగి పదకొండు మంది మృతి చెందడంతో అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సెక్షన్ 30ని అమల్లోకి తేవాల్సి వచ్చిందని వివరించారు. లేకపోతే చంద్రబాబు మరణమృదంగం కొనసాగే ప్రమాదం ఉందన్నారు. వారి స్వార్థ రాజకీయాలు, పబ్లిసిటీ పిచ్చికి ఇంకెంతమంది బలి కావాలని ప్రశ్నించారు.

ప్రభుత్వ మెనూను కచ్చితంగా అమలు చేయాలి

ఆహార కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆహార కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్లు, సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బాలామృతాన్ని ఆహారంలో తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పీడీఎస్ కింద ఇచ్చే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు చేరేలా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద కేంద్రం గర్భిణులకు తొలికాన్పునకు రూ.5వేలు ఇస్తుండగా దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రూ.వెయ్యి, పట్టణాల్లో రూ.600 అందిస్తోందన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ డైరెక్టర్, ఆహార కమిషన్ సభ్య కార్యదర్శి విజయ సునీత, ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు, లక్ష్మిరెడ్డి, కృష్ణ కిరణ్, డిప్యూటీ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

తెలంగాణ

'ఎక్సెల్ రబ్బర్'పై ఐటీ దాడులు

- హైదరాబాద్‌లోని 8 ప్రాంతాలతోపాటు దేశవ్యాప్తంగా సోదాలు
- భారీగా అవకతవకలు.. పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాల గుర్తింపు
- హార్డ్ డిస్క్‌లు, పలు డాక్యుమెంట్ల సీజ్

సాక్షి, హైదరాబాద్: ఎక్సెల్ రబ్బర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌పై బుధవారం ఆదాయపన్ను శాఖ (ఐటీ) దాడులు నిర్వహించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్, సంగారెడ్డి జిల్లా బొల్లారం సహా ఎనిమిది ప్రాంతాల్లో, చెన్నై, బెంగళూర్, ఏపీ సహా దేశవ్యాప్తంగా మొత్తం 20 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లో బుధవారం తెల్లవారుజాము నుంచి సుమారు 12 బృందాలు సోదాల్లో పాల్గొన్నాయి. సీఆర్‌పీఎఫ్ పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు తనిఖీలు నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఎక్సెల్ బ్రాంచ్ ఆఫీస్, కోకాపేట్‌లో ఆరుగురు డైరెక్టర్లు, సీఈఓల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా బాచుపల్లి, పాశమైలారంలోని ఎక్సెల్ రబ్బర్ యూనిట్ 5, విలాస్ పాలిమర్స్ ప్రైవేట్, ఎస్ టైర్స్ లిమిటెడ్ కంపెనీల్లో సోదాలు చేశారు. సెర్చ్ వారెంట్‌తో సోదాల్లో పాల్గొన్న అధికారులు రబ్బర్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ కంపెనీలోకి బ్రిటన్ నుంచి రూ.500 కోట్ల పెట్టుబడులు రావడం, దానికి సంబంధించిన పన్నుల వివరాలను పొందుపర్చకపోవడం వంటి ఆరోపణలు ఈ సంస్థపై ఉన్నట్లు సమాచారం. ట్యాక్స్ చెల్లింపులోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గత ఐదేళ్లకు సంబంధించిన ఆదాయ వ్యయాలు, ఐటీ చెల్లింపులకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఐటీ అధికారులు పరిశీలించారు. ఎక్సెల్ దాని అనుబంధ సంస్థలపై విలాస్ పాలిమార్‌సహా మరో రెండు కంపెనీలకు చెందిన హార్డ్ డిస్క్‌లు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేసినట్లు తెలిసింది. సోదాలు గురువారం కూడా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఐతే ఈ సోదాలకు సంబంధించిన వివరాలను ఐటీశాఖ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రధానం

- 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు'లో ఆప్షన్-3 కింద 3.27 లక్షల ఇళ్ల నిర్మాణం
- నిర్మాణంలో నాణ్యత పర్యవేక్షణకు 36 క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు



విజయనగరం జిల్లా గుంకలాం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్

సాక్షి, అమరావతి: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో చేపడుతున్న పేదల ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతపై గృహనిర్మాణ శాఖ ప్రత్యేకదృష్టి సారించింది. ఈ పథకం కింద రెండుదశల్లో ప్రభుత్వం 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వీటిలో 2.62 లక్షల టిడ్కో, 18.63 లక్షల సాధారణ ఇళ్లు ఉన్నాయి. 18.63 లక్షల ఇళ్లలో 16.67 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని 3.27 లక్షల మంది లబ్ధిదారులు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇచ్చే ఆప్షన్-3ని ఎంచుకున్నారు. వీటిలో 1.08 లక్షల ఇళ్ల నిర్మాణాలు ప్లింత్ బీమ్, ఆపైస్థాయిలో కొనసాగుతున్నాయి.

వ్యాప్‌కోస్ ద్వారా థర్డ్ పార్టీ పర్యవేక్షణ

రాష్ట్రవ్యాప్తంగా ఆప్షన్-3 కింద ఇళ్లు నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లోనే ప్రభుత్వం రూ.75.60 లక్షలతో 36 మెటీరియల్ క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే పలుచోట్ల ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ ల్యాబ్‌లలో ఇళ్ల నిర్మాణానికి వినియోగిస్తున్న ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యత పరీక్షిస్తారు. ఇదేగాక కేంద్రప్రభుత్వ సంస్థ అయిన వ్యాప్‌కోస్ ద్వారా నాణ్యతపై థర్డ్ పార్టీ పర్యవేక్షణ చేపడుతున్నారు. ఈ సంస్థ ప్రతినిధులు లేఅవుట్లలో మెటీరియల్‌లోను, నిర్మాణాల్లోను నాణ్యతను పరీక్షిస్తారు.

వారం రోజుల్లో ల్యాబ్‌లన్నీ ఏర్పాటవుతాయి

వారం రోజుల్లో 36 క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ల ఏర్పాటు పూర్తవుతుంది. ఆయా ప్రాంతాల్లోని గృహనిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణలో ల్యాబ్‌ల కార్యకలాపాలు ఉంటాయి. నిర్మాణాల విషయంలో రాజీపడొద్దని సీఎం జగన్ ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మరోవైపు థర్డ్ పార్టీ పర్యవేక్షణ కూడా ఉంటుంది.

– శివప్రసాద్, గృహనిర్మాణ సంస్థ జేఎండీ

టోల్‌గేట్ వద్ద బెల్లంపల్లి ఎమ్మెల్యే హల్‌చల్

సిబ్బందిపై దాడికి యత్నం!

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారి-363పై మంచిర్యాల జిల్లా మందమర్రి శివారులోని టోల్‌ప్లాజా వద్ద బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం రాత్రి హల్‌చల్ చేశారు. చిన్నయ్య మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వెళ్తుండగా టోల్‌ప్లాజా సిబ్బంది వాహనం ఆపడంతో కారు దిగిన ఆయన ఆగ్రహంతో వారిపై దాడికి యత్నించారు. కాగా, పక్కనున్న వారు అయనను సముదాయించినట్లు తెలుస్తోంది. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే చిన్నయ్యను 'సాక్షి'సంప్రదించగా.. ప్రమాదంలో గాయపడిన తమ బంధువుల అబ్బాయిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా అక్కడి సిబ్బంది టోల్ వసూలు చేయడంపై మేనేజర్‌ను కలిసే ప్రయత్నం చేశానని చెప్పారు. ఎవరిపైనా తాను దాడి చేయలేదని తెలిపారు. కాగా, సోషల్‌మీడియా, టీవీ చానళ్లలో సీసీ ఫుటేజీ వీడియో ప్రసారం కావడంతో 'రోడ్డు పనులు పూర్తి కాకుండానే టోల్ వసూలు చేయడంపై స్థానిక ఎమ్మెల్యేగా అక్కడి అధికారులను అడిగా' అని వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ పీడీ రవీందర్‌రావును 'సాక్షి'సంప్రదించగా, ఈ ఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు. గత నెల 30వ తేదీ నుంచి ఇక్కడ వాహనదారుల నుంచి టోల్ రుసుం వసూలు చేస్తున్నారు.

దేశంలో పంటల కోత అనంతర నష్టాలు రూ.1.52 లక్షల కోట్లు

ప్రస్తుత ధరలతో పోల్చితే దేశ జీడీపీలో ఇది 2.35 %

- అత్యధికంగా గుడ్లు, మాంసం, చేపలు, పాలల్లో 21.70 % మేర నష్టం
- పంట కోత అనంతర మౌలిక సదుపాయాలను కల్పించడంపై తక్షణం దృష్టి సారించాలి
- 54 పంటల కోత అనంతర నష్టాలపై నాబ్కాన్స్- 2022 అధ్యయన నివేదిక విడుదల

సాక్షి, అమరావతి: దేశంలో ప్రధాన పంటల కోత అనంతరం మౌలిక సదుపాయాల లేమి కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లుతోందని నాబ్కాన్స్ నివేదిక-2022 తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో 2020-21లో పంటల కోత అనంతరం నష్టాలపై నాబ్కాన్స్ అధ్యయనం చేసి ఈ నివేదికను తాజాగా విడుదల చేసింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో పంట కోత అనంతరం ప్రాసెసింగ్ వంటి సదుపాయాలు లేకపోవడంతో 54 ప్రధాన పంటలకు సంబంధించి రూ.1,52,790.42 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని నివేదిక స్పష్టం చేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే.. దేశ జీడీపీలో 2.35 శాతంగా ఉందని తెలిపింది. కాగా 2020-21లో జాతీయ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 19.9 శాతంగా ఉందని వెల్లడించింది. పంట కోత అనంతర నష్టాలు 2015తో పోల్చితే పంటల ఉత్పత్తి పెరిగిన కారణంగా ఇప్పుడు మరింత పెరిగాయని పేర్కొంది. వ్యవసాయ ఉత్పత్తుల్లో కోత అనంతర నష్టాలను తగ్గించడానికి అవసరమైన ప్రాసెసింగ్ సౌకర్యాలు, విలువ జోడింపు సదుపాయాలను కల్పించడంపై ప్రభుత్వాలు తక్షణం దృష్టి సారించాలని నాబ్కాన్స్ సూచించింది. ఆహార శుద్ధి రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

వీటిలోనే ఎక్కువ నష్టాలు..

2020-21లో పంట అనంతరం సదుపాయాల లేమి కారణంగా అత్యధికంగా పశు ఉత్పత్తులైన పాలు, మాంసం, గుడ్లు, చేపల్లో 21.70 శాతం మేర ఆర్థిక నష్టం వాటిల్లినట్లు నివేదిక తెలిపింది. వీటి తర్వాత పండ్లలో 19.34 శాతం, కూరగాయల్లో 17.97 శాతం, వరి, గోధుమ తదితరాల్లో 17.02 శాతం, తోటలు, సుగంధ ద్రవ్యాల్లో 10.74 శాతం, నూనె గింజల్లో 7.15 శాతం, పప్పు ధాన్యాల్లో 6.08 శాతం మేర ఆర్థిక నష్టం సంభవించినట్టు నాబ్కాన్స్ నివేదిక వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేట్ రంగాల్లో తీసుకున్న చర్యలతో 2015తో పోల్చితే ఇప్పుడు 45 పంటల కోత అనంతర నష్టాలు కొంత మేర తగ్గాయని వివరించింది. ఇందులో 25 పంటల నష్టాలు బాగా తగ్గాయని పేర్కొంది. ఇలా రూ.20,440.58 కోట్ల నష్టాలు తగ్గినట్లు తెలిపింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార డిమాండ్‌ను తీర్చడానికి పంట కోత అనంతర నష్టాలను మరింత తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, వివిధ వ్యూహాలను, చర్యలను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేసింది. పంట కోత తర్వాత నష్టాలను తగ్గించడానికి సమర్థవంతమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తే 39.19 మిలియన్ టన్నుల ఆహారం, 29.72 మిలియన్ టన్నుల చక్కెర, 7,363 మిలియన్ గుడ్లు అందుబాటులో ఉంటాయని నివేదిక పేర్కొంది.

2020-21లో పంటల వారీగా భౌతిక పరిమాణం, ఆర్థికంగా నష్టాలు ఇలా..

కేటగిరీ	ఉత్పత్తి (మిలియన్ టన్నులు)	పంట నష్టాలు (మి.ట)	ఆర్థిక నష్టం (రూ.కోట్లలో)
తృణధాన్యాలు	281.28	12.49	26,000.79
పప్పులు	21.55	1.37	9,289.21
నూనె గింజలు	37.27	2.11	10,924.97
పండ్లు	90.82	7.36	29,545.07
కూరగాయలు	164.74	11.97	27,459.08
తోటలు, సుగంధద్రవ్యాలు	426.13	30.59	16,412.56
పాలు, మాంసం, చేపలు	232.86	3.01	29,871.41
గుడ్లు	1,22,110	7,363	3,287.32
మొత్తం			1,52,790.42

ఠాగూర్ ఔట్.. ఠాక్రే ఇన్

- తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు
- పార్టీ ఇన్‌చార్జిని మార్చిన అధిష్టానం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించి బుధవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్యం ఠాగూర్‌ను అధిష్టానం తప్పించి.. మహారాష్ట్రకు చెందిన సీనియర్ నేత మాణిక్‌రావ్ ఠాక్రేను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మాణిక్యం ఠాగూర్‌కు గోవా రాష్ట్ర వ్యవహారాలను అప్పగించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన రాష్ట్రంలోని సీనియర్ నేతల ఒత్తిడితోపాటు, పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగేందుకు మాణిక్యం సైతం విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో అధిష్టానం ఈ మార్పు చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు మాణిక్యంను తప్పిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు వెలువడటానికి ముందు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రేవంత్‌రెడ్డి వేదాంత ధోరణిలో మాట్లాడటం పార్టీలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ భేటీకి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి హాజరు కాగా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వీహెచ్, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావు వంటి నాయకులు పాల్గొనకపోవడం చర్చనీయాంశమవుతోంది.

'హాత్‌సే హాత్ జోడో'పై చర్చ

కాగా, బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా జనవరి 26 నుంచి నిర్వహించాల్సిన 'హాత్‌సే హాత్ జోడో' పాదయాత్రలపై నేతలు చర్చించారు. ధరణి పోర్టల్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నేతలకు అవగాహన కల్పించారు. సమావేశానికి ఏఐసీసీ సమన్వయకర్త గిరీష్ జోడంకర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

కేసీఆర్‌తో బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుని భేటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ బుధవారం ప్రగతిభవన్‌లో పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. ఏపీలో పార్టీ పటిష్టత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఏపీ నేత చింతల పార్థసారథి తదితరులున్నారు.



సెమీఫైనల్లో హుసాముద్దీన్

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ) జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. హిసార్‌లో బుధవారం ఏకపక్షంగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన హుసాముద్దీన్ 5–0తో మనీశ్ రాథోడ్ (ఉత్తరప్రదేశ్)పై గెలిచాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ఆశిష్ (హిమాచల్‌ప్రదేశ్)తో హుసాముద్దీన్ తలపడతాడు.



ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీకి భారత జట్టు ప్రకటన

వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును బుధవారం ప్రకటించారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్... మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి, పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ జోడీలు... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, శిఖా గౌతమ్–అశ్విని భట్ జోడీలు.... మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇషాన్ భట్నాగర్–తనీషా క్రాస్టో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

సిరీస్ లక్ష్యంగా...

- నేడు శ్రీలంకతో భారత్ రెండో టి20
- ఆత్మవిశ్వాసంతో హార్దిక్ బృందం
- గాయంతో సామ్సన్ సిరీస్‌కు దూరం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



పుణే: గెలుపుతో కొత్త ఏడాదిని ప్రారంభించిన భారత్ వరుస విజయంతో ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. గురువారం జరిగే రెండో టి20లో సిరీస్ సొంతం చేసుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతుంది. మరోవైపు తొలి మ్యాచ్ ఓటమితో ఒత్తిడిలో కూరుకుపోయిన శ్రీలంక సిరీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన స్థితిలో ఉంది. ఆసియా కప్ టి20 చాంపియన్ అయిన లంక బౌలింగ్‌లో ఆతిథ్య జట్టును చక్కగా కట్టడి చేసినప్పటికీ బ్యాటింగ్‌లో తడబడింది. దీంతో పటిష్టమైన భారత్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు లోపాలపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) మైదానంలో ఇరు జట్ల మధ్య రెండో టి20 కూడా ఆసక్తికరంగా జరగనుంది. మోకాలి గాయం కారణంగా సంజూ సామ్సన్ టి20 సిరీస్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో విదర్భకు చెందిన వికెట్ కీపర్ జితేశ్ శర్మను జట్టులోకి ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది.

గెలిచింది కానీ...

భారత్ సిరీస్‌లో శుభారంభం చేసింది. కానీ అంత గొప్ప విజయమైతే కాదు. ఓపెనింగ్, టాపార్డర్ వైఫల్యం జట్టును కంగారు పెట్టించింది. పొట్టి మ్యాచ్‌ల్లో శివమెత్తే 'మిస్టర్ 360 డిగ్రీ' బ్యాటర్ సూర్యకుమార్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. రోహిత్, కోహ్లిలాంటి స్టార్లు లేని ప్రస్తుత టీమిండియాకు సంచలన బ్యాటర్ సూర్యకుమారే కీలక ఆటగాడు. అలాంటి బ్యాటర్ బాధ్యతను విస్మరిస్తే మాత్రం జట్టుకు మూల్యం తప్పదు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యాతో పాటు దీపక్ హుడా, అక్షర్ పటేల్ గత మ్యాచ్‌లో ఆదుకున్నారు. ఈ మ్యాచ్‌లో వారిదాకా బ్యాటింగ్ రాకుండా భారత టాపార్డర్ బ్యాటర్లు రాణించాలి.

ఉమ్రాన్ స్థానంలో అర్ష్‌దీప్

గత మ్యాచ్‌లో అనారోగ్యం కారణంగా బరిలోకి దిగలేకపోయిన యువ సీమర్ అర్ష్‌దీప్ సింగ్ రెండో టి20కి సిద్ధంగా ఉన్నాడు. ఉమ్రాన్ మాలిక్ స్థానంలో అతను ఆడతాడు. దీంతో పేస్ విభాగం కాస్త పటిష్టమవుతుంది. శివమ్ మావి తొలి మ్యాచ్‌లో సత్తా నిరూపించుకోవడంతో అతని స్థానానికి వచ్చిన ఢోకా అయితే లేదు. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ చహల్ ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం ఇబ్బందికర అంశం. స్పిన్‌కు కలిసొచ్చే ఎంసీఏ పిచ్‌పై అతను సత్తా చాటుకోవాలి.

రేసులో పడాలనే లక్ష్యంతో...

భారత్ సిరీస్ వేటలో పడితే... లంక సిరీస్ రేసులో ఉండాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఆతిథ్య జట్టులాగే లంక జట్టులోనూ టాపార్డర్ విఫలమైంది. మెరుపులు మెరిపించే నిసాంక, ధనంజయ డిసిల్వా పవర్‌ప్లేలోనే డగౌట్‌లో చేరడం, హిట్టర్ రాజపక్స వైఫల్యం లంక లక్ష్యఛేదనను భారంగా మార్చింది. కీలకమైన ఈ పోరులో వీరంతా ఫామ్‌లోకి వస్తే శ్రీలంక మ్యాచ్‌లో గెలిచి రేసులో నిలుస్తుంది. బౌలింగ్‌లో 4 ఓవర్లలో 47 పరుగులు సమర్పించుకున్న కసున్ రజిత స్థానంలో లాహిరు కుమారను ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఇది మినహా దాదాపు తొలి మ్యాచ్ ఆడిన తుదిజట్టే బరిలోకి దిగుతుంది.

పిచ్, వాతావరణం

ఎంసీఏ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. పేసర్లకంటే స్పిన్నర్లకు కలిసొచ్చే పిచ్. వర్షం ముప్పు లేదు. మంచు ప్రభావం ఉంటుంది. ఈ మైదానంలో భారత్ మూడు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. 2012లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్లతో నెగ్గగా... 2016లో శ్రీలంక చేతిలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది. 2020లో శ్రీలంకపైనే భారత్ 78 పరుగులతో గెలిచింది.

'మట్టి కుస్తీ' సవాల్

- రేపటి నుంచి హైదరాబాద్‌లో 'హింద్ కేసరి' పోటీలు
- 2011 తర్వాత మరోసారి భాగ్యనగరం ఆతిథ్యం
- బరిలో 550 మంది రెజ్లర్లు
- పురుషులు, మహిళల విభాగాల్లో పోరు

సాక్షి, హైదరాబాద్: పుష్కర కాలం తర్వాత భాగ్యనగరంలో మరోసారి సాంప్రదాయ కుస్తీ పోటీలకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం పెద్ద స్థాయి ఈవెంట్లలో అధికారిక క్రీడగా ఉన్న 'మ్యాట్ రెజ్లింగ్' కాకుండా మట్టిలో జరిగే హోరాహోరీ సమరాలకు దేశవ్యాప్తంగా మంచి ఆదరణ ఉంది. అందుకే గత 65 ఏళ్లుగా పలువురు అగ్రశ్రేణి రెజ్లర్లను భాగస్వాములుగా చేస్తూ ఈ టోర్నీలను 'ఇండియన్ స్టయిల్ రెజ్లింగ్ అసోసియేషన్' విజయవంతంగా నిర్వహిస్తోంది. 'హింద్ కేసరి'గా గుర్తింపు తెచ్చుకునేందుకు రెజ్లర్లు తలపడే ఈ ఆసక్తికర మట్టి కుస్తీ టోర్నీకి ఎల్బీ స్టేడియం వేదికవుతోంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ప్రముఖ రెజ్లర్లందరూ తలపడతారు. గురువారం సాయంత్రం రెజ్లర్ల వెయింగ్ తీసుకుంటారు. సుదీర్ఘ కాలం పాటు తెలంగాణలో రెజ్లింగ్ సంఘానికి చిరునామాగా నిలిచిన విజయ్‌కుమార్ యాదవ్ స్మారకంగా ఈ టోర్నమెంట్‌ను వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో 'హింద్ కేసరి' పోటీలు జరగడం ఇది మూడోసారి. 1958లో తొలిసారి జరగ్గా... 2011లో రెండోసారి హైదరాబాద్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇచ్చింది. 2011లో మధ్యప్రదేశ్‌కు చెందిన రోహిత్ పటేల్ ఫైనల్లో మౌజమ్ ఖత్రీని ఓడించి 'హింద్ కేసరి' టైటిల్ సాధించాడు.



2011లో హైదరాబాద్‌లో జరిగిన 'హింద్ కేసరి' టోర్నీలో టైటిల్ నెగ్గిన రోహిత్ పటేల్ (ఫైల్)

'హింద్ కేసరి' ఇతర విశేషాలు...

- జనవరి 6 నుంచి 8 వరకు ఎల్బీ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న రెండు మట్టి కోర్టులలో బౌట్‌లు జరుగుతాయి. దేశం నలుమూలల నుంచి దాదాపు 550 మంది రెజ్లర్లు పాల్గొంటారు.
- పురుషుల విభాగంలో 55 కేజీల నుంచి 90 కేజీల మధ్య 8 కేటగిరీలలో బౌట్‌లు ఉంటాయి. 'హింద్ కేసరి' టైటిల్ కోసం 85 కేజీల నుంచి 140 కేజీల మధ్య ఉన్న రెజ్లర్లు పోటీపడతారు. మహిళల విభాగంలో 48 కేజీల నుంచి 68 కేజీల మధ్య 5 కేటగిరీల్లో బౌట్‌లు ఉంటాయి. 'మహిళా హింద్ కేసరి' టైటిల్ కోసం 65 నుంచి 90 కేజీల మధ్య రెజ్లర్లు బరిలోకి దిగుతారు.
- పురుషుల విభాగంలో 'హింద్ కేసరి' టైటిల్ విజేతకు రూ. 3 లక్షలతోపాటు 3 కిలోల వెండి గద బహుమతిగా లభిస్తుంది. రన్నరప్‌కు రూ. 2 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన రెజ్లర్‌కు రూ. 1 లక్ష అందజేస్తారు. మహిళల 'హింద్ కేసరి'కి రూ. 1 లక్ష నగదు బహుమతి అందజేస్తారు. ఇతర వెయిట్ కేటగిరీ విజేతలకు కూడా నగదు పురస్కారాలు ఇస్తారు.

సౌద్ షకీల్ అజేయ శతకం



కరాచీ: న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 407 పరుగులు చేసింది. సౌద్ షకీల్ (336 బంతుల్లో 124 బ్యాటింగ్; 17 ఫోర్లు) కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేయగా...ఇమామ్ ఉల్ హక్ (83), సర్ఫరాజ్ అహ్మద్ (78), ఆగా సల్మాన్ (41) రాణించారు. ఓవర్‌నైట్ స్కోరు 154/3తో ఆట కొనసాగించిన పాక్ బుధవారం 85 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి మరో 253 పరుగులు జోడించింది. కివీస్ బౌలర్లలో ఎజాజ్ పటేల్ 3, సోధి 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం చేతిలో ఒకే వికెట్‌తో మరో 42 పరుగులు వెనుకబడి ఉన్న పాక్... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయే అవకాశాలు ఉన్నాయి.

జ్ఞానేశ్వర్, భరత్ అర్ధ సెంచరీలు

- రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 230/3
- హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్



జ్ఞానేశ్వర్



భరత్

సాక్షి, విజయనగరం: హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కోలుకుంది. 62 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 48 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 230 పరుగులు సాధించింది. తద్వారా తమ ఆధిక్యాన్ని 168 పరుగులకు పెంచుకుంది. సీఆర్ జ్ఞానేశ్వర్ (96 బంతుల్లో 72; 15 ఫోర్లు), కెప్టెన్ హనుమ విహారి (33; 4 ఫోర్లు, 1 సిక్స్), కోన శ్రీకర్ భరత్ (52 బంతుల్లో 70 బ్యాటింగ్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), రికీ భుయ్ (51 బంతుల్లో 43 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత ఆటతీరుతో ఆంధ్ర జట్టును నిలబెట్టారు. ఆంధ్ర కోల్పోయిన మూడు వికెట్లను హైదరాబాద్ బౌలర్ రక్షణ్ రెడ్డి పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 79/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ మరో 118 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు కోల్పోయి 197 పరుగులవద్ద ఆలౌటై 62 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. శశాంక్ (55 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆంధ్ర బౌలర్లు నితీశ్ కుమార్ రెడ్డి (4/64), కేవీ శశికాంత్ (3/40), సుదర్శన్ (2/47) విజృంభించి హైదరాబాద్‌ను 200 స్కోరులోపు కట్టడి చేశారు.

సౌరాష్ట్ర 503/6

రాజ్‌కోట్: ఢిల్లీతో జరుగుతున్న మరో మ్యాచ్‌లో సౌరాష్ట్ర 370 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 184/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు నష్టపోయి 503 పరుగులు సాధించింది. అర్పిత్ (127 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్), హార్విక్ దేశాయ్ (107; 15 ఫోర్లు) సెంచరీలు సాధించారు. తొలి రోజు జైదేవ్ ఉనాద్కట్ (8/39) ధాటికి ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

యషశ్రీకి మూడు వికెట్లు

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా అండర్–19 మహిళల జట్టుతో బుధవారం జరిగిన చివరిదైన ఆరో టి20 మ్యాచ్‌లో భారత అండర్–19 మహిళల జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 4–0తో దక్కించుకుంది. రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలో 54 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ అమ్మాయి యషశ్రీ 14 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... ఫలక్ నాజ్, సోనమ్ యాదవ్, పార్శవి చోప్రా రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం భారత్ 9.2 ఓవర్లలో 3 వికెట్లకు 55 పరుగులు చేసి నెగ్గింది. కెప్టెన్ షఫాలీ వర్మ (22; 3 ఫోర్లు, 1 సిక్స్), హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష (10 నాటౌట్; 1 ఫోర్) రాణించారు.

ఆస్ట్రేలియా 147/2

సిడ్నీ: దక్షిణాఫ్రికాతో చివరిదైన మూడో టెస్టులో ఆస్ట్రేలియా టాపార్డర్ బ్యాటర్స్ ఉస్మాన్ ఖాజా (54 బ్యాటింగ్; 6 ఫోర్లు), లబ్‌షేన్ (79; 13 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. వర్షం అంతరాయం కలిగించడంతో తొలిరోజు 47 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆస్ట్రేలియా 2 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఖాజా, లబ్‌షేన్ రెండో వికెట్‌కు 135 పరుగులు జోడించారు.

మెరుగైన చికిత్స కోసం...

ఎయిర్ అంబులెన్స్ ద్వారా ముంబైకి పంత్ తరలింపు



న్యూఢిల్లీ: కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భారత క్రికెటర్ రిషభ్ పంత్‌కు మరింత మెరుగైన చికిత్స అవసరమని బీసీసీఐ భావించింది. దాంతో ఇప్పటి వరకు చికిత్స పొందుతున్న డెహ్రాడూన్ ఆస్పత్రి నుంచి పంత్‌ను ఎయిర్ అంబులెన్స్ ద్వారా ముంబైకి తరలించింది. ఇకపై ముంబైలోని ప్రతిష్టాత్మక కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ హాస్పిటల్‌లో పంత్‌కు చికిత్స కొనసాగుతుందని బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. ప్రధానంగా పంత్ మోకాలి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటం, వాటికి తక్షణ చికిత్స అవసరం కావడంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ మెడిసిన్ హెడ్, ఆర్థోస్కోపీ నిపుణుడైన డాక్టర్ దిన్షా పర్దీవాలా పంత్ చికిత్సను పర్యవేక్షిస్తారు. దిన్షా గతంలో సచిన్, యువరాజ్, బుమ్రా, జడేజాలతో పాటు పలువురు ఇతర అథ్లెట్లకు చికిత్స అందించారు. పంత్ కోలుకునేందుకు బోర్డు అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని షా చెప్పారు. పంత్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నా... అతని మోకాలు, మడమ గాయాల తీవ్రత ఎంతగా ఉందంటే ఇప్పటి వరకు వాటికి కనీసం ఎంఆర్‌ఐ స్కానింగ్ కూడా చేయలేకపోయారు. ఇదే కాస్త ఆందోళన కలిగించే అంశం.

సినిమా

విన్నారా... విన్నారా...

షూటింగ్ చేయడం.. కొత్త సినిమా కోసం కథలు వినడం... ప్రస్తుతం సీనియర్ స్టార్స్ ఇలా కథలు వినే పని మీద ఉన్నారు. ఫలానా దర్శకుడు చెప్పిన కథను ఫలానా హీరో విన్నారట అనే టాక్ రావడంతో విన్నారా? నిజమేనా? అనే చర్చ మొదలైంది. ఇక వార్తల్లో ఉన్న ప్రకారం ఏయే హీరో ఏయే దర్శకుడు చెప్పిన కథ విన్నారో చూద్దాం.



చిరంజీవి



బాలకృష్ణ



నాగార్జున



వెంకటేశ్

చిరంజీవి ఖాతాలో ప్రస్తుతం ఉన్న రెండు చిత్రాలు 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్'. వీటిలో 'వాల్తేరు వీరయ్య' ఈ 13న విడుదల కానుండగా, 'భోళా శంకర్' ఏప్రిల్ 14న రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రెండు చిత్రాల తర్వాత యువ దర్శకుడు వెంకీ కుడుములతో చిరంజీవి హీరోగా నటించే సినిమా తెరకెక్కాల్సింది. కానీ ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం హోల్డ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి తర్వాతి సినిమా ఏ దర్శకుడితో అనే చర్చ మొదలైంది. అయితే గత ఏడాది వేసవిలో చిరంజీవి హీరోగా తాను నిర్మాతగా ఓ సినిమా చేయనున్నట్లు నటి రాధిక ట్వీట్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. చిరంజీవి నెక్ట్స్ చేయబోయేది ఈ సినిమాయే అని, ఇటీవలే కథా చర్చలు కూడా ఊపందుకున్నాయన్నది ఫిల్మ్‌నగర్ లేటెస్ట్ టాక్. ఆల్రెడీ కొంతమంది దర్శకులు చెప్పిన కథలు విన్నారట చిరంజీవి. ఇటు రాధిక కూడా కొంతమంది రచయితలను సంప్రదించగా, వారు చిరంజీవికి స్టోరీ లైన్ చెప్పారట. మరోవైపు దర్శకుడు పూరి జగన్నాథ్ కూడా చిరంజీవి కోసం ఓ కథను రెడీ చేస్తున్నారని తెలిసింది. అలాగే ప్రభుదేవా కూడా ఓ కథ సిద్ధం చేశారట. మరి.. చిరంజీవి ఏ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు? అనే విషయంపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇటు 'వీరసింహారెడ్డి' సినిమాను ఈ సంక్రాంతి బరిలో ఉంచిన బాలకృష్ణ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. కాగా బాలకృష్ణకు 'సింహా', 'లెజెండ్', 'అఖండ' వంటి సూపర్ హిట్స్ అందించిన బోయపాటి శ్రీను ఇటీవల ఆయనకు ఓ కథ వినిపించారట. అలాగే దర్శకుడు పరశురామ్ కూడా బాలకృష్ణకు కథ చెప్పారట.

మరోవైపు 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా 'ఆదిత్య మ్యాక్స్ 999' సినిమా చేయాలని బాలకృష్ణ భావిస్తున్నారు. మరి.. బాలకృష్ణ 109వ దర్శకుడు ఎవరు? అనే విషయంపై క్లారిటీ రావాలంటే కొంత సమయం పడుతుంది. ఇక మరో ఇద్దరు సీనియర్ హీరోలు వెంకటేశ్, నాగార్జున కూడా ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నారు. నాగార్జునకు గతంలో కథలు వినిపించిన వారిలో తమిళ దర్శకుడు మోహన్‌రాజా, రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ప్రస్తుతానికి ప్రసన్న కుమార్ కథ పట్ల నాగార్జున మొగ్గు చూపారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన సంక్రాంతి సమయంలో రానున్నట్లు తెలిసింది. కాగా, గత ఏడాది రిలీజైన 'ఎఫ్ 3' తర్వాత మరో కొత్త సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లలేదు వెంకటేశ్. 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు కేవీ అనుదీప్, దర్శక–రచయిత తరుణ్ భాస్కర్ కథలు వినిపించినప్పటికీ... ఇంకా ఏ ప్రాజెక్ట్‌కీ పచ్చజెండా ఊపలేదు వెంకీ. కాగా వెంకటేశ్‌కి కథ వినిపించిన దర్శకుల జాబితాలో తాజాగా 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను పేరు కూడా చేరిందని, శైలేష్ చెప్పిన కథకు వెంకీ ఇంప్రెస్ అయ్యారని టాక్. వెంకటేశ్ నెక్ట్స్ మూవీ శైలేష్ దర్శకత్వంలోనే అనే ప్రచారం ఊపందుకుంది. ఇక ఈ నలుగురి హీరోల నెక్ట్స్ డైరెక్టర్ ఎవరో అధికారిక ప్రకటన వస్తేనే తెలుస్తుంది.

మన పవర్ ఆ రకం



విజయ్

'ఇల్లు అనేది ఇటుక, ఇసుకేరా.. వదిలేసి వెళ్లిపోవచ్చు, కుటుంబం అలా కాదుగా' అనే జయసుధ డైలాగ్‌తో 'వారసుడు' ట్రైలర్ విడుదలైంది. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వారసుడు'. తమిళంలో 'వారిసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'పవర్ సీట్లో ఉండదు సార్.. అందులో వచ్చి ఒకడు కూర్చుంటాడే వాడిలో ఉంటుంది. మన పవర్ ఆ రకం', 'గ్రౌండ్‌లో ఎంతమంది ప్లేయర్స్ అయినా ఉండొచ్చు కానీ ఆడియన్స్ అంతా ఒక్కణ్ణి మాత్రమే చూస్తారు.. ఎవరినో తెలుసా.. ఆట నాయకుణ్ణి' అని విజయ్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

అవికా ఎప్పుడో పాన్ వరల్డ్ స్టార్! - అక్కినేని నాగార్జున



మురళి గంధం, బోగేంద్ర గుప్తా, నాగార్జున, చలపతి రాజు, అవికా, సాయి రోనక్

''పాప్ కార్న్' ట్రైలర్ చాలా బాగుంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు హిట్ చేస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో అక్కినేని నాగార్జున. అవికా గోర్, సాయి రోనక్ జంటగా మురళి గంధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాప్ కార్న్'. ఎం.ఎస్. చలపతి రాజు సమర్పణలో బోగేంద్ర గుప్తా నిర్మించారు. అవికా గోర్, ఎం.ఎస్. చలపతి రాజు, శేషు బాబు పెద్దింటి సహనిర్మాతలు. ఫిబ్రవరి 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను నాగార్జున విడుదల చేసి, మాట్లాడుతూ– ''పదేళ్ల ముందు బ్రెజిల్‌లో రియో సిటీకి ఓ స్టూడియో చూద్దామని వెళ్లాను. అక్కడ అవికా గోర్ ముఖాన్ని చూశాను. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌ను స్పానిష్‌లోనూ డబ్ చేశారు. 128 దేశాల్లో 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌ను డబ్ చేశారని ఆ తర్వాత తెలిసింది. అవికా ఎప్పుడో పాన్ వరల్డ్ స్టార్ అయ్యింది. 'పాప్ కార్న్'లో హీరోయిన్‌గా నటించి, నిర్మాతగానూ మారినందుకు అభినందనలు'' అన్నారు. ''తెలుగులో నా తొలి చిత్రం 'ఉయ్యాలా జంపాలా' అన్నపూర్ణ స్టూడియోస్‌తోనే ప్రారంభమైంది. నాగార్జునగారు మంచి నిర్మాత మాత్రమే కాదు.. మంచి మనిషి కూడా. 'పాప్ కార్న్'కి నిర్మాతగా చేయటం రిస్క్ అని కొందరు అన్నారు. కానీ, ఆ రిస్క్ తీసుకోవటం గర్వంగా ఉంది'' అన్నారు అవికా గోర్.

ఇంకా మంచి కంటెంట్‌తో వస్తాం - చైతన్యా రావు



సునీల్, చైతన్యా రావు, తేజ, ఉదయ్

''మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మా 'జగమే మాయ' నిరూపించింది. ఇలానే ప్రేక్షకులు సపోర్ట్ చేస్తే ఇంకా మంచి కంటెంట్‌తో వస్తాం'' అని నటుడు చైతన్యా రావు అన్నారు. ధన్యా బాలకృష్ణ, చైతన్యా రావు, తేజ ఐనంపూడి ప్రధాన పాత్రల్లో సునీల్ పుప్పాల దర్శకత్వం వహించిన చిత్రం 'జగమే మాయ'. ఉదయ్ కోలా, శేఖర్ అన్నే నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో డిసెంబర్ 15న రిలీజైంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉదయ్ కోలా మాట్లాడుతూ– ''విడుదలైన అన్ని భాషల్లోనూ మా సినిమా టాప్ ట్రెండింగ్‌లో ఉంది'' అన్నారు. ''ఉదయ్‌గారు నన్ను బలంగా నమ్మారు. ప్రేక్షకుల ఆదరణ గొప్ప ఆనందాన్ని ఇస్తోంది'' అన్నారు సునీల్ పుప్పాల.

పెద్ద హీరోలకు రాయడం ఓ సవాల్

- రామజోగయ్య శాస్త్రి



''సింగిల్ కార్డ్ అయినా, ఒక్క పాట అయినా.. దర్శకుడు విజన్‌కి తగ్గట్టు రాయడంలోనే గేయ రచయిత గొప్పదనం ఉంటుంది'' అని పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా కొల్లి రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన సినిమా 'వీరసింహారెడ్డి'. ఈ రెండు చిత్రాలను నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. 'వీరసింహారెడ్డి' ఈ నెల 12న విడుదలవుతుండగా, 13న 'వాల్తేరు వీరయ్య' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. 'వీరసింహారెడ్డి'లో అన్ని పాటలకు, 'వాల్తేరు వీరయ్య'లోని 'నీకేమో అందమెక్కువ.. నాకేమో తొందరెక్కువ..' పాట రాసిన రామజోగయ్య శాస్త్రి చెప్పిన విశేషాలు...

- చిరంజీవి, బాలకృష్ణగార్ల ఇమేజ్ పాట రాయడానికి ఒక ఊతమిస్తుంది. కొన్ని మాటలు వాళ్ల ఇమేజ్‌కి మాత్రమే రాయగలం. 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహా రెడ్డి'... ఈ రెండు సినిమాలు ప్రేక్షకులకు విజువల్ ఫీస్ట్, మంచి మ్యూజికల్ ట్రీట్ ఇవ్వడంతో పాటు భూమ్ బద్దలు రికార్డులు సృష్టిస్తాయి. 'వీరసింహారెడ్డి'లో 'మా బావ మనోభావాలు..' పాటలో నేను ఓ చోట కనిపిస్తాను.
- పెద్ద హీరోల సినిమాలకి రాస్తున్నపుడు కొత్తగా ఏం చెప్పాలనే ఒత్తిడి, సవాల్ ఉంటుంది. నేను 'అఖండ'కి రాయలేదు.. ఆ పట్టుదలతో 'వీరసింహారెడ్డి'కి రాశాను. సింగిల్ కార్డ్ రాయడంలో ఒక సౌలభ్యం ఉంటుంది. పాటలన్నీ ఒకరే రాస్తారు కాబట్టి ఏ పాటలో ఎలాంటి మాట వాడాం, ఏ భావం చెప్పాం, ఫ్లో సరిగ్గా ఉందో లేదో చెక్ చేసుకునే చాన్స్ ఉంటుంది. ఆరు పాటలు ఆరుగురు రాస్తే ఆ కో–ఆర్డినేషన్‌ని దర్శకుడు చూసుకుంటాడు.
- గొప్ప పాట రావాలి, నెక్ట్స్ లెవెల్ కంటెంట్ కావాలంటే కొంచెం ఎక్కువ టైమ్ పడుతుంది. సంగీత దర్శకుడికి, లిరిక్ రైటర్‌కి కేంద్ర బిందువు డైరెక్టర్. ఆయన కథ, సందర్భం, విజన్‌కి తగ్గట్టు రాయాల్సి ఉంటుంది.

కాశీ యాత్ర నేపథ్యంలో...



బాలాజీ, శేఖర్ సూరి, కేటలిన్ గౌడ, మునికృష్ణ

''ఏ జర్నీ టు కాశీ' ట్రైలర్ బాగుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మన సనాతన ధర్మాన్ని మనమే కాపాడుకోవాలి'' అని దర్శకుడు శేఖర్ సూరి అన్నారు. చైతన్యా రావు, అలెగ్జాండర్ సాల్నికోవ్, ప్రియా పాల్వాయి, కేటలిన్ గౌడ ముఖ్య పాత్రల్లో మునికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏ జర్నీ టు కాశీ'. వారణాసి క్రియేషన్స్ పతాకంపై కేపీ లోకనాథ్, దొరడ్ల బాలాజీ, శ్రీధర్ వారణాసి నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో మునికృష్ణ మాట్లాడుతూ– ''కాశీ నేపథ్యంలోని ఒక కుటుంబం, కాశీ యాత్రకు సంభందించిన కథే ఈ చిత్రం. ఎంటర్‌టైన్మెంట్, ఎమోషనల్, ఫ్యామిలీ డ్రామాగా ఉంటుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో ఒక తెలుగు పాట, ఒక సంస్కృత పాట, ఒక ఇంగ్లీష్ సాంగ్ చేశాను'' అన్నారు సంగీత దర్శకుడు ఫణి కల్యాణ్. ఈ చిత్రానికి కెమెరా: గోకుల్ భారతి– శ్రీ సాయి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: తిరుపతి రెడ్డి.

సాక్షి
బిజినెస్
గురువారం
5-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	637	60,657
నిఫ్టీ ▽	190	18,043

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,494	△	107
డోజోన్స్	33,136	△	205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,585	△	31
డాక్స్	14,490	△	309
షాంఘై	3,124	△	7
నికాయ్	25,717	▽	378

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,142 △ 561
బంగారం (99.5 స్వచ్ఛత)	55,917 △ 558
వెండి (కేజీ)	69,371 △ 144

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.07	83.74
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.08	89.16
€	యూరో	ఎస్‌బీఐ	97.73	101.06
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.41	64.43
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.02	57.43
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.79	62.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.08	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.91	12.94

డిసెంబర్‌లో 'సేవలు' భేష్

6 నెలల గరిష్టానికి ఎస్‌అండ్‌పీ సూచీ



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం డిసెంబర్‌లో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. స్టాండెర్డ్ అండ్ పూర్స్ (ఎస్అండ్‌పీ) గ్లోబల్ ఇండియా సర్వీస్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఆరు నెలల గరిష్ట స్థాయిలో 58.5ను తాకింది. కొత్త ఆర్డర్లు, సానుకూల మార్కెట్ పరిస్థితులు ఈ ఫలితానికి కలిసి వచ్చాయి. పీఎంఐ ఇండెక్స్ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల సూచీ 50పైన ఉండడం వరుసగా ఇది 17వ నెల. భవిష్యత్ పట్ల కంపెనీలు ఆశావహ ధోరణితో ఉన్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. డిసెంబర్‌లో సేవల రంగంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గా వున్నట్లు వెల్లడించాయి. భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం దాదాపు 60 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే.

తయారీ స్పీడ్

ఇక భారత్ తయారీ రంగానికి సంబంధించి స్టాండెర్డ్ అండ్ పూర్స్ గ్లోబల్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) కూడా డిసెంబర్‌లో 13 నెలల గరిష్టం 57.8ని తాకింది. కొత్త ఆర్డర్లు, పటిష్ట డిమాండ్ తాజా సానుకూల ఫలితానికి కారణమని పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. పీఎంఐ వరుసగా 18 నెలల నుంచి వృద్ధిలోనే (50 పైన సూచీ) కొనసాగుతోంది. జీడీపీలో దాదాపు 15% వాటా కలిగిన పారిశ్రామిక రంగంలో తయారీ రంగం వెయిటేజ్ 65%. ఇక తయారీ, సేవలు రెండు కలిపిన ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ నవంబర్‌లో 56.7 వద్ద ఉంటే, డిసెంబర్‌లో 59.4కు ఎగసింది. డిమాండ్ పటిష్టంగా ఉన్నట్లు లిమా తెలిపారు.

ఎన్‌సీఎల్‌ఏటీలో గూగుల్‌కు ఎదురుదెబ్బ


- సీసీఐ జరిమానాపై స్టేకు నిరాకరణ
- 10 శాతం డిపాజిట్ చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జరిమానా విధించిన కేసులో టెక్ దిగ్గజం గూగుల్‌కు ఎన్‌సీఎల్‌ఏటీ (నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్)లో ఎదురుదెబ్బ తగిలింది. సీసీఐ ఆదేశాలపై మధ్యంతర స్టే విధించేందుకు ఎన్‌సీఎల్‌ఏటీ బుధవారం నిరాకరించింది. అలాగే జరిమానాలో 10 శాతాన్ని డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అటు సీసీఐకి నోటీసులు ఇవ్వడంతో పాటు మధ్యంతర స్టేపై తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ సిస్టంకు సంబంధించి దేశీయంగా గూగుల్ తన గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందనే ఆరోపణలపై సీసీఐ రూ. 1,337.76 కోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫాంను ఉపయోగించే స్మార్ట్‌ఫోన్ యూజర్లకు యాప్స్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసేందుకు, తమకు కావాల్సిన సెర్చ్ ఇంజిన్‌ను ఎంచుకునేందుకు వీలు కల్పించాలని గతేడాది అక్టోబర్‌లో సూచించింది. సీసీఐ ఆదేశాలు జనవరి 19 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, వీటిపై తక్షణం స్టే విధించాలంటూ ఎన్‌సీఎల్‌ఏటీని గూగుల్ ఆశ్రయించింది. భారతీయ యూజర్లు, డెవలపర్లు, తయారీ సంస్థలకు ఆండ్రాయిడ్‌తో గణనీయంగా ప్రయోజనాలు చేకూరాయని, భారత్ డిజిటల్‌కు మారడంలో ఇది తోడ్పడిందని పిటిషన్‌లో వివరించింది. బుధవారం జరిగిన విచారణలో గూగుల్ తరఫున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. గూగుల్ గుత్తాధిపత్య దుర్వినియోగానికి పాల్పడిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు.

టెక్నాలజీతో సాధికారత సాకారం

- భారత్‌కు కట్టుబడి ఉన్నాం
- మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల వెల్లడి
- కేంద్ర మంత్రి జైశంకర్‌తో భేటీ



న్యూఢిల్లీ: సమ్మిళిత వృద్ధి, సాధికారత లక్ష్యాల సాధనకు టెక్నాలజీని వినియోగించుకోవడం కీలకమని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల చెప్పారు. సాంకేతికత, ఆర్థిక వృద్ధి అనేవి అంతిమం కావని.. అందరి ఆకాంక్షలను నెరవేర్చే సాధనాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం న్యూఢిల్లీలో టెక్ ఫర్ గుడ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామ్‌లు, సాధనాలను ఉపయోగించి వినూత్న ప్రయోగాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వృత్తి నిపుణులతో సత్య నాదెళ్ల భేటీ అయ్యారు. సమాజంలో సానుకూల మార్పులను తీసుకొచ్చేందుకు వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. భారత్‌లో పెట్టుబడులకు మైక్రోసాఫ్ట్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. 'మేకిన్ ఇండియా గురించి మాట్లాడుకుంటే భారత్‌లో మాకు భారీ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. డేటా సెంటర్లు ఉన్నాయి. దాదాపు అన్ని అప్లికేషన్లలో ఉపయోగిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ)లో ఎంతో కొంత భారత్ నుంచి వచ్చినదే అయి ఉంటోంది' అని నాదెళ్ల చెప్పారు. ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు టెక్నాలజీ దోహదపడాలన్నది తమ ఆకాంక్షని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు తదితరులు షోకేస్ చేస్తున్న ప్రాజెక్టుల గురించి నాదెళ్ల అడిగి తెలుసుకున్నారు. సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వారి ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చారు. మరోవైపు, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌తో నాదెళ్ల భేటీ అయ్యారు. డిజిటల్ రంగంలో గవర్నెన్స్, సెక్యూరిటీ వంటి అంశాలపై చర్చించారు. భారత్‌లో నాలుగు రోజుల పాటు పర్యటిస్తున్న నాదెళ్ల మంగళవారం ముంబైలో జరిగిన మైక్రోసాఫ్ట్ ఫ్యూచర్ రెడీ లీడర్‌షిప్ సమిట్ కార్యక్రమంలో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఈ వారంలో ఆయన హైదరాబాద్, బెంగళూరు కూడా సందర్శించనున్నారు.

'నీలిట్'తో మైక్రోసాఫ్ట్ జట్టు..

ఉద్యోగార్థులకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించే దిశగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్)తో మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ ఒప్పందం కింద ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో నీలిట్‌కి చెందిన 30 ట్రెయినింగ్ సెంటర్లలో 3,500 మందికి సైబర్ శిక్షా, రెడీ4సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌లలో శిక్షణనిస్తారు. ఇది పూర్తి చేసుకున్న వారికి సైబర్‌సెక్యూరిటీలో ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగావకాశాలు లభించగలవు.

సాహ్ పాలిమర్స్ ఐపీవో సక్సెస్

రిటైల్ ఇన్వెస్టర్ల క్యూ • 17 రెట్లు అధిక స్పందన

న్యూఢిల్లీ: సాహ్ పాలిమర్స్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు బుధవారానికల్లా 17.46 రెట్లు అధికంగా స్పందన లభించింది. కంపెనీ 56.1 లక్షల షేర్లను ఆఫర్ చేయగా.. 9.79 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 39.8 రెట్లు అధిక దరఖాస్తులు వచ్చాయి. సంస్థాగతేతర విభాగంలో 32.7 రెట్ల బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 61-65 ధరలో కంపెనీ ఐపీవో చేపట్టింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-1-2023	
విశాఖ	555-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
4-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	541-00
వరంగల్	543-00
రిటైల్ ధర	6.00

కొత్త ఏడాదిలో తొలి నష్టం

- ఫెడ్ మినిట్స్ వెల్లడి ముందు ఇన్వెస్టర్ల అప్రమత్తత
- అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి
- అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలే
- సెన్సెక్స్ 637 పాయింట్ల పతనం
- 18,150 దిగువకు నిఫ్టీ



ముంబై: అమెరికా ఫెడ్ రిజర్వ్ మినిట్స్ వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో భారత స్టాక్ మార్కెట్ కొత్త ఏడాదిలో తొలిసారి నష్టాలతో ముగిసింది. విదేశీ ఇన్వెసర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండడం, ప్రపంచ మార్కెట్లలోని బలహీనతలు సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 637 పాయింట్లు క్షీణించి 60,657 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 190 పాయింట్లు నష్టపోయి 18,043 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండురోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడినట్లైంది. సెన్సెక్స్ సూచీలో మారుతీ సుజుకీ, టీసీఎస్ షేర్లు మాత్రమే లాభపడగా, మిగిలిన అన్ని దెబ్బతిన్నాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఒడిదుడుకులతో మొదలై చివరి వరకు అదే ధోరణిలో కొనసాగాయి. ఒక దశలో సెన్సెక్స్ 700 పాయింట్లు కోల్పోయి 61,294 వద్ద, నిఫ్టీ 212 పాయింట్లు క్షీణించి 18,021 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. మిడ్ సెషన్ తర్వాత కోలుకునే ప్రయత్నం చేసినప్పటికీ.., చివర్లో మరోసారి అమ్మకాలు తలెత్తడంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. విస్తృత స్థాయి మార్కెట్లో అమ్మకాలతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.97%, 0.79% చొప్పున నష్టపోయాయి. అధిక ద్రవ్యోల్బణం, మాంద్యం భయాలతో టెస్లా, యాపిల్‌తో సహా టెక్నాలజీ షేర్లలో విక్రయాలు తలెత్తడంతో అమెరికా మార్కెట్లు ఈ ఏడాది తొలి ట్రేడింగ్ సెషన్(మంగళవారం)లో అరశాతానికి పైగా నష్టపోయాయి. అక్కడి నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఒకశాతానికి పైగా నష్టపోవడంతో ఇన్వెస్టర్లు రూ.2.91 లక్షల కోట్ల సంపద కోల్పోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2621 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.774 కోట్ల షేర్లను కొన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు దిగిరావడంతో రూపాయి విలువ చరిత్రాత్మక కనిష్ట స్థాయి నుంచి కోలుకుంది. డాలర్ మారకంలో 23 పైసలు బలపడి 82.77 స్థాయి వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ షేర్లు తొలిరోజే అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్నాయి. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.94.00)తో పోలిస్తే 5.63శాతం లాభంతో రూ.99.30 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ అనిశ్చితుల్లోనూ ఈ షేరుకు డిమాండ్ లభించడంతో ట్రేడింగ్‌లో 24.14 శాతం బలపడి రూ.116.70 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. చివర్లో లాభాల స్వీకరణ కారణంగా 11.38% లాభంతో రూ.104.70 వద్ద స్థిరపడింది. మార్కెట్ ముగిసే సరికి కంపెనీ విలువ రూ.1,117.23 కోట్లుగా నమోదైంది.
- మెటల్, రియల్టీ, యుటిలిటీ, ఇంధన, ఆయిల్-గ్యాస్, విద్యుత్ రంగాల సూచీలు వరుసగా మూడు నుంచి 1.50% క్షీణించాయి. మరోవైపు బడ్జెట్‌పై ఆశలతో బీమా, ఫెర్టిలైజర్, వినిమయ, వ్యవసాయ ఆధారిత రంగాల షేర్లు రాణించడంతో విశేషం.

రిలయన్స్ కిట్టీలో సోస్యో డ్రింక్

- 50 శాతం వాటా కొనుగోలు
- గుజరాత్‌లో తయారీ ప్లాంటు
- ప్రస్తుత ప్రమోటర్లవద్ద మిగిలిన వాటా



న్యూఢిల్లీ: కార్బొనేటెడ్ పానీయాల కంపెనీ సోస్యో హజూరీ బెవరేజెస్‌లో రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ 50 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఈ గుజరాత్ కంపెనీలో మిగిలిన 50 శాతం వాటాను ప్రస్తుత ప్రమోటర్లు హజూరీ కుటుంబం కలిగి ఉంటుందని డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ తాజాగా తెలియజేసింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. తాజా కొనుగోలుతో పానీయాల విభాగం మరింత బలపడనున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎఫ్ఎంసీజీ అనుబంధ సంస్థ రిలయన్స్ కన్జూమర్ పేర్కొంది. శత వసంతాల పురాతన కంపెనీ సోస్యో కార్బొనేటెడ్ పానీయాలు, జ్యూస్‌ల తయారీలో ఉంది. కాగా.. ఇప్పటికే రిలయన్స్ రిటైల్ సుప్రసిద్ధ బ్రాండ్ క్యాంపాకోలాను సొంతం చేసుకోవడం తెలిసిందే.

1923లోనే..: సోస్యో హజూరీ బెవరేజెస్‌ను 1923లో అబ్బాస్ అబ్దుల్‌రహీమ్ హజూరీ ఏర్పాటు చేశారు. గుజరాత్‌లో తయారీ యూనిట్ ఉంది. ప్రధాన బ్రాండ్ సోస్యో పేరుతో గుజరాత్‌తోపాటు పొరుగు రాష్ట్రాలలోనూ పానీయాలు విక్రయిస్తోంది. పానీయాలను యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియాకు ఎగుమతి చేస్తోంది. తాజా పెట్టుబడి ద్వారా స్థానిక హెరిటేజ్ బ్రాండ్లకు మరింత ప్రాచుర్యాన్ని కల్పించడంతోపాటు.. వృద్ధి అవకాశాలకు తెరతీయనున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ పేర్కొన్నారు.

భవిత

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఫార్మసీతో 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కొలువు

ఫార్మసీ పూర్తిచేసిన అభ్యర్థులకు శుభవార్త. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- **అర్హతలు:** డిగ్రీ(ఫార్మసీ/ఫార్మాస్యూటికల్ సైన్స్), ఫార్మాడీ లేదా మెడికల్(క్లినికల్ ఫార్మకాలజీ/మైక్రోబయాలజీ స్పెషలైజేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2022 నాటికి 18-44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనాలు:** ప్రతి నెల రూ.51,320-రూ. 1,27,310 వరకు వేతనంగా లభిస్తుంది.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ధృవపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష:** ఈ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం 450 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 300 నిమిషాలు.
- **పేపర్-1:** ఈ పేపర్‌లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ నుంచి ప్రశ్నలుంటాయి. 150 ప్రశ్నలకు 150 మార్కులుంటాయి. పరీక్ష సమయం 150 నిమిషాలు.
- **పేపర్-2:** ఈ పేపర్‌లో సంబంధిత సబ్జెక్ట్‌కు సంబంధించిన డిగ్రీ స్థాయి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కుల చొప్పున మొత్తం 300 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు. -పేపర్-1 పరీక్షను ఇంగ్లిష్/తెలుగు మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పేపర్-2 పరీక్ష మాత్రం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.
- **పరీక్ష కేంద్రాలు:** రాత పరీక్షకు సంబంధించి పరీక్ష కేంద్రాలు కేవలం హైదరాబాద్ పరిధిలో(హెచ్ఎండీఏ) మాత్రమే ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 05.01.2023
- **వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

టీఎస్‌పీఎస్సీ-ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 544 పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. అసిస్టెంట్ ప్రొఫెసర్లు(లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 544
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్లు(లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు.
- **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** ఇంగ్లీష్-23, తెలుగు-27, ఉర్దూ-02, సంస్కృతం-05,స్టాటిస్టిక్స్-23, మైక్రో బయాలజీ-05,బయోటెక్నాలజీ-09, అప్లైడ్ న్యూట్రిషన్-05, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-311,బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-39, కామర్స్ బిజినెస్ అనలిటిక్స్-08,డైరీ సైన్స్-08, క్రాప్ ప్రొడక్షన్-04,డేటాసైన్స్-12, ఫిషరీస్-3, కామర్స్ విదేశీ వాణిజ్యం-01, కామర్స్ ట్యాక్సేషన్-06, ఫిజికల్ డైరెక్టర్-29, లైబ్రేరియన్-24.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 31.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.02.2023.
- **వెబ్‌సైట్:** tspsc.gov.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్, బొల్లారంలో 63 టీచింగ్ పోస్టులు

సికింద్రాబాద్ బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయ(రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 63 ▪ **పోస్టుల వివరాలు:** పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్-15, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్-25, ప్రైమరీ టీచర్-23.
- **సబ్జెక్టులు:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేటిక్స్ ప్రాక్టీసెస్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ, హోమ్ సైన్స్, సైకాలజీ, పెయింటింగ్/ఫైన్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, డ్యాన్స్, హిందీ, సంస్కృతం తదితరాలు.
- **అర్హత:** డిగ్రీ, పీజీ, బీఈడీ, బీఈఎల్‌ఈడీ, డీఈఎల్‌ఈడీ ఉత్తీర్ణతతోపాటు సీటెట్/టెట్ అర్హత సాధించి ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** దరఖాస్తును ప్రిన్సిపాల్, ఆర్మీ పబ్లిక్ స్కూల్ బొల్లారం, జేజే నగర్, సికింద్రాబాద్ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023.
- **వెబ్‌సైట్:** apsbolarum.edu.in

కాకినాడ జిల్లాలో అకౌంటెంట్ పోస్టులు

కాకినాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** సీఏ/సీఎంఏ, ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** దరఖాస్తును జాయింట్ కలెక్టర్, ఈవోఈడీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్, కలెక్టరేట్ కాంపౌండ్, కాకినాడ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 19.01.2023.
- **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

నీట్-యూజీ.. ఇలా ఈజీ !

ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇంటర్మీడియెట్ బైపీసీ చదువుతున్న లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరాలని, వైద్య వృత్తిలో స్థిరపడాలని కలలు కనే వారి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. అలాంటి విద్యార్థులంతా తమ స్వప్నం సాకారం చేసుకునేందుకు..అడుగులు వేయాల్సిన తరుణం వచ్చింది! కారణం.. దేశ వ్యాప్తంగా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే.. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-యూజీ-2023 పరీక్ష తేదీ ఖరారు కావడమే! నీట్-యూజీ-2023.. మే 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది! ఈ నేపథ్యంలో.. నీట్-యూజీ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్..

» మే 7న నీట్-యూజీ 2023 ఎంట్రన్స్
» షెడ్యూల్ ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ
» ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్
» ప్రణాళికబద్ధ ప్రిపరేషన్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు



నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్.. నీట్‌గా సుపరిచితమైన ప్రవేశ పరీక్ష. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్‌తోనే ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వంటి వైద్య కోర్సుల్లో ప్రవేశం లభిస్తోంది. అందుకే ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతుంటారు. అలాంటి వారంతా.. ఇప్పటి నుంచి నీట్ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి.

పోటీ తీవ్రం

- ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూప్ అర్హతగా నిర్వహించే నీట్‌కు జాతీయ స్థాయిలో లక్షల సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. గత ఏడాది 17,64,571 మంది ఈ పరీక్ష రాశారు. జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న దాదాపు 96 వేల ఎంబీబీఎస్, 28 వేల వరకు బీడీఎస్, 52 వేలకు పైగా ఆయుష్ కోర్సుల సీట్లకు పోటీ తీవ్రంగా ఉంది.
- తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 65,305 మంది; తెలంగాణ నుంచి 59,296 మంది గతేడాది ఈ పరీక్షకు హాజరయ్యారు. తెలంగాణలో 6,690, ఆంధ్రప్రదేశ్‌లో 5,485 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అదే విధంగా ఏపీలో 1400, తెలంగాణలో 1300 బీడీఎస్ సీట్లు ఉన్నాయి.
- ఈ సీట్లను నీట్ యూజీ స్కోర్ ఆధారంగా ఆల్ ఇండియా కోటా,స్టేట్ కోటా విధానంలో భర్తీ చేస్తారు. ఆల్ ఇండియా కోటా విధానంలో.. అన్ని రాష్ట్రాల్లోని 15 శాతం సీట్లకు జాతీయ స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. స్టేట్ కోటా విధానంలో..రాష్ట్ర స్థాయిలో ఆల్ ఇండియా కోటాకు బదిలీ అయిన సీట్లను మినహాయించి.. మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

నాలుగు సబ్జెక్టులు.. 720 మార్కులు

నీట్ పరీక్షను నాలుగు సబ్జెక్టులలో 720 మార్కులకు నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. వివరాలు..

సబ్జెక్ట్	సెక్షన్	ప్రశ్నలు	మార్కులు
ఫిజిక్స్	సెక్షన్-ఎ	35	140
	సెక్షన్-బి	15	40
కెమిస్ట్రీ	సెక్షన్-ఎ	35	140
	సెక్షన్-బి	15	140
బోటనీ	సెక్షన్-ఎ	35	140
	సెక్షన్-బి	15	40
జువాలజీ	సెక్షన్-ఎ	35	140
	సెక్షన్-బి	15	40
మొత్తం మార్కులు			720

- ప్రతి సబ్జెక్ట్‌లోనూ సెక్షన్-బిలోని 15 ప్రశ్నలకు గాను పదింటికి సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. అంటే..సెక్షన్-బిలో ఛాయిస్ వెసులుబాటు ఉంది.
- ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత పడుతుంది.
- వాస్తవానికి ఛాయిస్ విధానాన్ని 2021లో అందుబాటులోకి తెచ్చారు. గత ఏడాది కూడా దీన్ని కొనసాగించారు. ఈ ఏడాది కూడా ఛాయిస్ విధానంతోనే పరీక్ష నిర్వహించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సన్నద్ధతకు తగినంత సమయం

నీట్ యూజీ-2023ని మే 7న నిర్వహించనున్నారు. ఈ తేదీని పరిగణనలోకి తీసుకుంటే.. విద్యార్థులకు తగినంత సమయం అందుబాటులో ఉందని చెప్పొచ్చు. మార్చి చివరి నాటికి ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత నీట్ పరీక్ష తేదీకి దాదాపు 40 రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవధిలో పూర్తిగా నీట్ ప్రిపరేషన్, రివిజన్, మాక్ టెస్టులకు హాజరు వంటి వ్యూహాలు అనుసరిస్తే..మెరుగైన స్కోర్ సాధించే అవకాశముంది.

ప్రతి సబ్జెక్ట్‌లో 130-140 మార్కులు లక్ష్యంగా

- నీట్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు.. ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను 130 నుంచి 140 మార్కులు సాధించేలా సిలబస్ అంశాలను ఔపోసన పట్టాలి. అప్పుడే సీటు సాధించేలా మెరుగైన ర్యాంకు సొంతమవుతుంది. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దిష్ట సమయాన్ని కేటాయించుకుని అధ్యయనం సాగించాలి.
- బోర్డ్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌లను సమన్వయం చేసుకుంటూ చదవాలి.
- బోర్డ్ పరీక్షలు ముగిశాక.. నీట్ సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లకు సమయం కేటాయిస్తూ ప్రిపరేషన్ చేయాలి. స్వీయ సామర్థ్యాలపై స్పష్టతతో వ్యవహరించాలి.
- వీలైనంత మేరకు రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి.
- ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని.. దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. ప్రతి రోజు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ ప్రశ్నలనే ఎక్కువగా అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్టులను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- 2023, మే 7న నీట్ యూజీ పరీక్ష. • మార్చి రెండో వారంలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం.
- పెన్-పేపర్ విధానంలో మూడు గంటల వ్యవధిలో 720 మార్కులకు పరీక్ష.
- నీట్ స్కోర్ ఆధారంగానే ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, వెటర్నరీ సైన్స్ కోర్సుల సీట్ల భర్తీ.
- **అర్హత:** బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నీట్‌కు ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణత అర్హతగా పేర్కొన్నప్పటికీ.. ప్రవేశాల సమయంలో కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు బైపీసీ గ్రూప్ సబ్జెక్ట్‌లలో 50 శాతం మార్కులు ఉండాలనే నిబంధన విధిస్తున్నాయి.

సబ్జెక్ట్ వారీగా సన్నద్ధత ఇలా

ఫిజిక్స్.. ప్రాక్టీస్‌తోనే విజయం

ఫిజిక్స్‌లో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి.అవకలనం,సమాకలనం, అనువర్తనాలపై పట్టు సాధించాలి.

-రవీంద్ర, ఫిజిక్స్ ఫ్యాకల్టీ

కాన్సెప్ట్స్, రివిజన్ ప్రధానంగా

కెమిస్ట్రీలో విద్యార్థులు ఆయా విభాగాలకు సంబంధించిన కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. దీంతో నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను వాటి వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి.

-కృష్ణ, కెమిస్ట్రీ ఫ్యాకల్టీ

బోటనీ.. విభిన్నంగా

బోటనీకి సంబంధించి.. ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. అన్ని అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై దృష్టిపెట్టడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్స్ అండ్ ఫంక్షన్స్‌లో కణవిభజన (సమ విభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు.మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌పై దృష్టిపెట్టాలి.

- బి.రాజేంద్ర, బోటనీ ఫ్యాకల్టీ

జువాలజీ.. ప్రీవియస్, మోడల్ పేపర్స్

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు విద్యార్థులు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనిటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతోపాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి గత ప్రశ్న పత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో అడిగే ప్రశ్నలను సాధన చేయాలి. ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి.

-కె.శ్రీనివాసులు, జువాలజీ ఫ్యాకల్టీ.


శ్రీకాకుళం జిల్లా హిరమండలం దాసుమానుగూడలో లబ్ధిదారులకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


నంద్యాల జిల్లా గాజులపల్లెలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం


తూర్పు గోదావరి జిల్లా దుప్పలపూడిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


కృష్ణా జిల్లా అవనిగడ్డలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

స్టెమ్ కోర్సుల్లో మహిళల ముందడుగు

ఐష్ నివేదిక ప్రకారం ఐదేళ్లలో చేరిన మహిళలు 2 కోట్లమంది



- ఐఐటీ, ఎన్‌ఐటీల్లో మహిళల చేరికలు 8 నుంచి 22 శాతానికి పెరుగుదల
- ప్రభుత్వ ప్రత్యేక కోటాతో ఫలితాలు
- దేశంలో స్టెమ్ గ్రాడ్యుయేట్లలో మహిళల శాతం 43
- అమెరికాలో 34 శాతం, బ్రిటన్‌లో 38 శాతమే

సాక్షి, అమరావతి: ఒకప్పుడు సంప్రదాయ కోర్సులకే పరిమితమవుతూ వచ్చిన మహిళలు ఇప్పుడు సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి సాంకేతిక, వృత్తిపరమైన కోర్సులవైపు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్‌తో కూడిన స్టెమ్ (ఎస్‌టీఈఎం) కోర్సుల్లో వారి చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆలిండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐష్) కొద్దికాలం కిందట విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత ఐదేళ్లలో స్టెమ్ కోర్సుల్లో మహిళల సంఖ్య భారీగా పెరిగింది. సాంకేతిక విద్యాకోర్సులు అమలవుతున్న ఐఐటీలు, ఎన్‌ఐటీలు తదితర జాతీయ విద్యాసంస్థల్లో వీరి చేరికల శాతం 2016–17లో 8 మాత్రమే ఉండగా 2020–21 నాటికి 20కి పెరిగింది. 2021–22 విద్యాసంవత్సరంలో ఇది 22.1 శాతానికి చేరింది. సాంకేతిక విద్యాకోర్సుల్లో మహిళల చేరికలను పెంచేందుకు కేంద్రప్రభుత్వం కూడా వారికోసం 2017 నుంచి సూపర్ న్యూమరరీ కోటాను ప్రవేశపెట్టింది. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరుతోపాటు అర్హత సాధించడంలోను మహిళల శాతం తక్కువగా ఉండేది. దీనివల్ల ఐఐటీల్లో వారిసంఖ్య స్వల్పంగా ఉండేది. సూపర్ న్యూమరరీ కోటాను పెట్టడంతో గత ఐదేళ్లలోనే వారి చేరికలు 20 శాతానికి పెరిగాయి. ఎన్‌ఐటీల్లో అయితే వారి చేరికలు 23 శాతంగా ఉండడం గమనార్హం. ఐఐటీల్లో 2017లో చేరిన మహిళలు 995 మందే కాగా 2021లో ఆ సంఖ్య 2,990కి చేరింది.

స్టెమ్ కోర్సుల వైపు చూపు

మహిళలు సాంకేతిక, వృత్తిపరమైన కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్క ఐఐటీలు, ఎన్‌ఐటీల్లోనే కాకుండా ఇతర సంస్థల్లోను స్టెమ్ కోర్సులకు వారు ప్రాధాన్యమిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీలతో పాటు ప్రైవేటు వర్సిటీల్లోను ఈ కోర్సుల్లో మహిళల చేరికలు పెరిగినట్లు ఐష్ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. 2017లో స్టెమ్ కోర్సుల్లో చేరిన మహిళలు 41.97 లక్షల మందికాగా 2021 నాటికి ఆ సంఖ్య 43.87 లక్షలకు చేరినట్లు ఐష్ నివేదిక పేర్కొంది. సంప్రదాయ కోర్సుల్లో కన్నా స్టెమ్ కోర్సుల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండడమే ఈ కోర్సుల వైపు వారు దృష్టి కేంద్రీకరించడానికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇతర దేశాల్లో కన్నా ఇండియాలోనే చేరికలు అధికం

ఇతర దేశాల్లో కన్నా మన దేశంలోనే స్టెమ్ కోర్సుల్లో మహిళల చేరికలు అత్యధికంగా ఉన్నాయని ప్రపంచబ్యాంకు గతంలో విడుదల చేసిన నివేదికలో విద్యారంగానికి సంబంధించిన గణాంకాల్లో తెలిపింది. స్టెమ్ కోర్సుల గ్రాడ్యుయేట్లలో మహిళల శాతం ఇండియాలో 43 కాగా అమెరికాలో 34, బ్రిటన్‌లో 38, కెనడాలో 31 మాత్రమేనని వివరించింది. మన దేశంలో గత ఐదేళ్లలో స్టెమ్ కోర్సుల్లో రెండు కోట్ల మంది వరకు మహిళలు చేరినట్లు ఐష్ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఐదేళ్లలో మహిళల చేరికల్లో రాష్ట్రాల వారీగా చూస్తే 30.80 లక్షల మందితో తమిళనాడు ప్రథమ స్థానంలో, 24.65 లక్షల మందితో ఉత్తరప్రదేశ్ ద్వితీయ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం గ్రాడ్యుయేట్లలో 32.2 శాతం మంది మహిళలున్నారు. 2014తో పోలిస్తే మహిళల చేరికలు గణనీయంగా పెరిగాయి. 2014లో గ్రాడ్యుయేట్లలో 26.9 శాతం మంది మాత్రమే మహిళలున్నారు.

రేపటినుంచి సదరం స్లాట్ బుకింగ్

- గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు
- జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు స్లాట్‌లు

సాక్షి, అమరావతి: సదరం ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు స్లాట్ బుకింగ్‌లు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు స్లాట్‌లు అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ 171 ప్రభుత్వాస్పత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి శాశ్వత ధ్రువీకరణ పత్రాలిస్తారు.

గత ఏడాది 94,646 మందికి సర్టిఫికెట్లు

గత ప్రభుత్వ హయాంలో మొక్కుబడిగా 56 ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులు నిర్వహించారు. దీనికి తోడు స్లాట్‌లు కూడా తక్కువ ఉండేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితికి స్వస్తి చెప్పింది. సచివాలయాల్లోనే స్లాట్ బుకింగ్‌లకు అవకాశం కల్పించింది. ఆస్పత్రుల సంఖ్యను 171కి పెంచింది. దీంతో టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రజలకు ఇప్పుడు సులువుగా సదరం సేవలు లభిస్తున్నాయి.

రాజవొమ్మంగి పీహెచ్‌సీని తనిఖీచేసిన 'ఢిల్లీ' బృందం

- అన్నీ సక్రమంగా ఉంటే పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేట్
- ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి రూ.లక్ష చొప్పున మూడేళ్ల పాటు నిధులు
- ఆస్పత్రి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన బృందం


రాజవొమ్మంగి పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఢిల్లీకి చెందిన జాతీయ ఆరోగ్య భద్రత ప్రమాణాల పరిశీలన బృందం తనిఖీ చేసింది. బృందంలో త్రిపుర రాష్ట్రానికి చెందిన ప్రిన్సిపల్ అస్యూరన్సర్ డాక్టర్ అలక్‌దాస్, వెస్ట్ బెంగాల్‌కు చెందిన అసిస్టెంట్ అస్యూరన్సర్ డాక్టర్ రంజిత్‌కుమార్‌లున్నారు. ఈ తనిఖీలు గురువారం కూడా కొనసాగుతాయని బృందంతో పాటు వచ్చిన జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ డాక్టర్ రాకేశ్ తెలిపారు. తనిఖీలు పూర్తయ్యాక కేంద్ర ప్రభుత్వానికి బృందం సభ్యులు నివేదిస్తారని చెప్పారు. అన్నీ సక్రమంగా ఉంటే రాజవొమ్మంగి పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేట్‌తో పాటు, ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి రూ.లక్ష చొప్పున మూడేళ్ల పాటు రూ.3 లక్షలు మంజూరవుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అనేక సదుపాయాలు, పేదలకు కార్పొరేట్ స్థాయి సత్వర సేవలు అందిస్తుండటంతో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేట్ కోసం కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున లేఖ రాసినట్టు తెలిపారు. లేఖలో సూచించినట్టు పీహెచ్‌సీలో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ స్థాయి బృందం పరిశీలిస్తోందని డాక్టర్ రాకేశ్ వివరించారు. రోగులకు అందుతున్న తాగునీరు, బర్త్ వెయిటింగ్ రూమ్‌లో గర్భిణులకు అందుతున్న సేవలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, చికిత్సకు ముందు రోగి కుటుంబానికి కౌన్సెలింగ్, పరిసరాల పరిశుభ్రత, ఔట్ పేషెంట్ల రిజిస్టర్, రికార్డులు, ఆపరేషన్ థియేటర్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రి పనితీరు పట్ల బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారని డాక్టర్ రాకేశ్ వివరించారు.

క్లుప్తంగా...

రాజకీయాలకు ఎస్‌ఎం కృష్ణ గుడ్‌బై

వయసు రీత్యానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

శివాజీనగర: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత ఎస్‌ఎం కృష్ణ క్రియాశీల రాజకీయాలకు 'గుడ్‌బై' చెప్పారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రకటించారు. 'రాజకీయాలకు ఇక దూరంగా ఉంటాను. 90 ఏళ్ల వయసులో 50 ఏళ్ల వ్యక్తిలా నటించడం సాధ్యం కాదు. అందుకే ప్రజల్లోకి రావడం కూడా తగ్గించాను' అని తెలిపారు. బీజేపీలో నిర్లక్ష్యానికి గురయ్యారా? అని మీడియా ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదని ఆయన బదులిచ్చారు. వయసు రీత్యానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా, కర్ణాటకలోని మాండ్య జిల్లా మద్దూరులోని రైతు కుటుంబంలో జన్మించిన ఎస్‌ఎం కృష్ణ.. బెంగళూరు, అమెరికాలోని పలు ప్రముఖ యూనివర్సిటీల్లో విద్యనభ్యసించారు. న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. 1962లో మద్దూరు నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి.. పలుమార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1989 నుంచి 1993 వరకు అసెంబ్లీ స్పీకర్‌గా, అనంతరం డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. 1999లో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన ఎస్‌ఎం కృష్ణ 2004 వరకు ఆ పదవిలో కొనసాగారు. యూపీఏ హయాంలో కేంద్ర విదేశాంగ మంత్రిగా పనిచేసిన ఆయన 2017లో బీజేపీలో చేరారు.

కందిపప్పు, పంచదార పంపిణీకి సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు కందిపప్పు, పంచదార సరఫరాకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. పండుగలను దృష్టిలో పెట్టుకుని ముందుగానే తగినంత సరుకును మండల నిల్వ కేంద్రాల(ఎంఎల్‌ఎస్)కు తరలిస్తోంది. ఇప్పటి వరకు 9,573 టన్నుల కందిపప్పు, 6,769 టన్నుల పంచదార అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలోని 1.46 కోట్ల రైస్ కార్డుదారులకు ప్రభుత్వం రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదారను సరఫరా చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 29,794 రేషన్ దుకాణాలుండగా 9,260 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే నిత్యావసరాలను సరఫరా చేస్తోంది. సగటున నెలకు కందిపప్పు 6 వేల టన్నులు, పంచదార 5 వేల టన్నుల వరకు అవసరం అవుతుంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం రేషన్ దుకాణాలకు 70 శాతం పంపిణీని పూర్తి చేసింది.

ఆగస్ట్ నాటికి మిల్లుల్లో డ్రయర్లు ఏర్పాటు చేయాలి

మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశం

సాక్షి, అమరావతి: ఏపీలోని మిల్లర్లు జూలై, ఆగస్టు నాటికి ఆరబోత యంత్రాలు (డ్రయర్లు) తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) మిల్లుల యజమానులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట కోత సమయంలో అకాల వర్షాలు సాధారణమని, ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించడానికి, త్వరగా మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం అందించేందుకు డ్రయర్లను వినియోగించాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం విడుదల చేస్తోన్న మిల్లింగ్ చార్జీలను ఉపయోగించుకోవాలన్నారు. డ్రయర్ ఏర్పాటు చేయని మిల్లును సీఎంఆర్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

యువ రచయితలకు శిక్షణ

సాక్షి, అమరావతి: దేశ ఔన్నత్యం, పురోగతి, భవిష్యత్ తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేసే రచనలను ప్రోత్సహించేందుకు.. యువ రచయితలకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ద్వారా శిక్షణ ఇప్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం యువ మెంటార్‌షిప్ స్కీమ్ కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా 30 ఏళ్లు అంతకన్నా తక్కువ వయసున్న యువ రచయితల నుంచి 75 మందిని గుర్తించి శిక్షణ అందించనున్నారు. గతం, వర్తమానం, భవిష్యత్‌ను కలుపుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి వివిధ కోణాల్లో రచనలు చేయాల్సి ఉంటుంది. వారు రచించే పుస్తకాలను నేషనల్ బుక్ ట్రస్టు ద్వారా ముద్రణ చేయించి దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తారు. కాగా, రచయితల ఎంపికకు 2022 అక్టోబర్ 2 నుంచి నవంబర్ 30 వరకు ఆన్‌లైన్‌లో జాతీయ పోటీ నిర్వహించారు. దీని గురించి అన్ని విద్యాసంస్థలు విద్యార్థులకు తెలియజేయాలని సూచించింది. ఎంపికైన 75 మంది రచయితలకు 6 నెలల పాటు నెలకు రూ.50 వేల చొప్పున స్కాలర్‌షిప్ చెల్లించనున్నారు. https:// innovateindia. mygov. in/ yuva/ను సందర్శించాలని సూచించింది.

బడి బయటి పిల్లలంతా బడుల్లోకి

▶ మొదటి పేజీ తరువాయి

పెరగడమే కాకుండా డ్రాపవుట్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

డ్రాపవుట్లకు చెల్లుచీటీ

రాష్ట్రంలోని బడిఈడు పిల్లలందరినీ స్కూళ్లలోకి తిరిగి చేర్పిస్తున్న నేపథ్యంలో పిల్లల డ్రాపవుట్లు తగ్గాయి. ప్రాథమిక స్థాయిలో సున్నా స్థాయికి ఈ డ్రాపవుట్లు తగ్గిపోవడం విశేషం. ప్రాథమికోన్నత తరగతుల్లో గతంలో కన్నా తగ్గి 2021–22 నాటికి 1.62 శాతానికి డ్రాపవుట్లు పడిపోయాయి. ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలతో 2022–23లో మరింత తగ్గుతాయని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. సెకండరీ తరగతుల్లో ఒకప్పుడు 22 శాతంగా ఉన్న డ్రాపవుట్ రేటు 2022–23లో భారీగా దిగువకు తగ్గుతోందని వివరించాయి.

ఇంటర్మీడియెట్‌లోనూ పెరిగిన చేరికలు..

ప్రభుత్వ చర్యలతో 1వ తరగతి నుంచి 10వ తరగతి ఉన్న స్కూళ్లలో చేరికలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియెట్ స్థాయిలోనూ విద్యార్థుల చేరికల శాతం పెరుగుతోంది. గత ఐదేళ్ల గణాంకాలు పరిశీలిస్తే ఈ అంశాలు స్పష్టమవుతున్నాయి. 2018–19లో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికల సంఖ్య 78,61,899 వరకు ఉండగా 2019–20 నాటికి ఈ సంఖ్య 83,23,103కి చేరింది. ఒక్క ఏడాదిలోనే 4,61,204 మంది అదనంగా చేరడం విశేషం. వీరిలో ఇంటర్మీడియెట్‌లో పెరిగిన విద్యార్థుల సంఖ్య 1.5 లక్షల వరకు ఉండడం గమనార్హం. ఇక 2020–21లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య 84,10,924కు చేరింది. 2021–22లో ఆ సంఖ్య 82,44,647 గా ఉంది. కరోనా తదితర కారణాలతో చాలాకాలం స్కూళ్లు తెరవకపోవడంతో అనేక మంది స్కూళ్లకు రాలేదు. దాంతో 2021–22లో ప్రవేశాల సంఖ్య తగ్గింది. 2022–23నాటికి మళ్లీ ఆ సంఖ్య పెరిగినట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన తుది విడత గణాంకాల క్రోడీకరణ జరుగుతోందని, త్వరలోనే అవి విడుదలవుతాయని చెబుతున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ చైల్డ్ ఇన్ఫో కింద సేకరిస్తున్న గణాంకాల ప్రకారం.. 2022–23 విద్యా సంవత్సరంలో ప్రాథమిక తరగతుల నుంచి ఇంటర్మీడియెట్ వరకు 84 లక్షలకుపైగా చేరికలున్నట్లుగా తెలుస్తోంది. ఈ విద్యార్థుల్లో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీలే కావడం గమనార్హం. మొత్తం విద్యార్థుల్లో 78 శాతం ఈ వర్గాల విద్యార్థులే.

ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- జీఐఎస్ వెబ్‌సైట్ ప్రారంభించి, బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు గుడివాడ, బొత్స
- మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహణకు ఏర్పాట్లు
- 12 రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా వివిధ దేశాలు, నగరాల్లో రోడ్‌షోలు


మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్ చిత్రంలో మంత్రి బొత్స తదితరులు

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 (జీఐఎస్) రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సచివాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జీఐఎస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కీలకమైన 12 రంగాల్లో దేశీయ, విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించేవిధంగా ఈ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగే ఈ సమ్మిట్‌కు సంబంధించిన లోగోను ఇప్పటికే సీఎం ఆవిష్కరించారని గుర్తుచేశారు. దీనికి విస్తృత ప్రచారం కల్పించే విధంగా ప్రకటనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఎంగా జగన్ పదవి చేపట్టిన తర్వాత విజయవాడలో వివిధ దేశాల రాయబారులతో కలిసి డిప్లమాటిక్ సదస్సు నిర్వహించారని, తర్వాత కరోనాతో పెట్టుబడుల సమావేశాలు నిర్వహించలేకపోయామని చెప్పారు. రాష్ట్రంలోని పెట్టుబడుల అవకాశాలు, వనరులను వివరిస్తూ తైవాన్, యూఏఈ, జర్మనీ, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లోను, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, అహ్మదాబాద్ వంటి నగరాల్లోను రోడ్‌షోలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈ, మారిటైమ్ రంగాలపై రెండు భారీ సదస్సులను నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సదస్సులకు ఈవెంట్ పార్టనర్‌గా సీఐఐ, నాలెడ్జ్ పార్టనర్‌గా కేపీఎంజీ వ్యవహరించనున్నాయని తెలిపారు. వీటి ప్రచారానికి ఈవెంట్ మేనేజర్ ఏజెన్సీ కోసం టెండర్లు పిలిచామన్నారు.

అవకాశం కల్పిస్తే.. ఈ రోజునుంచే విశాఖను రాజధాని చేస్తాం..

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకోసం జరుగుతున్న ఈ కార్యక్రమానికి మీడియాతో సహా అందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. విలేకరుల అడిగిన ప్రశ్నకు బొత్స సమాధానమిస్తూ విశాఖను రాజధాని చేయాలన్నది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. అవకాశం కల్పిస్తే ఈ రోజునుంచే విశాఖను రాజధానిని చేస్తామని చెప్పారు. అంతకుముందు మంత్రులు రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, వాణిజ్యం, ఐ.టి. శాఖల అధికారులు, సీఐఐ, కేపీఎంజీ అధికారులతో సమావేశమై సమ్మిట్ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్వలవన్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, పరిశ్రమలు, వాణిజ్యశాఖ సంచాలకులు జి.సృజన, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి టి.విజయకుమార్‌రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి సుందర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రేపటి నుంచి విశాఖలో గ్లోబల్ హెల్త్‌కేర్ సమ్మిట్

- వర్చువల్‌గా ప్రసంగించనున్న సీఎం జగన్
- 7న ఏపీ, తెలంగాణ గవర్నర్లు హాజరు
- 8న బీచ్‌రోడ్డులో వాక్
- హాజరుకానున్న దేశవిదేశాల వైద్యులు


మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖలో శుక్రవారం నుంచి మూడురోజులు జరగనున్న గ్లోబల్ హెల్త్‌కేర్ సమ్మిట్‌లో చిన్నపిల్లల వ్యాధుల నుంచి క్యాన్సర్ వంటి రోగాల వరకు విస్తృత చర్చ జరుగుతుందని ఏపీ రిటైర్డ్ డీఎంఈ టి.రవిరాజు, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు చెప్పారు. స్థానిక హోటల్ నోవాటెల్‌లో జరిగే సమ్మిట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. వారు బుధవారం ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీనియర్ వైద్యులు, వైద్యులతో జరిగిన సమావేశంలో సమ్మిట్‌కు సంబంధించిన విషయాలపై చర్చించారు. బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజెన్ (ఏఏపీఐ) అధ్యక్షుడు డాక్టర్ రవి కొల్లి ఆధ్వర్యంలో మానసిక వైద్యం, నెఫ్రాలజీ, చిన్నారుల ఆరోగ్యం, హృద్రోగ సమస్యలపై విస్తృతస్థాయిలో చర్చలు జరుగుతాయని చెప్పారు. అమెరికాలో స్థిరపడిన 100 మంది ఇండియన్ వైద్యులతో కలిపి మొత్తం 450 మంది వైద్యులు సమ్మిట్‌కు హాజరవుతారన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా సదస్సులో ప్రసంగిస్తారని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని చెప్పారు. 7న ఏపీ, తెలంగాణ గవర్నర్లు విశ్వభూషణ్ హరిచందన్, తమిళిసై పాల్గొంటారని తెలిపారు. 8న ఆర్.కె.బీచ్‌లో నిర్వహించే వాక్‌ను రియర్ అడ్మిరల్ రాజారవి ప్రారంభిస్తారన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అభిజిత్ షేత్, డాక్టర్ శ్రీధర్ చిలిమూరి, ఏఏపీఐ అధ్యక్షుడు డాక్టర్ రవి కొలి హాజరవుతారని చెప్పారు.

అస్థిర చార్జీలా.. అవేంటి?

- విద్యుత్ రంగ పరిభాషలో అటువంటివేమీ లేవు
- పచ్చ పత్రిక తప్పుడు రాతలను ఖండించిన మంత్రి పెద్దిరెడ్డి, ఇంధన శాఖ

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగ పరిభాషలో అస్థిర చార్జీలు అంటూ ఏమీ ఉండవని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధన శాఖ అధికారులు స్పష్టంచేశారు. హిందుజా సంస్థ విజ్ఞప్తి మేరకు రూ.2,300 కోట్లు ఫిక్స్‌డ్, అస్థిర చార్జీలు చెల్లించాలంటూ డిస్కంలపై ఒత్తిడి చేస్తున్నట్లు పచ్చ పత్రిక కథనంలో పేర్కొనడం పూర్తిగా బాధ్యతా రాహిత్యమని చెప్పారు. పచ్చ పత్రికలో వచ్చిన కథనాన్ని వారు బుధవారం తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో విద్యుత్ ఒప్పందాల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని, ఏ ఒక్కరికీ అనుకూలంగా పని చేయడం లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ఆదరణ పొందుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురద చల్లుతూ, ముఖ్యమంత్రిని ఇరుకున పెట్టాలన్న దురుద్దేశంతోనే తోక పత్రిక వక్రీకరణలతో కథనాన్ని ప్రచురించిందని మంత్రి మండిపడ్డారు. ఈ మేరకు ఇంధన శాఖ అధికారులు ప్రకటన విడుదల చేయగా... మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడారు.

- హిందుజా నుంచి విద్యుత్ కొనుగోలు చేసిన వ్యవహారంలో అప్పిలేట్ ట్రిబ్యునల్ నిర్ణయించిన మేరకు డిస్కంలు యూనిట్‌కు రూ.3.82 చెల్లించాలని సుప్రీంకోర్టు సైతం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా గతంలో విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) యూనిట్ రేట్‌ను స్థిర, చర వ్యయాలుగా విభజించింది. దీనిలో స్థిర వ్యయంగా రూ.1.06, చర వ్యయంగా రూ.2.76 నిర్ణయించింది.



- డిస్పాచ్ సూత్రాలకు అనుగుణంగా, స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ సూచనల మేరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు స్థిర చార్జీలు చెల్లిస్తారు. ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న కాలానికి హిందుజా స్థిర చార్జీలను క్లెయిమ్ చేసింది.
- విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, వాటికి అనుగుణంగా చెల్లింపుల ప్రస్తావన ఏపీఈఆర్సీ ఉత్తర్వులలో లేవంటూ పచ్చ పత్రిక చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. 1998 నాటి విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి, దాని కొనసాగింపు ఒప్పందానికి అనుమతిస్తూ గతేడాది ఆగస్టు 1న ఏపీఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా కొనుగోలు ఒప్పందం (పీపీఏ)లోని నిబంధనల ప్రకారం విద్యుత్ పంపిణీ సంస్థలకు బాధ్యతలు ఉంటాయని పేర్కొంది.
- హిందుజాతో చేసుకున్న ఒప్పందాన్ని 2018లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవటం సహేతుకం కాదని అప్పిలేట్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు కూడా తప్పుపట్టాయి. స్థిర ఛార్జీల కోసం పంపిణీ సంస్థలకు (డిస్కం) హిందుజా సంస్థ సమర్పించిన దరఖాస్తు మీద ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సుప్రీం కోర్టు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలను పరిశీలించిన తరువాత, వాటి మేరకే నిర్ణయం తీసుకుంటుంది.
- టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. విద్యుత్ రంగం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టగానే విద్యుత్ ఒప్పందాలను సమీక్షించారు. రాష్ట్రంపై అదనపు భారం పడకుండా, ప్రజలపై విద్యుత్ చార్జీల మోత లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.